ప్రజాపక్షం 7th ANNIVERSARY 22nd October, 2025

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

రక్తపాతం ముగిసిపోలే

భరించలేని ఒత్తిడితోనే బిఎల్‌ఒలు మృతి

గ్యాంగ్‌స్టర్ అన్మోల్ బిష్ణోయ్‌ను భారత్‌కు తీసుకొచ్చిన ఎన్ఐఎ

ఢిల్లీలో పేలుడు భద్రతా చేసిన తప్పిదం

05

సంపుటి 08, సంచిక: 349 | గురువారం | 20-11-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## పంచాయతీ ఎన్నికలకు ఎన్నికల సంఘం కసరత్తు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. పంచాయతీల ఓటరు జాబితాను సవరించేందుకు ఎన్నికల కమిషన్ మరోసారి బుధవారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈనెల 23 వరకు ఓటరు జాబితాను సవరించి, తుది జాబితాను ప్రకటించనున్నారు. గురువారం ఓటర్ల దరఖాస్తులు, తప్పుల సవరణ, అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఇందులోని అభ్యంతరాలను పరిష్కరించి, 23న తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ చేయనున్నట్టు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. కాగా ఓటర్లు తమ పేరు జాబితాలో ఉందో లేదో తెలుసుకునేందుకు, అవసరమైన సవరణలను చేసుకునేందు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించింది.

ప్రభుత్వ హాస్పిటళ్లలో వృద్ధులకు ప్రత్యేక వైద్య సేవలు

'స్కిల్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా'గా తెలంగాణ

పోలీసులపై లంచం ఆరోపణలు వస్తే ఉపేక్షించొద్దు

03

## 'మావోయిస్టుల ప్రభుత్వ హత్యల'పై

# సమగ్ర న్యాయ విచారణ



"మనుషులను చంపినంత మాత్రాన, సిద్ధాంతాలను, భావాలను చంపడం సాధ్యం కాదనే విషయం మానవ చరిత్ర చెబుతోంది. మావోయిస్టులు తమ కుటుంబాలను, జీవితాలను వదులుకుని అడవుల్లో జీవిస్తున్నారు. వారు ఏ సమస్యల కోసం అడవి బాట పట్టారో ఆ సమస్యల పరిష్కారానికి ఆలోచించాలి. మావోయిస్టులను చంపేస్తే అటవీ ప్రాంతాల్లో ఉన్న విలువైన ఖనిజాల విషయాన్ని ఎవ్వరూ అడిగేవారు ఉండబోరని కేంద్రం భావిస్తోంది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశాన్ని జంగల్ రాజ్‌గా మారుస్తోంది.

– కూనంనేని

- న్యాయస్థానాలు సుమోటోగా కేసులు ఎందుకు స్వీకరించడంలేదు
- కోర్టుల మౌనం నష్టదాయకం
- తక్షణమే ఎన్‌కౌంటర్లు నిలిపివేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్
- నేడు మావోయిస్టుల ఏకపక్ష హత్యలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎన్‌కౌంటర్ పేరుతో 'మావోయిస్టుల ప్రభుత్వ హత్యల'పైన వెంటనే సమగ్ర న్యాయ విచారణ చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఒక దొంగను చంపినా సుమోటోగా కేసులను స్వీకరించే న్యాయస్థానాలు మావోయిస్టుల విషయంలో మాత్రం స్పందించడం లేదని, న్యాయస్థానాల మౌనం చాలా నష్టదాయకమని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే తక్షణమే కోర్టులు స్పందించి విచారణ చేపట్టాలని ఆయన న్యాయ స్థానాలను కోరారు. ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 'మావోయిస్టుల ఏక పక్ష హత్యల'పైన హైదరాబాద్, మఖ్దూం భవన్‌లో వామపక్ష, ప్రజాస్వామిక మేధావులతో గురువారం ఉదయం 11గంటలకు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహాతో కలిసి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎన్‌కౌంటర్ పేరుతో చంపిన మావోయిస్టుల ఘటనలు, వారి కుటుంబ నేపథ్యం సమగ్ర వివరాలపైన ఒక శ్వేతప్రతం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మావోయిస్టు నాయకుడు హిడ్మా రక్షణ కోసం లొంగిపోయే అవకాశాలు ఉంటే, సంప్రదింపులు జరపాల్సిన వారు, ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌కౌంటర్లు ఆగబోవని కేంద్ర మంత్రి బండి సంజయ్ చెబుతున్నారని, ఎన్‌కౌంటర్‌కు, ఫేక్‌ఎన్‌కౌంటర్‌కు తేడా లేకుండా బండి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. 2026 మార్చి నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తామని కేంద్రహోం మంత్రి అమిత్‌షా ప్రకటించారని గుర్తు చేశారు. కాల్పులను విరమించిన వారిపైన ఏకపక్షంగా కాల్పులు జరపడం ఇదేం యుద్ధధర్మమని, మనుషులను చంపడం ఒక ఫ్యాషన్‌గా మారిందని అన్నారు. రాహుల్‌గాంధీ తన తండ్రి రాజీవ్‌గాంధీని చంపిన దోషులకు క్షమాబిక్ష పెట్టాలని కోరిన విషయాన్ని

తరువాయి 2లో

## మారేడుమిల్లిలో మళ్లీ ఎన్‌కౌంటర్

# ఏడుగురు నక్సల్స్ మృతి




హతుల్లో మావోయిస్టు కీలక నేత టెక్ శంకర్

- ఘటనాస్థలం నుంచి ఆయుధాల స్వాధీనం
- కొనసాగుతున్న గాలింపు
- హిడ్మా ఎదురుకాల్పుల్లోనే మృతి చెందారు
- ఇంటెలిజెన్స్ డిజి మహేశ్‌చంద్ర

రంపచోడవరం/చింతూరు/పెద్దాపురం

మరోమారు ఏజెన్సీ ప్రాంతం కాల్పుల మోతతో దద్దరిల్లింది. ఎపిలోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలం జి.ఎం.వలస సమీపంలోని అటవీ ప్రాంతం లో బుధవారం తెల్లవారు జామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మతి చెందారు. మృతుల్లో మావోయిస్టు కీలక నేత మేటూరి జోగారావు అలియాస్ టెక్ శంకర్ తో పాటు నరేశ్, షమ్మీ , గణేష్ మహిళా మావోయిస్టులు జ్యోతి , అనిత, సైను ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి

తరువాయి 2లో

## లొంగిపోతానన్న హిడ్మా ఎన్‌కౌంటర్ ఎలా అయ్యాడు?

- మోదీ మెప్పు కోసమే ఎపి ప్రభుత్వం స్కెచ్ వేసినట్లు అనుమానాలు
- ముందుగా వరంగల్ పోలీసుల ముందు తన కుమార్తెను సరెండర్ చేసిన హిడ్మా
- తాను సరెండర్ కావాలనుకున్న తరుణంలో ఎన్‌కౌంటర్

ప్రజాపక్షం/హైదరాబాద్

మావోయిస్టు పార్టీ అగ్ర నాయకుడు, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి మడావి హిడ్మా అలియాస్ సంతోష్ నేడో రేపో లొంగిపోయేందుకు సిద్ధమౌతున్నారే వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆయనతో సహా ఆయన భార్య మృతి చెందారనే వార్త అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఎపిలోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమనే వాదనలు వినిపిస్తున్నాయి. హిడ్మా గత నెలలోనే లొంగిపోయేందుకు మార్గం సిద్ధం చేసుకున్నారని, ఈ మేరకు ఎపికి చెందిన ఓ నిఘా అధికారితో టచ్‌లో ఉన్నారనే వాదనలకు ఇటీవలే హిడ్మా కుమార్తె కేశా వరంగల్ పోలీసుల ముందు లొంగిపోయి

తరువాయి 2లో




## పరిస్థితులు మారాయి.. మనమూ మారాలి

అజ్ఞాతం వీడి ప్రజల్లోకి రావాలంటూ మావోయిస్టులకు మల్లోజుల పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలో పరిస్థితులు మారాయి..అందుకు తగ్గట్టుగా మనం కూడా మారాలి అని ఇటీవలో జనజీవన స్రవంతిలోకి వచ్చిన మాజీ మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ మావోయిస్టులను కోరారు. అజ్ఞాతం

తరువాయి 2లో



"చీరల పంపిణీని పండుగ వాతావరణంలో నిర్వహించాలి. ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలి. బుధవారం నుంచి డిసెంబరు 9 వరకు గ్రామీణ ప్రాంతాలలోని 18 ఏళ్లు నిండిన మహిళలకు చీరల పంపిణీ పూర్తి చేయాలి. అందుకు 65 లక్షలు అందుబాటులో ఉంచాం. పట్టణ ప్రాంతాలలో మార్చి 1 నుంచి 8వ తేదీ వరకు 35 లక్షలు చీరలు పంపిణీ చేయాలి.

– సిఎం రేవంత్‌రెడ్డి

## అంతర్జాతీయ మార్కెట్‌కు

# మహిళా ఉత్పత్తులు

అమెజాన్‌తో ఒప్పందానికి సంప్రదింపులు జరుపుతున్నాం

ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన

- మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్
- చీరల పంపిణీకి ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిని నియమించాలని కలెక్టర్లకు ఆదేశం
- అర్హులైన ప్రతీ మహిళకూ అందుతుందని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ వ్యాప్తంగా మహిళా సంఘాలు ఉత్పత్తి చేస్తున్న వివిధ వస్తువులను ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు అమెజాన్‌తో సంప్రదింపులు చేస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహానికి సిఎం ఎ.రేవంత్ రెడ్డి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లాలలోని మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎం మాట్లాడారు. తెలంగాణలోని ఆడ బిడ్డలకు పుట్టింటి వాళ్లు అన్నదమ్ములు సారె చీరె పెట్టడం సాంప్రదాయమని, అలాగే రాష్ట్రంలోని ప్రతీ ఆడబిడ్డను తోబుట్టువుగా భావించి తమ ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతీ మహిళకు చీర అందిస్తుందని సిఎం అన్నారు. తెలంగాణలోని అర్హులైన కోటి మంది మహిళలకు చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు సిఎం తెలిపారు. ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ ప్రక్రియకు సంబంధించి ప్రతీ నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని కలెక్టర్లను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. 'మహిళా ఉన్నతి –తెలంగాణ ప్రగతి' పేరిట చీరల పంపిణీ కార్యక్రమాలను

తరువాయి 2లో







## చట్టసభల్లో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం తగ్గడంతో కార్పొరేట్ల

# ఆగడాలు మితిమీరుతున్నాయ్

- ప్రజాస్వామ్యవాదులు, కమ్యూనిస్టులు తిప్పి కొట్టాలి
- మతోన్మాదుల మెడలు వంచేది వామపక్షాలే
- చరిత్రను తొక్కిపెడితే ప్రజలే బుద్ధి చెబుతారు
- ప్రచార జాతాల్లో పలువురు వక్తలు

ప్రజాపక్షం/చౌటుప్పల్/వరంగల్ / హైదరాబాద్

చట్టసభలలో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం తగ్గడం వల్ల కార్పొరేట్ శక్తులు ఆగడాలు మితిమీరిపోతున్నాయని, దేశంలో ఉన్న సహజ సంపదను కార్పొరేట్లకు పంచిపెట్టే విధానాలను ఈ పాలక ప్రభుత్వాలు రూపొందిస్తున్నాయని, వీటిని ప్రజాస్వామ్యవాదులు, కమ్యూనిస్టులు తిప్పి కొట్టాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, ఇ.టి. నర్సింహ్మా, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యురాలు పశ్యపద్మ పిలుపునిచ్చారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా చేపట్టిన ప్రచార జాతాలు బుధవారం నల్లగొండ, యాదాద్రి, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, భూపాలపల్లి జిల్లాలో కొనసాగాయి. కాగా, గద్వాల్ నుంచి ప్రారంభమైన ప్రచార జాతా మంగళవారం చౌటుప్పల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వందేళ్ళ ఘనమైన చరిత్ర కలిగి, ప్రజా ఉద్యమాల సారథిగా నిలిచిన పార్టీ సిపిఐ అని

తరువాయి 12లో




## ఎన్‌డిఎ శాసనసభాపక్ష నేతగా

# నితీశ్‌కుమార్ ఎన్నిక

సిఎం పదవికి రాజీనామా, గవర్నర్ ఆమోదం

నేడు బిహార్‌లో కొలవుదీరనున్న కొత్త ప్రభుత్వం



**పాట్నా :** బిహార్‌లో కొత్త ప్రభుత్వం కొలువు దీరనుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌కు సమర్పించారని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు దిలీప్ జైస్వాల్ తెలిపారు. నితీశ్ రాజీనామాను గవర్నర్ ఆమోదించి, కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరారని జైస్వాల్ విలేకరులకు తెలిపారు. రాజ్ భవన్ పర్యటన సందర్భంగా కుమార్‌తో పాటు కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్, ఆర్‌ఎల్ఎం చీఫ్ ఉపేంద్ర కుష్వా, ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ఉన్నారు. గురువారం ఉదయం 11 గంటలకు పాట్నాలోని చరిత్రాత్మక గాంధీ మైదానంలో నితీశ్ కుమార్ రికార్డు స్థాయిలో 10వసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అంతకు ముందు పాట్నాలో జరిగిన సంకీర్ణ భాగస్వాముల నుండి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల సమావేశంలో జెడియు అధినేత నితీష్ కుమార్‌ను బిహార్‌లో ఎన్‌డిఎ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర మంత్రి

తరువాయి 12లో

## రాష్ట్ర ప్రగతిని ప్రపంచానికి చూపేందుకే

# 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యం

- మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యసాధనలో ప్రతీ శాఖ భాగస్వామి కావాలి
- గ్లోబల్ సమ్మిట్‌కు దేశం, ప్రపంచంలోని ప్రముఖ కంపెనీల సిఇఒలను ఆహ్వానిస్తున్నాం
- 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనపై వార్ రూమ్ సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ రాష్ట్రం గత రెండేళ్లలో సాధించిన ప్రగతి, రాష్ట్ర భవిష్యత్తును ప్రపంచానికి చూపడమే 'తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్' లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాభవన్‌లో బుధవారం సాయంత్రం అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో కలిసి ఏర్పాటు చేసిన '2047 విజన్ డాక్యుమెంట్ వార్ రూమ్' సమావేశంలో ఆయన ప్రసంగించారు. 'మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్య సాధన

తరువాయి 12లో

## ట్రిబ్యునల్స్ సంస్కరణల చట్టంలో

# కీలక నిబంధనలు రద్దు

- న్యాయ వ్యవస్థపై పార్లమెంటు పెత్తనం చేయకూడదు
- కేంద్రానికి షాక్ ఇచ్చిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** నియామకాలకు సంబంధించి ట్రిబ్యునల్స్ సంస్కరణల చట్టం (2021)లో ఉన్న కీలకమైన నిబంధనలను సుప్రీంకోర్టు రద్దుచేసింది. న్యాయస్థానం జారీ చేసిన మార్గదర్శకాలను పదే పదే ఉల్లంఘించడంపై 137 పేజీల తీర్పులో ధర్మాసనం కటువైన పదజాలంతో కేంద్ర ప్రభుత్వానికి మొట్టికాయ వేసింది. ఒక జాతీయ ట్రిబ్యునల్ కమిషన్‌ను స్థాపించాలని కేంద్రానికి తాజా మార్గదర్శకత్వం చేసింది. ట్రిబ్యునల్స్ సంరక్షణకు, వాటి నిబంధనల రూపకల్పనకు, బాహాటత్వానికి, నియామకాలో ఏకీకృత విధానం పాటించడానికి జాతీయ కమిషన్ ఆవశ్యకత ఎంతో ఉందని పేర్కొంది. దీంతో కేంద్ర ప్రభుత్వం పెద్ద కుదుపునకు గురైనట్లయింది. తిరస్కరించిన నిబంధనలనే మళ్ళీ మళ్ళీ చట్టరూపంలో తెస్తున్నారని, ఇది 'కొత్త సీసాలో పాతసారా' వ్యవహారంగా మారిందని మండిపడింది. ఏదైనా ఒక నిబంధన చెల్లుబాటు కాదని రద్దు చేస్తే న్యాయవ్యవస్థ నిర్ణయానికి విరుద్ధంగా పార్లమెంటు వ్యవహరించి మళ్ళీ దానినే ఆమోదించి పెత్తనం చేయాలని చూడకూడదని హితవు చెప్పింది. న్యాయ వ్యవస్థ ఒక లోపాన్ని గుర్తించి ఎత్తి చూపిస్తే, పార్లమెంటు నిర్దేశిత షరతులకు అనుగుణంగా దానిలో మార్పులు చేయడం, తొలగించడం, రాజ్యాంగబద్ధంగా పునర్వ్యస్థీకరించడం వంటి చర్యల ద్వారా ఆ లోపాన్ని శాసనపరంగా సరిదిద్దే ప్రయత్నం చేయాలని చాలా స్పష్టంగా ధర్మాసనం

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## చిలీలో మంచు తుఫాను... ఐదుగురు టూరిస్టులు మృతి

**శాంటియాగో:** శీతకాలం భయంకరమైన గాలులు, మంచు తుఫాను ప్రమాదంలో చిక్కుకున్న ఐదుగురు పర్యాటకులు చిలీ పాతగోనియా ప్రాంతంలో మరణించారు. గ్రానైట్ పర్వత శిఖరాలకు, విభిన్న జాతి జీవుల సంచారానికి, మంచు కొండలకు నిలయంగా ఉండే చిలీ దక్షిణ ప్రాంతంలో పర్యాటకులు సంచరిస్తున్న సమయంలో వారు తీవ్ర శీతగాలులు, మంచు ప్రమాదంలో చిక్కుకుని మరణించారు. దేశరాజధాని చిలీకి దక్షిణంగా 2,800 కి.మీ దూరంలో ఈ ఘటన సంభవించింది. తొలుత ఏడుగురు పర్యాటకులు గల్లంతైనట్లు వార్తలు వెలువడ్డాయి. ఐతే నలుగురు పర్యాటకులను సజీవంగా వెలికి తీశారు. ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. గత ఏడాది ఈ పర్వత ప్రాంతాలను3.67 లక్షలమంది పర్యాటకులు సందర్శించి ఎంజాయ్ చేశారు. 1978లో యునెస్కో ఈ ప్రాంతాన్ని బయోస్ఫియర్ రిజర్వు ప్రాంతంగా గుర్తించింది. చిలీ దేశాధ్యక్షుడు గాబ్రియేట్ బోరిక్ ఎక్స్ వేదికగా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

## చైనా మార్కెట్లో జపాన్ సీఫుడ్ విక్రయాలు నిషేధం

### తైవాన్‌పై తకైచి వ్యాఖ్యలకు మండిపాటు

**బీజింగ్ :** చైనా–జపాన్ మధ్య వివాదం ముదురుతున్నది. తాజాగా జపాన్ సముద్ర ఆహార ఉత్పత్తులను తమ మార్కెట్‌లో విక్రయాలను అడ్డుకుంటూ చైనా ఉత్తర్వులు జారీ చేసింది. జపాన్ దౌత్య వర్గాలకు సాధారణ సమాచార మార్గాల ద్వారా ఈ విషయం స్పష్టం చేసింది. ఒకవేళ బలవంతంగా చైనాకు జపాన్ సముద్ర ఆహార ఉత్పత్తులను ఎగుమతి చేసినప్పటికీ వాటికి మార్కెట్‌లలో ప్రవేశం ఉండదని చైనా స్పష్టం చేసింది. జపాన్ సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల విషయంలో నియంత్రణలు పాటించలేదని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మావో నింగ్ ప్రకటించినప్పటికీ దీనికి వెనుక అసలు కారణం అదికాదని, తైవాన్‌పై తకైచీ వ్యాఖ్యలకు ప్రతీకారంగా ఈ నిషేధం విధించారని జపాన్ పత్రికలు వ్యాఖ్యానించాయి. మావోనింగ్ తకైనా వ్యాఖ్యలను కూడా ప్రస్తావిస్తూ, తైవాన్ ప్రస్తావన తీసుకురావడంవల్ల చైనా ప్రజలు చాలా ఆగ్రహంతో ఉన్నారనీ, ఈ పరిస్థితుల్లో జపాన్ సముద్ర ఉత్పత్తులను తమ దేశంలోకి అనుమతించనా ఉపయోగం ఉండదన్నారు. జపాన్ సీ ఫుడ్‌పై చైనా తిరిగి ఆంక్షలు విధించిందని జపాన్ పత్రికలు వార్తలు ప్రచురించాయి. జపాన్ కొత్త ప్రధానమంత్రి తకైచీ అధికారంలోకి వచ్చినప్పటినుండీ చైనాకు, జపాన్‌కు మధ్య వాగ్వాదం పెరిగింది. తైవాన్‌పై తకైచీ చేసిన వ్యాఖ్యలపై చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ తీవ్రస్థాయిలో మండిపడింది. ఒకవేళ తైవాన్‌పై చైనా దాడి చేస్తే అది జపాన్ మనుగడకు ప్రమాదంగా మారుతుందని, అలాంటి సమయాల్లో సైనిక జోక్యం అవసరం పడుతుందని పార్లమెంటు సభ్యులను ఉద్దేశించి తకైచీ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. దీంతో చైనా–జపాన్ మధ్య వాగ్వాదం రగులుకుని ఇంతదాకా వచ్చింది.

## ఎప్స్టీన్ ఫైల్స్ విడుదలకు రంగం సిద్ధం

### భారీ మద్దతుతో దిగువసభలో బిల్లు ఆమోదం

**వాషింగ్టన్:** లైంగిక కార్యకలాపాల నేరస్థుడు, ఫైనాన్సియర్ జెఫ్రీ ఎప్స్టీన్ (1953–2019) కు సంబంధించిన వేలాది పత్రాలు,ఫైల్స్ విడుదల చేసేందుకు అమెరికా న్యాయశాఖకు అనుమతి లభించింది. ఇందు కు వీలుగా అమెరికా దిగువ సభ బిల్లుకు ఆమోదం తెలియజేయడంతో మార్గం సుగమమైంది. అమెరికాలో ట్రంప్ లాంటి అనేకమంది ప్రముఖుల జాతకాలు జెఫ్రీ ఎప్స్టీన్ వద్ద నిక్షిప్తమై ఉన్నాయి. ఎవరికీ తెలియకుండా ఈ సమాచారాన్ని ఎప్స్టీన్ రికార్డు చేసి బ్లాక్‌మెయిల్ చేశాడు. దిగువసభలో భారీ ఎత్తున 427–1 తేడాతో ఈ బిల్లుకు ఆమోద ముద్ర పడింది. ఇప్పుడు బిల్లు దేశాధ్యక్షుడు ట్రంప్ సంతకం కోసం ఆయన టేబుల్‌మీదకు వెళుతుంది. ట్రంప్ పిలుపు మేరకు అమెరికా అధికారపార్టీ సభ్యులు కూడా ఈ బిల్లుకు అనుకూలంగా ఓటు వేశారు. ఐతే ఈ విషయంలో రిపబ్లికన్‌పార్టీలో విభేదాలు తలెత్తాయి. జెఫ్రీ ఎప్స్టీన్‌తో ట్రంప్‌కు ఉన్న సంబంధాలు ఇప్పటికే బయటపడ్డాయి. దీంతో ఆయన వెనక్కు తగ్గుతున్నారు. పూర్వపు వైఖరిని సడలించుకున్న కొత్త పద్ధతిలో ఆయన ముందుకు వెళుతున్నారు. ఎప్స్టీన్‌తో, ఈ సెక్స్ స్కాండల్స్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

## ఉక్రేన్ ఆకాశహర్మ్యాలపై దాడులు

### 25 మంది మృతి
### ఐదు ఇంధన కేంద్రాలు ధ్వంసం

**కీవ్:** గడచిన రెండు నెలలుగా ఉక్రేన్‌పై యుద్ధాన్ని ఉధృతం చేసిన రష్యా బుధవారం పశ్చిమ ఉక్రేన్‌లోని 192 ప్రాంతాలపై దాడులు చేసింది. ఆకాశ హర్మ్యాలపై జరిపిన దాడుల్లో 25 మంది మరణించారు. 73 మంది గాయపడ్డారు. వీరిలో 14 మంది పిల్లలు ఉన్నారు. పలువురు శిథిలాల్లో చిక్కుకుని ఉంటారని భయపడుతున్నారు. లెవివ్, ఇవానో ఫ్రాంకివ్స్క్ ప్రాంతాలు బాగా నష్టపోయాయి. అనేక ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 2022 ఫిబ్రవరిలో ఉక్రేన్‌పై రష్యా పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించిన తర్వాత జరిగిన అతిపెద్ద దాడి ఇదే. ఇవానోవ్ ఫ్రాంకెస్కీ ప్రాంతంలో మరో ఐదు ఇంధన వనరుల మౌలిక సదుపాయాలపై కూడా దాడులు జరగడంతో అపారనష్టం వాటిల్లింది. అదేవిధంగా ఉక్రేన్ కూడా రష్యాలోని పలు ప్రాంతాలపై డ్రోన్లతో దాడులు చేసింది. 91 రష్యా డ్రోన్లను కూల్చివేసినట్లు ఉక్రేన్ సైన్యం ప్రకటించగా, అజోవ్, బ్లాక్ సీ ప్రాంతాలలో ఉక్రేన్ సైనికులు డ్రోన్ దాడులు చేశారనీ, వీటిల్లో 65 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా సైన్యం ఒక ప్రకటనలో తెలియజేసింది.



ఈ దాడుల్లో ఐదుగురు గాయపడ్డారు. కాగా పశ్చిమ ఉక్రేన్ టెర్నోపిల్ ప్రాంతంలో ఆకాశ హర్మ్యాలపై రష్యా క్షిపణలు, డ్రోన్లు విరుచుకుపడ్డాయి. మొత్తం 476 డెకాయ్ డ్రోన్లు, 48 క్షిపణులతో రష్యా దాడులు చేసిందని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ విమర్శించారు. ఈ దాడుల్లో అనేకమంది శిథిలాలలో చిక్కుకుపోయి ఉంటారని ఆందోళన వ్యక్తం చేశారు. చాలామంది ఉక్రేన్ పౌరులు భయపడి మెట్రో స్టేషన్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో రాత్రి పూట నిద్రిస్తున్నారు. శీతాకాలం సమీపిస్తూ ఉండటంతో ఉక్రేన్, రష్యాలలో ఇళ్ళల్లో వేడి వాతావరణం సృష్టించేందుకు విద్యుత్, గ్యాస్ సరఫరా ఎంతో ముఖ్యం. దీనిని దృష్టిలో పెట్టుకునే రష్యా సైన్యం ఉక్రేన్ ఇంధన కేంద్రాలను, సంబంధిత మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటున్నది. లెవివ్ ప్రాంత గవర్నర్ మాట్లాడుతూ, ఇంధన కేంద్రాలపై దాడులు జరిగాయన్నారు.

### టర్కీలో చర్చలేమీ లేవు : పెస్కొవ్


యుద్ధం ముగించేందుకు ట్రంప్ ఇచ్చిన పిలుపు మేరకు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మూడు యూరప్ దేశాల పర్యటన ముగించుకుని టర్కీ చేరుకున్నారు. టర్కీ దేశాధ్యక్షుడు రెసిప్ తయ్యప్ ఎర్డొగాన్‌తో చర్చలు జరుపుతారు. రష్యా ప్రతినిధి కిరిల్ దిమిత్రేవ్‌తో రష్యా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్‌తో అంకారాలో చర్చలున్నాయన్న విషయాన్ని రస్యా ప్రతినిధి దిమ్రీ పెస్కోవ్ ఖండించారు. టర్కీలో ఎలాంటి చర్చలూ జరగడంలేదన్నారు. ఉక్రేన్‌తో చర్చల పునరుద్ధరణకు తాము ఎలాంటి సుముఖతా వ్యక్తం చేయలేదని స్పష్టం చేశారు. గురువారం ఇస్తాంబుల్‌లో చర్చలు జరుగుతాయన్న సంకేతాలేమీ తమవద్ద లేవన్నారు.

### ఉక్రేన్‌కు 100 రఫేల్ జెట్స్

మూడు యూరప్‌దేశాలలో పర్యటించిన జెలెన్స్కీ రక్షణ ఒప్పందాలు చేసుకున్నారు. ఆర్థిక సహాయం సంపాదించారు. అదేవిధంగా ఇంధన వనరులను పెంపొందించుకోవడానికి, శీతాకాలం ఉక్రేన్‌కు ఇంధన సరఫరాలు మెరుగుపరుచుకోవడానికి ఒప్పందాలు చేసుకున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌తో చర్చలు జరిపి ఆర్థిక సహాయానికి పచ్చజెండా ఊపించారు. అదేవిధంగా రాఫెల్ యుద్ధ విమానాలు తెచ్చుకునేందుకు ఒక ఒప్పందంపై సంతకాలు చేశారు. దాదాపు 100 రాఫెల్ యుద్ధ విమానాలు తెచ్చుకోవాలని జెలెన్స్కీ ఆశిస్తున్నారు. ఫ్రాన్స్–ఉక్రేన్ మధ్య కుదిరిగిన ఈ ఒప్పందాన్ని రష్యా తీవ్రంగా వ్యతిరేకించింది. రాఫెల్ యుద్ధ విమానాల సరఫరా విచారకరమైన విసయమని పేర్కొంది.

## హసీనాను బంగ్లాదేశ్‌కు రప్పించేందుకు 'ఇంటర్‌పోల్' రెడ్ నోటీస్!

**ఢాకా:** షేక్ హసీనాను బంగ్లాదేశ్‌కు రప్పించేందుకు ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఇంటర్‌పోల్ సహాయం తీసుకోవాలని మహ్మద్ యూనుస్ నాయకత్వానగల తాత్కాలిక ప్రభుత్వం భావించింది. షేక్ హసీనా ప్రధానమంత్రిగా ఉండగా గత ఏడాది జులైలో అల్లర్లు ప్రారంభమైనప్పుడు హోంమంత్రిగా ఉన్న అసదుజ్జామన్ ఖాన్ కమల్ కూడా భారతదేశంలోనే ఆశ్రయం పొందుతున్నారు. ఈ కేసులో హసీనాకు వ్యతిరేకంగా వాదనలు వినిపించిన ప్రాసిక్యూటర్ గాజీ మహ్మద్ తమిమ్ మంగళవారం పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ ఇద్దరు దోషులను (హసీనా–ఖాన్ కమల్) అంతర్జాతీయ నేరస్థులుగా ప్రకటించేందుకు వీలుగా రెడ్ నోటీసు జారీ చేయాలని కోరుతూ ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పినట్లు బంగ్లాదేశ్ ఫైనాన్సియల్ ఎక్స్‌ప్రెస్ ప్రకటించింది. ట్రిబ్యునల్ జారీ చేసిన అరెస్టు వారెంటుతోపాటు ఈ ఇద్దరు నేరస్థులూ పరారీలో ఉన్నారన్నవిషయాన్ని ఇప్పటికే ఇంటర్‌పోల్‌కు తెలియజేశామన్నారు. ఇప్పుడు తమ దేశ విదేశాంగశాఖ ద్వారా అరెస్టు వారెంటుకు బదులుగా రెడ్ నోటీసు జారీ చేయాల్సిందిగా ఇంటర్‌పోల్‌ను అడుగుతామని తమిమ్ చెప్పారు.



వీరిద్దరికీ బంగ్లాదేశ్ అంతర్జాతీయ ట్రిబ్యునల్ కోర్టు (ఐసిటి) నవంబరు 16వ తేదీన ఉరిశిక్ష విధిస్తూ తీర్పు ప్రకటించింది. యూనుస్ ప్రభుత్వం వీరిని దేశానికి రప్పించేందుకు ఇంటర్‌పోల్‌ను ఆశ్రయిస్తారని పలు బంగ్లాదేశ్ పత్రికలు ప్రకటించాయి. వారిద్దరినీ తమ దేశానికి అప్పగించాలని న్యూఢిల్లీకి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేస్తామని బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రకటించిన తర్వాత ఈ వార్తలు వెలువడ్డాయి. ఈ కేసులో మరో నిందితుడు పోలీస్ ఉన్నతాధికారి ఛౌధురీ అబ్దుల్లా అల్–మమన్ ప్రభుత్వానికి అనుకూలంగా మారిపోవడంతో ఆయనకు కేవలం ఐదు సంవత్సరాలు జైలు శిక్ష మాత్రమే విధించారు.

## లెబనాన్‌లో శరణార్థ శిబిరంపై ఇజ్రాయెల్ దాడి

### 13 మంది మృతి

**టెల్‌అవీవ్:** హమాస్ ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుని లెబనాన్‌పై ఇజ్రాయెల్ మరోసారి గగనతల దాడి చేసింది. తీరప్రాంత నగరం సిడాన్‌లో ఉన్న శరణార్థ శిబిరంపై ఇజ్రాయెల్ సైన్యం గగనతల దాడులు చేసింది. బుధవారం జరిగి న ఈ దాడుల్లో 13 మంది మరణించారు. ఈ ఏడాది మేనెలలో ట్రిపోలీలో ఒకసారి, జులై నెలలో సిడాన్‌లో ఒకసారి ఇజ్రాయెల్ సైన్యం లెబనాన్‌లో దాడులు చేసి హమాస్ సంస్థకు చెందిన ఇద్దరు ఉన్నతశ్రేణి కమాండర్లను హతమార్చిం ది. హమాస్ ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నాగానీ తాము ఆ దేశంలో దాడులు కొనసాగిస్తామని మరోసారి ఇజ్రాయెల్ ప్రతిజ్ఞ చేసింది. ఇంతకు ముందు కూడా సెప్టెంబరు తొమ్మిదో తేదీ న దోహాలో హమాస్ అగ్రశ్రేణి నాయకులు సమావేశమైన సమయంలో కూడా ఐడిఎఫ్ దాడులు చేసింది. ఈ దాడులు తీవ్ర వివాదస్పదంగా మారాయి. ఈ విషయంలో డోనాల్డ్ ట్రంప్ కూడా ఇజ్రాయెల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శరణార్థ శిబిరం ముగుసులో లెబనాన్‌లోని సిడాన్‌లో హమాస్ నిర్వహిస్తున్న ఉగ్రవాద శిక్షణ శిబిరంపై తాము దాడులు చేశామని ఇజ్రాయెల్ ప్రభుత్వం చెబుతుండగా, శరణార్థ శిబిరాలపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేసిందని హమాస్ వాదిస్తున్నది.

ఇవన్నీ శరణార్థ శిబిరాలేననీ, ఈ ప్రాంతంలో సైనిక సంబంధమైన సామాగ్రి ఏమీ లేదని చెబుతున్నది. దీంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. శరణార్థ శిబిరంలో లో హమాస్ ఉగ్రవాదుల శిక్షణా శిబిరాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం ఒక ప్రకటనలో ధృవీకరించింది. ఈ దాడుల్లో మరో నలుగురు గాయపడినట్లు లెబనాన్ ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రకటించింది. ఇజ్రాయెల్ దేశంమీద, ఐడిఎఫ్ దళాలున్న కేంద్రాలపైన దాడులు చేసేందుకు హమాస్ ఉగ్రవాద శిక్షణా కేంద్రం నడుపుతోందని, ఈ దుశ్చర్యలు కొనసాగకుండా తాము అడ్డుకుని భవిష్యత్ కుట్రను భగ్నం చేశామని ఐడిఎఫ్ సేనలు తెలియజేశాయి. ఖచ్చితమైన నిఘాతో, తక్కువ ఆయుధాలతో సాధారణ పౌరులకు ఎలాంటి హానీ కలిగించకుండా, గూఢచారి వర్గాల సమాచారం మేరకు గురిచూసి ఈ దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ ప్రభుత్వం ప్రకటించింది.

## మనమూ మారాలి (మొదటి పేజీ తరువాయి)

వీడి ప్రజల్లోకి రావాలని ఆయన మావోయిస్టులకు పిలుపు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోలోని ఏజెన్సీ ప్రాంతం రెండు రోజులుగా వరుస ఎన్ కౌంటర్లతో దద్దరిల్లుతోంది. మారేడుమిల్లి వద్ద జరిగిన ఎన్ కౌంటర్లో ఆరుగురు మావోయిస్టులు చనిపోగా తాజాగా బుధవారం జరిగిన మరో ఎన్ కౌంటర్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ నేపథ్యంలో మాజీ మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ మీడియాకు ఒక వీడియో రిలీజ్ చేశారు. ఆపరేషన్ కగార్ కారణంగా గత కొంతకాలంగా మావోయిస్టుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఎన్ కౌంటర్ల వల్ల ఇప్పటికే పలువురు మావోయిస్టు కీలక నేతలు మృతి చెందారు. తాజాగా హిడ్మా సైతం ఎన్ కౌంటర్ అయ్యారని ఈ నేపథ్యంలో మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని వీడియో సందేశం పంపించారు. మావోయిస్టులు ప్రాణాలు కోల్పోవడం బాధ కలిగించిందన్నారు. పరిస్థితులు మారుతున్నాయి.. దేశం కూడా మారుతోంది. ఎన్ కౌంటర్లలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారు. అందుకే మావోయిస్టులు అజ్ఞాతం వీడి ప్రజల్లోకి రావాలని విజ్ఞప్తి చేశారు. లొంగిపోవాలని అనుకునే మావోయిస్టులు తన ఫోన్ నంబర్ 8856038533 ను సంప్రదించాలని సూచించారు.

## మహిళా ఉత్పత్తులు (మొదటి పేజీ తరువాయి)

చేపట్టాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సిఎం సూచించారు. నవంబరు 19 నుంచి డిసెంబరు 9 వరకు గ్రామీణ ప్రాంతాలలోని 18 ఏళ్లు నిండిన మహిళలకు చీరల పంపిణీ పూర్తి చేయాలని, ఇందుకు 65 లక్షలు అందుబాటులో ఉంచామని సిఎం తెలిపారు. పట్టణ ప్రాంతాలలో మార్చి 1నుంచి 8వ తేదీ వరకు 35 లక్షలు చీరలు పంపిణీ చేయాలని సిఎం ఆదేశించారు. అర్హులైన ప్రతి మహిళకు చీర అందుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు.ప్రజా ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ కుల సర్వే (సిపెక్) డాటాను దగ్గర పెట్టుకుని ప్రతి మహిళకు చీర అందేలా చూడాలని, చీర అందించే సమయంలో ఆధార్‌ను తీసుకోవాలని, ముఖ గుర్తింపు చేపట్టాలని సిఎం కలెక్టర్లకు సూచించారు. మహిళల ఉన్నతే లక్ష్యంగా తమ ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని సిఎం చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం వడ్డీలేని రుణాల విషయంలో నిర్లక్ష్యం వహించిందని, తాము వడ్డీలేని రుణాలు ఇవ్వడంతో పాటు అందుకు సంబంధించిన నిధులు విడుదల చేసిన విషయాన్ని సిఎం గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ రేషన్ కార్డు ఉన్న మహిళలందరికీ చీరలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థిక క్రమశిక్షణతో బ్యాంక్‌లు రుణాలు ఇచ్చేందుకు సంఘాల దగ్గరకు వస్తున్నాయని తెలిపారు. 98 శాతం రుణ చెల్లింపుతో సంఘాలు తమ క్రమశిక్షణను చాటుతున్నాయని కొనియాడారు. ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీపైనా కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టాలని సూచించారు. ఆకాశమే హద్దుగా మహిళలు ఎదగాలనే ఉద్దేశంతో ఆకాశం రంగును చీరలకు ఎంచుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ కార్యదర్శి శేషాద్రి, సిఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, సెర్ప్ సిఈఓ దివ్య దేవరాజన్, చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ తదితరులు పాల్గొన్నారు.

**మీ పెట్రోల్ బంక్ ఎలా నడుస్తోంది :** 'మీ సంఘం ఆధ్వర్యంలోని పెట్రోల్ బంక్ ఎలా నడుస్తోంది' అని నారాయణ పేట జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడిగారు. బాగా నడుస్తోందని, నెలకు రూ.4 లక్షల రాబడి వస్తోందని ఆమె సిఎంకు తెలియజేశారు. ఇతర జిల్లాల నుంచి సంఘాలను అక్కడకు తీసుకెళ్లి వారి పనితీరు, రాబడిని ప్రత్యక్షంగా చూపాలని కలెక్టర్లకు సిఎం సూచించారు..

**డిజైన్లు ఎంతో బాగున్నాయి:** 'మాకు ఇస్తున్న చీరల డిజైన్లు ఎంతో బాగున్నాయి' అని రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి కృతజ్ఞత లు తెలిపారు. 9 మీటర్లు, 6 మీటర్ల చీరలు తమకు నచ్చినట్లు ఉన్నాయని, తమకు ఎంతో సంతోషంగా ఉందని ఆమె సిఎంకు తెలియజేశారు.

**మాకు యూనిఫామ్ ఇచ్చినట్లు ఉంది :** ఇందిరామహిళా శక్తి చీరలు ఇవ్వడం ద్వారా తమకు యూనిఫామ్ వచ్చిందనే సంతోషం ఉందని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి తెలిపారు. ఈ చీరలు ధరించడం ద్వారా తమ సంఘాల మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఆమె అన్నారు.

## సమగ్ర న్యాయ విచారణ (మొదటి పేజీ తరువాయి)

కూనంనేని గుర్తు చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 12వందల మందిని చంపిందని, రెండేళ్ల కాలంలో 900ల మందిని హత్య చేసిందన్నారు. ఇప్పటికైనా ఎన్‌కౌంటర్లను నిలిపివేసి, పోలీసుల అదుపులో ఉన్నట్టు చెబుతున్న మావోయిస్టు నాయకులు తిరుపతితో పాటు అందరినీ న్యాయస్థానంలో హాజరుపర్చాలని, చట్టపరంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కొందరు అక్రమ మార్గంలో వేల కోట్లు సంపాదించిన వారు పార్లమెంట్‌లో ఉంటే, ప్రజల కోసం పనిచేసే వారు జైలులో, అడవుల్లో ఉంటున్నారన్నారు. 1952 అనుభవాలు దృష్టిలో పెట్టుకుని మావోయిస్టులు తమ మార్గాన్ని వదిలి, పేద వర్గాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి అందరూ కలిసి పనిచేసేందుకు ముందుకురావాలని కోరారు. మావోయిస్టు హత్యలపైన న్యాయపోరాటం చేసే విషయమూ ఆలోచిస్తామని, అలాగే అందరిని కలుపుకుని పోరాటం చేస్తామన్నారు.

**కఠినంగా వ్యవహరించే వాళ్ల ప్రభుతాన్ని ఎలా నడిపిస్తారు ?**

దేశంలో మనిషి ప్రాణానికి విలువ ఇవ్వడం లేదని, ప్రజాస్వామ్య దేశంలోనే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, కనీసం మానవత్వంగా వ్యవహరించకుండా, కఠినంగా వ్యవహరించే వారు (కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం) ఇక ప్రభుత్వాన్ని ఎలా నడిపిస్తారని, ఇలాంటి వారు ప్రజాస్వామ్యాన్ని కాపాడుతారా? అని కూనంనేని సాంబశివరావు దుయ్యబట్టారు. పేద వర్గాల తరపున పోరాటం చేసే వారిని, ప్రభుత్వాలను ప్రశ్నించిన వారిని గతంలో జైలు లో పెడితే, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం చిత్రహింసలకు గురి చేస్తూ చంపేస్తున్నారని, ఇందుకు హిడ్మానే నిదర్శనమన్నారు. బ్రిటీష్ కాలంలో కూడా ప్రజా సమస్యలపైన పోరాటం చేసే వారిని, ప్రశ్నించేవారిని పిలిచి మాట్లాడేవారని, కానీ ప్రస్తుతం కనిపించినవారినల్లా చంపుకుంటూ వెళ్తున్నారని, ఇలాచేస్తే సమాజంలో మనుషులు ఉంటారా? అని అన్నారు.

పుల్వామా దాడి నేపథ్యంలో చర్చలకు సిద్ధమైన కేంద్ర ప్రభుత్వం, భారతదేశానికి చెందిన, పేద వర్గాల కోసం పనిచేసే మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపబోరని నిలదీశారు. మావోయిస్టులను చంపిన వారిని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా అభినందిస్తున్నారని, ఒక దేశం మరో దేశంపైన గెలిచినట్టుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

**సిద్ధాంతాలను, భావాలను చంపడం సాధ్యం కాదు..**

మనుషులను చంపినంత మాత్రానా, సిద్ధాంతాలను, భావాలను చంపడం సాధ్యం కాదనే విషయం మానవ చరిత్ర చెబుతుందని కూనంనేని సాంబశివరావు గుర్తు చేశారు. మావోయిస్టులు తమ కుటుంబాలను, జీవితాలను వదులుకుని అడవుల్లో జీవిస్తున్నారని, వారు ఏ సమస్యల కోసం అడవి బాట పట్టారో ఆ సమస్యల పరిష్కారానికి ఆలోచించాలని సూచించారు. మావోయిస్టులను చంపేస్తే ఇక అడవీ ప్రాంతాల్లో ఉన్న విలువైన ఖనిజాల విషయం లోఎవ్వరూ అడిగేవారు ఉండబోరని కేంద్రం భావిస్తుందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశాన్ని జంగల్ రాజ్యగా మారుస్తున్నారని కూనంనేని సాంబశివరావు దుయ్యబట్టారు. బిజెపిని ప్రశ్నించే వారిని అర్బన్ నక్సలైట్లుగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. హిట్లర్ నమూనాగా పరిపాలిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ప్రజలు భయానకంగా శిక్షిస్తారని, ఇలాంటి వారు కాలగర్భంలో కలువక తప్పదని హెచ్చరించారు. నేపాల్, శ్రీలంకలో కూడా ఇదే జరిగిందని కూనంనేని గుర్తుచేశారు.

## ఎన్‌కౌంటర్ ఎలా అయ్యాడు? (మొదటి పేజీ తరువాయి)

జనజీవన స్రవంతిలోకి రావడం బలాన్ని చేకూరుస్తుంది. హిడ్మా ఇంకా తుపాకీనే నమ్ముకుని ఉంటే తన కూతురిని ఎందుకు జనజీవన స్రవంతిలోకి పంపించాడనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో హిడ్మా కూడా త్వరలో లొంగిపోతారనే ప్రచారం జోరుగా సాగింది. తన అనుచరులతో కలిసి తెలంగాణ పోలీసుల ఎదుట హిడ్మా ఆయుధాలు అప్పగించే అవకాశాలున్నాయని రాష్ట్ర నిఘా వర్గాలు అంచనా వేశాయి. గత నెల 27న 'ప్రజాపక్షం' దినపత్రికలో ''హిడ్మా లొంగుబాటుకు రంగం సిద్ధం?'' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. మరుసటి రోజే సిపిఐ (మావోయిస్టు)కీలక నేతలు, కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాద్‌రావు అలియాస్ చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాష్ అలియాస్ ప్రభాత్‌లు తెలంగాణ డిజిపి బి.శివధర్‌రెడ్డి ముందు లొంగిపోయిన విషయం తెలిసిందే. ఇదే తరహాలో హిడ్మా కూడా త్వరలో లొంగిపోతాడని అందరూ భావించినట్లుగానే అతడు పావులు కదిపాడని తెలుస్తుంది. తన లొంగుబాటును క్లియర్ చేసుకునేందుకు ఎపికి చెందిన ఓ పోలీసు అధికారితో పాటు జర్నలిస్టుకు కూడా హిడ్మా లేఖ రాశాడనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. లొంగిపోయేందుకు గ్రీన్ సిగ్నల్ వచ్చిన తరువాతనే తన భార్యతో పాటు హిడ్మా కర్రెగుట్టల నుంచి ఎపిలోకి అడుగుపెట్టినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో హిడ్మాను నమ్మించి హత మార్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2003 అక్టోబర్ 1న అప్పటి ఉమ్మడి ఎపి సిఎం చంద్రబాబును లక్ష్యంగా చేసుకుని తిరుపతిలోని అలిపిరిలో మావోయిస్టులు మందుపాతరలను పేల్చారు. ఈ సంఘటనలో చంద్రబాబు తృటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. దీంతో తనను చంపాలనుకున్న మావోయిస్టులపై సహజంగానే చంద్రబాబుకు కోపం ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మరోవైపు ప్రధాని మోదీ మెప్పు పొందేందుకే బూటకపు ఎన్‌కౌంటర్‌కు ఎపి పోలీసులు స్కెచ్‌వేసి ఉండవచ్చనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలలో రికార్డుస్థాయిలో ఇటీవలే వందలాదిమంది మావోయిస్టులు లొంగిపోయారు. ఎపిలో కూడా లొంగిపోయేందుకు హిడ్మా తన అనుచరులతో వచ్చారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ తరుణంలోనే బుధవారం ఎపిలోని సత్యసాయి జిల్లాలో ప్రధాని మోదీ పర్యటన ఖరారైంది. మోదీ వద్ద ఎపి ప్రభుత్వం సత్తా చాటుకునేందుకే లొంగిపోయేందుకు వచ్చిన హిడ్మాను బూటకపు ఎన్‌కౌంటర్‌తో హతమార్చిందా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

## ఏడుగురు నక్సల్స్ మృతి (మొదటి పేజీ తరువాయి)

అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ రంపచోడవరం పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశం లో వివరాలు వెల్లడించారు. ఈ ఆపరేషన్ కి సంభవ్ అని నామకరణం చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 13 మావోయిస్టులు హతమార్చామని, అందులో ఇద్దరు అగ్ర నేతలు ఉన్నట్లు తెలిపారు. ఆపరేషన్ సంభవ్ కొనసాగుతుందన్నారు. బుధవారం తెల్ల వారు జామున కూంబింగ్ చేస్తున్న భద్రతా దళాల కు మావోయిస్టు లు తారస పడటంతో భీకరంగా ఎదురు కాల్పులు జరిగినట్లు తెలిపారు. ఆతర్వాత ఘటనా స్థలిలో ఏడుగురు మావోయిస్టుల మత దేహాలు కనుగొన్నట్లు ఎస్పీ తెలిపారు.

మృతి చెందిన వారిలో ముగ్గురు మహిళా మావోయిస్టులతో పాటు అగ్ర నేత మేటూరి జోగారావు అలియాస్ టెక్ శంకర్ ఉన్నట్లు తెలిపారు. మృత దేహాలను రంపచోడవరం ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. కాగా, ఈ ఘటనలో రెండు ఏకే 47 రైఫిళ్లు, ఐదు మ్యాగజైన్‌లు, విప్లవ సాహిత్యం తో పాటు కిట్ బ్యాగ్ లు లభించినట్లు తెలిపారు. మంగళవారం ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతానికి ఐదు కిలోమీటర్ల దూరంలోనే ఈ ఎన్ కౌంటర్ చోటు చేసుకుంది. మతి చెందిన మెట్టూరి జోగారావు అలియాస్ టెక్ శంకర్ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు. ఏఓబీ ప్రాంతానికి ఇంచార్జ్‌గా ఉన్నారు. బాంబుల తయారీ వంటి సాంకేతిక పనుల్లో దిట్ట. టెక్నికల్ ఆపరేషన్లలో కీలక నేతగా పేరొందారు. జోగారావు శ్రీకాకుళం ప్రాంతానికి చెందినవారు.

**మిగిలిన మావోయిస్టులులొంగిపోవాలి:ఇంటెలిజెన్స్ డిజి లద్దా**

మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌ను ఏపీ ఇంటెలిజెన్స్ డీజీ మహేశ్‌చంద్ర లద్దా ధ్రువీకరించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు అందాల్సి ఉందని చెప్పారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మిగిలిన మావోయిస్టులు లొంగిపోవడం మంచిదని హితవు పలికారు. ''చత్తీస్‌గఢ్, తెలంగాణ నుంచి ఏపీకి రావడానికి మావోయిస్టులు ప్రయత్నిస్తున్నారు. పటిష్ట నిఘా ఏర్పాటు చేసి కదలికలను గమనిస్తున్నాం. నవంబరు 17న ఒక ఆపరేషన్ ప్రారంభించాం. 18న ఉదయం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. సెంట్రల్ కమిటీ మెంబర్ హిడ్మా మద్వితో పాటు మరో ఐదుగురు మావోయిస్టులు హతమయ్యారు. మరోవైపు ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో 50 మందిని అరెస్టు చేశాం. వీరిలో స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్లు ముగ్గురు, ప్లాటూన్ మెంబర్లు 23 మంది, డివిజినల్ కమిటీ మెంబర్లు ఐదుగురు, ఏరియా కమిటీ మెంబర్లు 19 మంది ఉన్నారు. ప్రజలకు ఎక్కడా హాని జరగకుండా ఈ అరెస్టులు చేశాం. దొరికిన మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు కూడా స్వాధీనం చేసుకున్నాం. మంగళవారం జరిగిన మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ తర్వాత కొందరు మావోయిస్టులు పారిపోయారు. వారిని కూడా పట్టుకునేందుకు బందాలు రంగంలోకి దిగాయి'' అని ఏడీజీ తెలిపారు. ఇక హిడ్మా ఎదురుకాల్పుల్లోనే చనిపోయారని, జర్నలిస్టులకు హిడ్మా లేఖ రాయడం గురించి తెలియదని తెలిపారు. ఆయన్ను పట్టుకున్నాక చంపారనే విషయంలో వాస్తవం లేదన్నారు. మావోయిస్టు రహిత ఆంధ్రప్రదేశ్ కోసం కషి చేస్తున్నామని తెలిపారు. మావోయిస్టుల ప్లాన్ ఏంటో, కానూరులో ఎందుకున్నారో దర్యాప్తు చేస్తున్నామన్నారు. త్వరలో చాలా మంది లొంగిపోతారని, అరెస్టుల వల్ల భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. చత్తీస్‌గఢ్‌లో చాలా చోట్ల దాడులు జరుగుతున్నాయి. దీంతో అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు మావోయిస్టులు వెళ్తున్నారు. ఈక్రమంలో వారు పట్టుబడుతున్నారు'' అని లద్దా తెలిపారు.

**కోనసీమ జిల్లాలో హిడ్మా అనుచరుడి అరెస్ట్?**

కోనసీమ జిల్లాలో మావోయిస్టు కార్యకలాపాలు కలకలం రేపాయి. మావోయిస్టు అగ్రనేత హిడ్మా అనుచరుడిగా భావిస్తున్న మడివి సరోజ్‌ను పోలీసులు రావులపాలెంలో ఈరోజు అదుపులోకి తీసుకున్నారు. అతడిని అరెస్ట్ చేసి, రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్లు సమాచారం. హిడ్మా అనుచరుడిగా ఉన్న మడివి సరోజ్ రావులపాలెంలో తలదాచుకున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందడంతో రంగంలోకి దిగిన ప్రత్యేక బందాలు అతడిని గుర్తించి అరెస్ట్ చేశాయి. అరెస్టయిన మడివి సరోజ్ స్వస్థలం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంగా గుర్తించారు. మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ తర్వాత ఏజెన్సీ నుంచి తప్పించుకుని కోనసీమ ప్రాంతానికి వచ్చాడా? లేక మరేదైనా కారణంతో ఇక్కడ ఆశ్రయం పొందుతున్నాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ అరెస్ట్‌తో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మరోసారి మావోయిస్టుల కదలికలపై చర్చ మొదలైంది.

**ఏలూరులో 15మందికి రిమాండ్**

ఏలూరులో అరెస్టు చేసిన 15 మంది మావోయిస్టులకు కోర్టు రిమాండ్ విధించింది. మొబైల్ కోర్టు న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఒక్కొక్కరిని విడివిడిగా విచారించారు. పేరు, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసులు బెదిరించారా? అని నేరుగా మావోయిస్టులను న్యాయమూర్తి ప్రశ్నించినట్లు తెలిసింది. నిందితులను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

**కాకినాడలో ఇద్దరికి రిమాండ్**

హిడ్మా ఎన్ కౌంటర్ నేపథ్యంలో కాకినాడ నుంచి తప్పించుకోవాలని ప్రయత్నించి సామర్లకోట పోలీసులకు పట్టుబడ్డ మహిళా మావోలను బుధవారం సాయంత్రం పెద్దాపురం పోలీసులు కాకినాడ కోర్టుకు తరలించారు. కొప్పవరంలో అదుపులోకి తీసుకున్న ఇద్దరు మావోయిస్టులు అంకిత (27) అనూష (25)గా గుర్తించారు. హిడ్మాకు అంగరక్షకులుగా వ్యవహరించారు. వీరికి సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులచే డీఎస్పీ కార్యాలయంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. తొలుత విజయవాడ తరలించాలని నిర్ణయించు కోగా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాకినాడ కోర్టులో హాజరుపర్చారు. డిసెంబర్ మూడో తేదీ వరకు రిమాండ్ విధిస్తూ మెజిస్ట్రేట్ ఆదేశించారు. దీంతో కాకినాడ సబ్‌జైలుకు తరలించారు.

### సవరణ

ప్రజాపక్షం దినపత్రిక 18–11–2025 (మంగళవారం) మొదటి పేజీలో '42 శాతం రిజర్వేషన్లు' శీర్షికన ప్రచురితమైన వార్తలో 'ఎస్ఆర్ఎస్‌పి స్టేజ్–2'కు ఇటీవల మరణించిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేరు పెట్టాలని మంత్రివర్గం తీర్మానించింది అని చదువుకోగలరు.

– సంపాదకులు



# జనరల్
STATE & REGIONAL NEWS

## నార్త్‌ఈస్ట్ కనెక్ట్ ఫెస్టివల్‌కు తెలంగాణ ఆతిథ్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ వేదికగా తెలంగాణ నార్త్ ఈస్ట్ ఇండియా కనెక్ట్ ఏ టెక్నోకల్చరల్ ఫెస్టివల్ పేరిట సాంకేతిక, సాంస్కృతిక మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, అసోం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్ సిక్కిం, త్రి పురల మధ్య సాంకేతిక, సాంస్కృతిక పరిజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకోవడం, త ద్వారా ఇరు ప్రాంతాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. హైటెక్స్‌లో నవంబర్ 20 నుండి 22 వరకు, రాజ్ భ వన్‌లో నవంబర్ 25 నుండి 27 వరకు రెండు విడతలుగా ఈ ఉత్సవాన్ని ని ర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ కార్యాలయం, ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు హైటెక్స్ లో 'సంస్కృతుల సంగమం సమృద్ధికి సోపానం' అనే అంశంతో ఘనంగా ప్రా రంభించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సిఎం రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర మంత్రులు, ఈశాన్య రాష్ట్రాల గవర్నర్లు హాజరుకానున్నారు.

# ప్రభుత్వ హాస్పిటళ్లలో వృద్ధులకు ప్రత్యేక వైద్య సేవలు

- జెరియాట్రిక్ సేవలు విస్తరించాలని సూచించిన మంత్రి దామోదర్
- డిఎంహెచ్‌ఓలు, ఆసుపత్రుల సూపరింటెండెంట్లతో సమీక్ష
- రోగులను దోచుకునే ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోండి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చికిత్స పేరిట ప్రజలను దోచుకునే ప్రైవేట్ హాస్పిటళ్లపై కఠినంగా వ్యవహరించాలని, ఐవిఎఫ్ సెంటర్లు, పెయిన్ క్లినిక్‌లు, రిహాబిలిటేషన్ సెంటర్ల పేరుతో దోపిడీకి, అ వకత వకలకు పాల్పడేవారిని ఉపేక్షించవద్దని రాష్ట్ర వైద్య, ఆరోగ్యచ కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ అన్నారు. మెడికల్ ఎడ్యుకేషన్, వైద్య విధాన పరిషత్, పబ్లిక్ హెల్త్, ఎన్‌హెచ్‌ఎం శాఖల మధ్య మరింత సమన్వయం అవసరమని, ఎక్కడికి అక్కడ సమన్వయ కమిటీలను నియమించుకుని పనిచేయాలన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయాలని, పోలీసులను చూడగానే నేరస్తులు భయపడినట్టు, వైద్యాధికారులను చూస్తే నిబంధనలను ఉల్లంఘించే ఆసుపత్రుల యాజమాన్యాలు భయపడాలన్నారు.ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, అన్ని జిల్లాల డిఎంహెచ్‌ఓలు, ప్రోగ్రామ్ ఆఫీసర్లతో మంత్రి బుధవారం సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ ఇనిస్టిట్యూట్‌లో జరిగిన ఈ సమీక్షలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, డిఎంఈ నరేంద్ర కుమార్, టివివిపి కమిషనర్ అజయ్ కుమార్, డిహెచ్ రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ మాట్లాడుతూ కొన్ని జిల్లాలలో సిజేరియన్ డెలువరీలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని తగ్గించి సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, సిజేరియన్ డెలివరీలు మాత్రమే చేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి రోగులను బయటి ఆసుపత్రులకు రిఫర్ చేయొద్దని మంత్రి అన్నారు. సబ్ సెంటర్ నుంచి జిజిహెచ్‌ల వరకూ అన్నిఆసుపత్రుల మధ్య సమన్వయం ఉండాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగికి అవసరమైనప్పుడు మరో ప్రభుత్వ ఆసుపత్రికి మాత్రమే రిఫర్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే అవసరమైన అన్నిరకాల వైద్య సేవలు అందించాలన్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రులలో వృద్ధులకు ప్రత్యేక వైద్య సేవలు

దేశంలో, రాష్ట్రంలో పెరుగుతున్న వృద్ధుల జనాభాకు అనుగుణంగా వారికి అవసరమైన వైద్య సేవలను కూడా విస్తరిస్తున్నామని మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ తెలిపారు. అన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులలో జెరియాట్రిక్ సేవలు అందించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు. జీవన ప్రమాణాలు పెరిగాయని, దీంతో వృద్ధుల సంఖ్య కూడా పెరుగుతున్నదన్నారు. పిల్లల కోసం మనం ప్రత్యేకంగా చైల్ హెల్త్ కేర్ సెంటర్లు నిర్వహిస్తున్నట్టుగానే, జపాన్, ఇటలీ తరహాలో వృద్ధుల కోసం ప్రత్యేక హాస్పిటళ్లు నిర్వహించాల్సిన అవసరం భవిష్యత్తులో మన దేశంలోనూ ఏర్పడుతుందన్నారు. వృద్ధాప్యంలో వచ్చే మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని అన్ని హాస్పిటళ్లలోనూ జెరియాట్రిక్ సేవలను విస్తరించాలని మంత్రి సూచించారు. ప్రతి జిజిహెచ్, డిస్ట్రిక్ట్ ఆసుపత్రులలో ఇప్పటికే జెరియాట్రిక్ వార్డులు ఏర్పాటు చేశామన్న విషయాన్ని ప్ర జలకు తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధుల జాబితాలు సిద్ధం చేసుకుని, వారికి ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత డిఎంహెఓలదేనని మంత్రి ఆదేశించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వైద్య వ్యవస్థ కూడా మారాలన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బకాయిలు చెల్లించాలి

సిఎం రేవంత్ రెడ్డికి చాడ వెంకట్ రెడ్డి వినతిపత్రం



**ప్రజాపక్షం/హైదరాబాద్/ కరీంనగర్ :**రాష్ట్ర వ్యాపితంగా మధ్యాహ్న భోజన పథకంలో పని చేసే కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతన బకాయిలను చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ చాడ వెంకటరెడ్డి కోరారు. సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర వ్యాపితంగా చేపడుతున్న 'బస్సుజాతా'లలో ఆయా ప్రాంతాలకు వెళ్ళిన సందర్భాలలో మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తమకు వినతి పత్రాలు అందజేసినట్టు వివరించారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డిని చాడ వెంకట్ రెడ్డి హైదరాబాద్‌లో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేలు ఇస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు అమలు కాలేదని, ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.3 వేలు కూడా ఏడు నెలల నుండి పెండింగ్‌లో ఉన్నాయని సిఎంకు చాడ వివరించారు. కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను, కూరగాయాలు, కోడిగుడ్లు, గ్యాస్ సిలిండర్ ధరలను ప్ర భుత్వమే సరఫర చేయాలని, కార్మికులందరికీ గుర్తింపు కార్డులు, బీమా, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ప్ర భుత్వం చెల్లిస్తున్న ధరలకు, ప్రస్తుత మార్కెట్ ధరలకు తేడా ఉన్నదని, ఆ ధరలతో నిత్యావసర వస్తువులు రాకపోవడంతో వారు అప్పులు తెచ్చి విద్యార్థులకు కడుపునిండ భోజనం వడ్డిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే మధ్యాహ్న భోజన పథ కం కార్మికులకు పెండింగ్ లో ఉన్న వేతనాలు చెల్లిస్తూ , నిత్యావసర వస్తువులకు అనుగుణంగా ఇచ్చి న హామీ మేరకు రూ.10 వేలు పెంచాలని చాడ వెంకట్ రెడ్డి కోరారు.

### మానేరు రివర్‌ఫ్రంట్‌లో అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

కరీంనగర్ నగరంలోని మానేరు రివర్ ఫ్రంట్‌లో అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని, జిల్లాలోని ఇతర సమస్యలపై సిపిఐ సీనియర్ జాతీయ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి బుధవారం హైదరాబాదులో సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కరీంనగర్ నగరంలో మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనుల పేరుతో గత ప్రభుత్వం రివర్ ఫ్రంట్ నిర్మాణం కోసం రూ.500 కోట్లు మంజూరు చేసిందని, అందులో టూరిజం శాఖ రూ.100 కోట్లు , నీటిపారుదల శాఖ రూ.100 కోట్లు నిధులు విడుదల చేసిందని పేర్కొన్నారు. గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మానేరు రివర్‌ఫ్రంట్ పనుల నిర్మాణాన్ని చేపట్టి, ఆ నిర్మాణ పనులను పూర్తి చేయుటకు బిఆర్‌ఎస్ నాయకుల అనుచరులకు అప్పగించి పూర్తి చేయకపోవడం వల్ల రివర్‌ఫ్రంట్‌లో చేసిన పనులు నాణ్యత ప్రమాణాలు లోపించాయన్నారు. ఆపనులు పూర్తిగా లోపించాయని, వారికి కొంత బిల్లులు చెల్లించినప్పటికీ నిర్మాణ పనుల్లో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయనే విషయాన్ని సిఎం దృష్టికి వెళ్లిన ట్లు తెలిపారు. రివర్‌ఫ్రంట్ పరిధిలోని చెక్ డ్యాములు నిర్మిస్తే వాటిలోనూ నాణ్యత ప్రమాణాలు పాటించకుండా వర్షాకాలంలో వర్షాలు కురిస్తే అవి కొట్టుకుపోయాయని, చెక్ డ్యాములు కొట్టుకుపోయినప్పటికీ రివర్ ఫ్రంట్ పనుల నిధులు విడుదలయ్యాయని, ఐదు సంవత్సరాలకు పైగా సమయం గడుస్తున్న నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. తక్షణమే రివర్‌ఫ్రంట్ పనుల్లో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సానకూలంగా స్పం దించారని, అలాగే జిల్లాలోని సమస్యలపై వివరించడం జరిగిందని చాడ వెంకటరెడ్డి తెలిపారు.

## సింగరేణి భవన్ ఎదుట కవిత ఆందోళన

అదుపులోకి తీసుకుని ఆరెస్టు చేసిన పోలీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించాలని, మెడికల్ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ లక్డీకపూల్‌లోని సింగరేణి భవన్‌ను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ముట్టడించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు అక్కడికి చేరుకుని కవితను అరెస్టు చేశారు. హైదరాబాద్ నగరంలోని నాంపల్లిలో గల సింగరేణి భవన్ వద్ద ఆందోళనకు దిగిన కవితను అదుపులోకి తీసుకున్నారు. సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కవిత సింగరేణి భవన్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డిపెండెంట్ ఉద్యోగులను పునరుద్ధరించాలని ఆమె అన్నారు. సింగరేణి సమస్యలను పరిష్కరించలేని అసమర్థ ప్రభుత్వమని ఆమె విమర్శించారు. కార్మికుల కోసం మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కవితతో పాటు బైఠాయించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సింగరేణి భవన్‌ను కవిత ముట్టడిస్తుందన్న సమాచారంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



## నక్సలైట్లు అడవుల్లో చస్తుంటే.. ఆర్బన్ నక్సలైట్స్ పదవులు అనుభవిస్తున్నారు

- అమాయక నక్సలైట్లను రెచ్చగొట్టి వారి చావులకు కారకులయ్యారు
- ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు ఆర్బన్ నక్సలైట్లు వ్యతిరేకం కాదా..? : కేంద్ర మంత్రి బండి సంజయ్



**ప్రజాపక్షం / హుజురాబాద్ :** నక్సలైట్లు అడవుల్లో చస్తుంటే..ఆర్బన్ నక్సలైట్స్ పదవులు అనుభవిస్తున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. హుజురాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత, గిరిజన, ఆదివాసీ అమాయకులను రెచ్చగొట్టి నక్సలైట్లుగా మార్చిన ఆర్బన్ నక్సలైట్లే వారి చావులకు కూడా బాధ్యత వహించాల్సిందేనన్నారు. అమాయక నక్సలైట్లు అడవుల్లో చనిపోతుంటే ఆర్బన్ నక్సలైట్లు మాత్రం ఆస్తులు కూడగట్టుకుని ప్రభుత్వ నామినేటెడ్, కమిషన్ పదవుల్లో కొనసాగుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడటమే తమ సిద్ధాంతమని పదే పదే చెప్పుకునే ఆర్బన్ నక్సలైట్లు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎందుకు పదవుల్లో కొనసాగుతున్నారని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న లేకున్నా మావోయిజానికి బిజెపికి వ్యతిరేకం, తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారం అసాధ్యం అన్నారు. మావోయిస్టుల పేరుతో అమాయకులను బలి తీసుకున్నారన్నారు. ఆర్బన్ నక్సల్స్ మిమ్మల్ని రెచ్చగొడుతున్నారని, వాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని అడవుల్లో అన్నలకు విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. నక్సలిజాన్ని ఎవరూ సమర్థించినా వాళ్లు కూడా నేరస్థులే అని, మావోయిస్టులే తుపాకులు వదిలి జన జీవన స్రవంతిలో కలుస్తుంటే అందుకు భిన్నంగా ఆర్బన్ నక్సల్స్ తుపాకులు పట్టండి, మావోయిస్టుల్లో చేరండి అంటే ఊరుకుంటామా ఇది సమర్థనీయమా? వారి విజ్ఞతకే వదిలేస్తున్నా అని అన్నారు. వారి వెంట పలువురు బిజెపి నాయకులు తదితరులు ఉన్నారు.

## ఐ బొమ్మ పోతే మరో బొమ్మ వస్తది..

ఆ నేరాలు ఆగవు.. నిరంతర నివారణ అవసరం

హోంశాఖ స్పెషల్ సిఎస్ సివి ఆనంద్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సినిమాలను పైరసీ చేస్తూ.. ఇండస్ట్రీని బెంబేలెత్తించిన ఐబొమ్మ నిర్వాహకులు ఇమ్మడి రవిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. దర్యాప్తులో అతను 50 లక్షల మందికి చెందిన సమాచారాన్ని డార్క్ వెబ్‌కు అమ్మినట్లుగా తేలింది. దీంతో ఐబొమ్మ వెబ్‌సైట్‌ను విజిట్ చేసిన వారంతా ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఇకనైనా పైరసీ ఆగుతుందా? సైబర్ క్రైమ్‌కు చెక్ పడుతుందా? అని తలెత్తుతున్న సందేహాలపై రాష్ట్ర హోంశాఖ స్పెషల్ సీఎస్ సివి ఆనంద్ ఎక్స్ వేదికగా స్పందించారు.హ్యాకర్లు, హ్యాకింగ్ అనేవి కొనసాగుతూనే ఉంటాయన్నారు. ఒకడు పోతే మరొకడు వస్తాడని, వాడు కూడా మరింత టెక్నాలజీని ప్రదర్శిస్తాడని పేర్కొన్నారు. కొందరిని అరెస్ట్ చేశామన్న కారణంతో పైరసీ లేదా సైబర్ క్రైమ్స్ పూర్తిగా ఆగిపోతాయని అనుకోవడం అసాధ్యమని పేర్కొన్నారు. పెద్ద పెద్ద దొంగతనాలకు పాల్పడిన సాంకేతిక నైపుణ్యం ఉన్న దొంగల గ్యాంగ్స్‌ను పట్టుకున్న తర్వాత దొంగతనాలు, చోరీలు, దాడులు, మోసాలు ఆగిపోయాయా? మనిషి ఉన్నంతకాలం ఈ రకాల నేరాలు కూడా జరుగుతూనే ఉంటాయని తెలిపారు. వీటికి మన చేతిలో ఉన్న మార్గం నివారణ ఒక్కటేనని హితవు పలికారు. ఈజీ మార్గాల్లో డబ్బు సంపాదించాలన్న కోరికలను తగ్గించుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్ పెరగడానికి ఆ కోరికే మూలకారణమని సీవీ ఆనంద్ తెలిపారు. సైబర్ స్పేస్, అకౌంట్లను సేఫ్‌గా ఉంచుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జీవితంలో ఏదీ ఫ్రీగా రాదని డైరెక్టర్ రాజమౌళి చెప్పిన మాటే జీవిత సత్యమని పునరుద్ఘాటించారు.

## 'స్కిల్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా'గా తెలంగాణ



'ఏఐ'తో ఉద్యోగాలు పోతాయన్నది కేవలం అపోహే

సంక్షోభంతో పాటే కొత్త అవకాశాలు : మంత్రి శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**'స్కిల్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా' గా తెలంగాణను మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్వాంటం కంప్యూటింగ్ లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌లో తెలంగాణ యువతను పరిశ్రమల భాగస్వామ్యంతో అత్యుత్తమ నైపుణ్యమున్న మానవ వనరులుగా తీర్చిదిద్దేలా కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఇఎస్‌ఐసి)లోనిర్వహించిన 'స్కిల్ కాన్వకేషన్ ఇన్ ఐటి,ఐటిఇఎస్ సెక్టార్ ఏఐ, డిజిటల్ టెక్నాలజీస్ హ్యాకథాన్ 2025'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... టెక్నాలజీ రోజురోజుకీ వేగంగా మారుతుందని, ఆ మార్పులను అందిపుచ్చుకోగలిగితేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. రెండేళ్లలోనే 40 శాతానికి పైగా అంతర్జాతీయ కంపెనీలు 'జనరేటివ్ ఏఐ'ను తమ కోర్ వర్క్‌లో భాగం చేసుకున్నాయన్నారు. 'ఏఐ' వల్ల ఉద్యోగాలు పోతాయన్నది అపోహే, అది కేవలం ఉద్యోగాల స్వరూపాన్ని మాత్రమే మారుస్తుందన్నారు. ఆటోమేషన్ వల్ల 85 మిలియన్ జాబ్స్ పోతే, కొత్తగా 97 మిలియన్ల స్కిల్ బేస్డ్ ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరం తేల్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సంక్షోభంతో పాటే కొత్త అవకాశాలు కూడా వస్తాయని, అందుకు సంసిద్ధంగా ఉండాలని యువతకు సూచించారు. ఓ వైపు సైబర్ క్రైమ్స్ రోజురోజుకీ పెరుగుతున్నాయని, మరోవైపు ఎథికల్ హ్యాకర్లు, సైబర్ సెక్యూరిటీ నిపుణులకు భారీ డిమాండ్ ఏర్పడుతుందన్నారు. వాతావరణ మార్పుల వల్ల క్లీన్ టెక్, ఈవీలు, గ్రీన్ ఇన్నోవేషన్ రంగాల్లో అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. అలా అని ఈ డిజిటల్ యుగంలో కేవలం అకడమిక్ డిగ్రీలతో మాత్రమే ఉద్యోగాలు రావని, ఇన్నోవేషన్, ప్రాబ్లం సాల్వింగ్, ప్రాక్టికల్ స్కిల్స్ ఉంటేనే సక్సెస్ సాధ్యమన్నారు. తమ ప్రభుత్వం భవిష్యత్తును కేవలం ఊహించడం లేదని, దానికి అవసరమైన 'స్కిల్లింగ్ ఎకో సిస్టం'ను నిర్మిస్తోందన్నారు. మార్కెట్, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా 'రెడీ టూ వర్క్ ఫోర్స్'ను తయారు చేసే బాధ్యతను భుజానికి ఎత్తుకొనిఎత్తుకుందని వివరించారు. కార్యక్రమంలో ఇఎస్‌ఐసి డైరెక్టర్ డా.రామేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## సౌదీలో సహాయక చర్యల్లో అజారుద్దీన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సౌదీ అరేబియాలో దురదృష్టవశాత్తు జరిగిన బస్సు ప్రమాదంలో తెలంగాణ వాసులు మృతిచెందారు. ఈ ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తోంది. ప్రభుత్వ సూచనల మేరకు మైనారిటీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్ సౌదీకి వెళ్లారు. మదీనాలోనే ఉన్నారు. సోమవారం రాత్రి సౌదీ అరేబియాకు చేరుకున్న మంత్రి.. అప్పటి నుండి సహాయక చర్యలను సమన్వయం చేస్తున్నారు. మంత్రి అజారుద్దీన్.. మైనారిటీ సంక్షేమ కార్యదర్శి బి.షఫియుల్లా, ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌లతో కలిసి.. జెడ్డాలోని భారత కాన్సుల్ జనరల్ ఫహద్ అహ్మద్ ఖాన్ సూరి, సౌదీలోని సీనియర్ అధికారులతో నిరంతర సమన్వయం చేస్తున్నారు. అంతకుముందు.. రియాద్‌లో సౌదీ అరేబియాలోని భారత రాయబారి డాక్టర్ సుహెల్ అజాజ్ ఖాన్‌ను కూడా కలిశారు. పరిస్థితిని వివరించి.. సహకారం కోరారు. మంత్రి మహమ్మద్ అజారుద్దీన్.. సౌదీ అరేబియాలో తనకున్న వ్యక్తిగత పరిచయాలను ఉపయోగించి.. అన్ని లాంఛనాలు, అనుమతులు, లాజిస్టికల్ అవసరాలు ఆలస్యం లేకుండా వేగవంతంగా చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో వివిధ ఏజెన్సీలతో సమన్వయం చేస్తున్నారు. బస్సు ప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన షోయెబ్ కుటుంబ సభ్యుడిని కూడా కలిశారు. అతనికి అన్నివిధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అంత్యక్రియల్లో పాల్గొనడానికి మదీనాకు చేరుకున్న మృతుల కుటుంబ సభ్యులను మంత్రి రిసీవ్ చేసుకున్నారు.అదే విధంగా ఆ కుటుంబ సభ్యులతో పాటు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు కూడా మదీనా చేరుకొని వారి ప్రయాణం, వసతి, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.అంతే కాకుండా వారు మృతదేహాల గుర్తింపు, డిఎన్‌ఎ మ్యాచింగ్ ప్రక్రియను కూడా సులభతరం చేస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా లాంఛనాలను పూర్తి చేయడానికి, స్థానిక విధానాలు, కుటుంబ ప్రాధాన్యతలకు అనుగుణంగా అంత్యక్రియలు నిర్వహించడానికి వీలుగా తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం సౌదీ అధికారులతో 24 గంటలూ కలిసి పనిచేస్తోంది. మంత్రి అజారుద్దీన్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నిరంతరం మాట్లాడుతూ.. అక్కడ తీసుకుంటున్న చర్యల గురించి వివరిస్తున్నారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ప్రభుత్వ యంత్రాంగం నిబద్ధతతో పనిచేస్తోంది.




## జూడో పోటీలు వీక్షించిన మంత్రి వాకిటి

**ప్రజాపక్షం/హైదరాబాద్:**ఎల్‌బి స్టేడియంలో జరుగుతున్న సబ్ జూనియర్ నేషనల్ జూడో ఛాంపియన్ షిప్ కు క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి హాజరై పోటీలను తిలకించారు. 52 కేటగిరీ మహిళల 60కేజి కేటగిరి బాయ్స్ విభాగాల్లో గెలిచిన వారికి మంత్రి బహుమతులు ప్రధానం చేశారు. 52కేజీ మహిళల విభాగంలో మొదటి స్థానంలో మణిపూర్, రెండవ స్థానంలో హర్యానా,మూడవ స్థానంలో జమ్మూ కాశ్మీర్, మహారాష్ట్ర, 60 కేజీ విభాగం బాయ్స్ మొదటి స్థానంలో మణిపూర్,రెండవ స్థానంలో రాజస్థాన్ 3వ స్థానంలో మహారాష్ట్ర,జమ్మూ కాశ్మీర్ నిలిచారు.ఈ కార్యక్రమంలో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## నేడు సిబిఐ కోర్టుకు జగన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వైఎస్‌ఆర్‌సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సుదీర్ఘ కాలం తర్వాత అక్రమాస్తుల కేసులో గురువారం హైదరాబాద్‌లోని సిబిఐ ప్రత్యేక కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరుకానున్నారు. ఈ మేరకు హైదరాబాద్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కేసులో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించడంతో, కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. గత ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరుకాలేదని, ప్రస్తుతం ఈ కేసుల్లోని డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ఆయన భౌతికంగా హాజరుకావడం తప్పనిసరి అని సిబిఐ వాదించింది. ఈ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం, నవంబర్ 21లోగా వ్యక్తిగతంగా హాజరుకావాలని జగన్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో, గడువుకు ఒకరోజు ముందే ఆయన కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల జగన్ కోర్టు అనుమతితో ఐరోపా పర్యటనకు వెళ్లారు. పర్యటన ముగిసిన వెంటనే వ్యక్తిగతంగా హాజరుకావాలని అప్పుడే కోర్టు స్పష్టం చేసింది. అయితే, ఆయన హాజరుకాకుండా మినహాయింపు కోరారు. సిబిఐ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆయన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది.

కాగా, అక్రమాస్తుల కేసులో జగన్ 2013 సెప్టెంబరు నుంచి బెయిల్‌పై బ యట ఉన్న విషయం తెలిసిందే.

## పోలీసులపై లంచం ఆరోపణలు వస్తే ఉపేక్షించొద్దు

ఎసిబిని అభినందించిన డిజిపి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మెదక్ జిల్లాలోని టేక్మల్ సబ్ ఇన్‌స్పెక్టర్‌ను అవినీతి ఆరోపణలపై పకడ్బందీగా అరెస్టు చేసిన అవినీతి నిరోధక శాఖ (ఎసిబి)ని డిజిపి బి.శివధర్ రెడ్డి బుధవారం నాడు అభినందించారు. ఆయన ఎసిబి డిజి చారు సిన్హాతో పాటు, ఎసిబిలోని ఇతర అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ అవినీతి పరులైన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించవద్దని ఎసిబికి సూచించారు. లంచం తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న టేక్మల్ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌ను ఎసిబి అధికారులు అరెస్టు చేసిన అనంతరం స్థానిక ప్రజలు సంబరాలు చేసుకున్న సంఘటనపై పోలీసు అధికారులు, సిబ్బంది తమ పనితీరుపై స్వీయ సమీక్ష చేసుకోవాలని డిజిపి సూచించారు. లంచం తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారి అరెస్టుపై స్థానిక ప్రజలు పటాకులు కాల్చి బహిరంగంగా సంబురాలు జరుపుకొనే సంఘటన ప్రజల నుండి ఒక బలమైన సందేశాన్ని పంపుతుందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అభిప్రాయపడ్డారు. ఆ సంఘటన పోలీసుల పట్ల ప్రజల విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందన్నారు. ప్రజలు అవినీతిని ఏ మాత్రం ఉపేక్షించరని, పోలీసుల నుండి వారు శాంతిభద్రతలను, చక్క ని పోలీసింగ్‌ను కోరుకుంటారని, ప్రజలను పీడించేవా రి పట్ల నిర్దయగా ఉంటారని ఈ సంఘటన రుజువు చే సిందని ఆయన అన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బం ది ఎవరైనా అవినీతికి పాల్పడితే వారి పైన పర్యవేక్షణ చేసే అధికారుల లోపమేనని భావిస్తానని, వారి మీద కూడ చర్యలు తీసుకుంటామని డిజిపి హెచ్చరించారు. పోలీసు అధికారులు మరియు సిబ్బంది నీతి, నిజాయితీలో పని చేయాలన్నారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ GHMC
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-18, కెజెడ్, జిహెచ్‌ఎంసి.
టెండర్ నోటీసు
NIT No. EOI cum bid Notice Short NIT No: 21/CTO/Cir-18/GHMC/2025-26 తేది: 18.11.2025
**పని పరిధి:** జిహెచ్‌ఎంసి, ఖైరతాబాద్ జోన్‌లో బిల్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (బిఒటి) ఇన్-సిటు అంటే (ఒకే స్థానం) సూత్రంతో ఇప్పటికే ఉన్న పిఎఫ్‌టిలు / ఆర్‌సిసి టెయిల్లెట్లు / ఇ-టాయిలెట్లు / బయో-టాయిలెట్లను తిరిగి ఉపయోగించడం, రిఫర్‌బిష్, తిరిగి అమర్చడం మరియు ఉపయోగించుకోవాలని ఆసక్తి వ్యక్తీకరణ పిలుపు. **అంచనా మొత్తం:** సీలు వేసిన ప్రతిపాదనలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం:** ఇఓఐ ప్రారంభం: 19.11.2025న సా.4.00గం.ల నుండి, ప్రతిపాదన సమర్పణ ముగింపు తేదీ: 26.11.2025న సా.4.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-18, కెజెడ్, జిహెచ్‌ఎంసి. సెల్: 9989930414. మరిన్ని వివరాలను ఈ కార్యాలయం యొక్క టెండర్ నోటిఫికేషన్ నోటీసు బోర్డులో @ http://www.ghmc.gov.in వద్ద చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-18, కెజెడ్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 10922-PP/CL/ADVT/1/2025-26, Date: 19-11-2025

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ GHMC
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నెం.6
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు
Short Tender NIT No. 28/EE-6/CRZ/GHMC/2025-26 తేది: 19.11.2025
**పని రకం:** సిసి రోడ్లు మరియు ఇతర పనులు. **అంచనా మొత్తం:** రూ.90.50 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం:** డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 20.11.2025న మ.3.00గం.ల నుండి, బిడ్ల స్వీకరణకు ఆఖరి తేదీ: 24.11.2025న మ.3.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** శ్రీ పి.సునిల్ కుమార్, ఇఇ, డివిజన్-6, సిఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి, హైదరాబాద్. ఫోన్ నెం. 9000922841. మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.eprocurement.gov.in లో చూడవచ్చు.
**గమనిక: టెండర్ నోటీసు తేదీ తర్వాత 1% ఇఎండి పొందాలి.**
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నెం.6, చార్మినార్ జోన్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 10951-PP/CL/ADVT/1/2025-26, Date: 19-11-2025

OFFICE OF THE KARIMNAGAR MUNICIPAL CORPORATION
Ph.No. 0878-2243438, Fax No. 0878-2240624,
Email:knrcmnr@rediffmail.com
Sealed Quotation Notice
No. E1/DB/MCK/8201/Quotations/Waste Collection/2025-26, Date: 18-11-2025
కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో, ఇంటి ఇంటికి చెత్తను సేకరించి, సంబంధిత అధికారులు సూచించిన డంపింగ్ యార్డునకు తరలించుటకు గాను ఆసక్తి గల ఆటో/ టాటా ఏస్ యజమానులు లేదా అనుభవము గల డ్రైవర్ల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.
1). ఎంగేజి చేయబడిన వారి స్వంత వాహనమునకు రిజిస్ట్రేషన్, ఫిట్ నెస్ సర్టిఫికేట్ మరియు డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్సు తప్పని సరిగా కలిగి యుండవలెను. 2). వాహనము లేని యెడల నగర పాలక సంస్థ యొక్క వాహనమును సెమకూర్చును (అందుబాటులో గల వాహనములు మేరకు). ఇట్టి వాహనము పొందుటకు రూ// ఒక లక్ష రూపాయలు డిపాజిట్ మరియు నెలసరి అద్దె రూ.6,000.00 అక్షరాల ఆరు వేల రూపాయలు చెల్లించవలెను. ఇట్టి వాహనమును నగర పాలక సంస్థ చెత్త సేకరణకు మాత్రమే ఉపయోగించవలెను. ఇతర ఏ పనులకు ఉపయోగించరాదు. ఒక వేళ ఇతర పనులకు ఉపయోగించిన యెడల సంబంధిత వ్యక్తి యొక్క అగ్రిమెంట్ రద్దు పరచి చెల్లించబడిన డిపాజిట్ జప్తు చేయబడును. 3). అగ్రిమెంట్ కాల పరిమితి రెండు సంవత్సరములు. రెండు సంవత్సరముల తరువాత అగ్రిమెంట్ పొడగించుటకు లేదా రద్దు చేయుటకు కమిషనర్, కరీంనగర్ నగరపాలక సంస్థ వారికి పూర్తి అధికారము కలదు. 4). ఒక వాహనమునకు సుమారు 500 ఇండ్లు కేటాయించబడును. (ఇది ఒక అంచనా మాత్రమే) కేటాయించ బడిన ఇండ్ల నుండి ప్రతి రోజు, ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించి, వేరు వేరుగా రవాణా చేసి మునిసిపల్ అధికారి సూచించిన DRCC సెంటర్ లేదా డంపింగ్ యార్డుకు తరలించవలెను. 5). చెత్తను సేకరించిన సంబంధిత గృహ యజమానుల నుండి ఒక ఇంటికి నెలకు రూ. 60=00 చొప్పున యూజర్ చార్జీల రూపమున వసూలు చేసుకోవచ్చును. నగరపాలక సంస్థ నిర్దేశించిన రుసుము కంటే ఎక్కువ రుసుము వసూలు చేసిన యెడల అగ్రిమెంట్ రద్దు చేయబడును. 6). వాహనమునకు సంబందించిన రిపేర్లు ఇందన ఖర్చు సంబంధిత వ్యక్తులే భరించవలెను. 7). కేటాయించబడిన నివాస గృహముల నుండి మాత్రమే చెత్తను సేకరించవలెను. వాణిజ్య సముదాయముల నుండి చెత్తను సేకరించారాదు.
Last Date of receiving Quotation :26-11-2025- 04.00PM
Sd/- Commissioner, Karimnagar Municipal Corporation.
DIPR R.O. No. : 10916-PP/CL/ADVT/1/2025-26, Date: 19-11-2025

## నల్లబెల్లం, పటిక పట్టివేత



**ప్రజాపక్షం/దేవరకొండ:** మండల పరిధిలోని చెన్నారం గేటు వద్ద విశ్వసనీయ సమాచారం మేరకు అక్రమంగా రవాణా చేస్తున్న 1800కేజీల నల్లబెల్లం, 80 కేజీల పటికను పట్టుకున్నట్లు బుధవారం దేవరకొండ ఎక్సైజ్ సిఐ శ్రీనివాస్ తెలిపారు. అక్రమంగా నల్లబెల్లం, పటికను రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు దేవరకొండ ఎక్సైజ్ సిఐ శ్రీనివాస్ తెలిపారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం



**ప్రజాపక్షం/అర్వపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల కేంద్రంలోని జాజిరెడ్డిగూడెం గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్‌కు బుధవారం శంకుస్థాపన చేసి ఆయన మాట్లాడారు. అంతకుముందు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగానికి పెద్దపీట వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీకాంత్, ఎంపిడిఓ ఝాన్సీ, పిఆర్ డిఈ బాబురావు, డాక్టర్ భూక్యా నగేష్, ఎంపిఓ గోపి, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం పాల్గొన్నారు.



## సిపిఐలో మూడు కుటుంబాలు చేరిక

**ప్రజాపక్షం/మునుగోడు:** భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న సిపిఐ కి పలువురు నాయకులు ఆకర్షితులై సిపిఐ లో చేరుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో చోళ్ళేడు గ్రామానికి చెందిన మూడు కుటుంబాలు ఆ గ్రామ శాఖ కార్యదర్శి వనం వెంకన్నఆధ్వర్యంలో సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఎంఎల్‌సి సత్యం ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వంగూరి శంకర్ ,బుడియాపాక రాములు, గాదగోని సైదులు తదితరులు ఉన్నారు.

## వన పెంపకానికి 10 ఎకరాల భూమిని కేటాయించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** గీత వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో రాష్ట్ర సదస్సుకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో జరుగు రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర రోడ్డు రవాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, గౌరవ అతిథులుగా మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. రాజ్యాంగ సవరణ ద్వారా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి గీత పారిశ్రామిక ఆర్థిక సహకార కార్పోరేషన్ లకు నిధులు కేటాయించాలని కోరారు. గీత వృత్తి రక్షణ, వృత్తిదారులకు సంక్షేమ ఆధునీకరణ వన పెంపకానికి 10 ఎకరాల భూమిని కేటాయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, రాజారామ్, పాషా, దేశగాని హేమలత, వెంకటమ్మ, కోటమ్మ పాల్గొన్నారు.

## గ్రంథాలయాల సహకారంతో మహిళలు ఉద్యోగ సాధనలో విజయం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** గ్రంథాలయాల సహకారంతో మహిళలు ఉద్యోగ సాధనలో విజయం సాధించాలని అందుకు పట్టుదలతో కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా జిల్లా గ్రంథాలయంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రభుత్వం పురుషులతో సమానంగా మహిళలకు విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. మహిళలు తాము ఎంచుకున్న రంగంలో ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలు విద్య, మహిళా సాధికారత, మహిళల హక్కులను ప్రతిబింబించే విధంగా ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి బాలమ్మ, స్ఫూర్తి క్లబ్ సభ్యులు అడ్వకేట్ రమాదేవి, ఆండాల్, ప్రమీల, లైబ్రేరియన్‌లు శ్యాంసుందర్ రెడ్డి, విజయభాస్కర్, రంగారావు, సృజన తదితరులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల అటానమస్‌లో 2025/26 విద్యా సంవత్సరానికి గాను ఖాళీగా ఉన్న రసాయన శాస్త్ర ఇన్ ఆర్గానిక్ కెమిస్ట్రీ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. ఉపేందర్ తెలియజేసారు. పీజిలో 55 శాతం మార్కులు ఉన్న ఉన్నవారు అర్హులని అదేవిధంగా యస్.సి, యస్.టి వారికి పీ.జిలో 50 శాతం మార్కులు ఉన్నవారు అర్హులనీ తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో నెట్,సెట్,పిహెచ్‌డి, బోధనా అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుననీ ఆసక్తి కల అభ్యర్థులు త మ దరఖాస్తు ఫారాలను కళాశాల కార్యాలయములో అందజేయాలని సూచించారు. చివరి తేది ఈనె ల 22 వరకు దరఖాస్తుదారులు త మ విద్యార్హతల సర్టిఫికెట్లను ఎస్ఎస్‌సి మెమో,ఇంటర్మీడియట్ మెమో, డిగ్రీ మెమో,పీజీ మెమో, నెట్,సెట్, పిహెచ్ డి సర్టిఫికెట్ , ఆధార్ కార్డు జిరాక్స్ లు ఇవ్వాలనీ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 24న ఉదయం 10.30 గంట లకు కళాశాల లో ఇంటర్వ్యూకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

## సుస్థిర పాలన ఘనత ఇందిరాగాంధీదే

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పట్టణంలోని సాగర్‌రోడ్డులోని ఆమె విగ్రహానికి బుధవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశానికి సుస్థిర పాలన అందించి దేశ ప్రజల కోసం అనేక సంస్కరణలు చేసి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత ఇందిరాగాంధీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నూకల వేణుగోపాల్‌రెడ్డి, చిరుమర్రి కృష్ణయ్య, స్కైలాబ్‌నాయక్, కాకునూరి బసవయ్యగౌడ్, పొదిల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# లబ్ధిదారులకు అలసత్వం తగదు

### త్వరితగతిన ఇంటి నిర్మాణాలు ప్రారంభించాలి
### ఇందిరమ్మ ఇండ్ల పరిశీలనలో ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ మండలం ఉమ్మడి ముదిగొండ గ్రామపంచాయతీ పరిధిలోని ముదిగొండ, గుడిలచ్చ తండా, ముచ్చరాల జర్పుల తండా, వడ్త్య తండాలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని బుధవారం దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ స్వయంగా పరిశీలించి, అభివృద్ధి పనులను సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల స్థితిగతులను ప్రత్యక్షంగా చూసిన ఎంఎల్‌ఏ బాలునాయక్ ప్రతి ఇంటి నిర్మాణ దశను, మెటీరియల్ నాణ్యతను, లబ్దిదారుల అవసరాలను అధికారులు, స్థానిక ప్రజలతో చర్చించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇంటి నిర్మాణంలో వివిధ స్థాయిలలో ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాలు లబ్దిదారులకు వేగంగా చేరేలా పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు చొరవ చూపాలని పేర్కొన్నారు. లబ్దిదారులు ఆలస్యం చేయకుండా త్వరితగతిన ఇంటి నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేసుకోవాలని సూచించారు. చీమలకుంట తండా నుండి గుడి లచ్చ తండా మీదుగా ముదిగొండ వరకు 1.6కిలో మీటర్లు నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో డానియల్, ఎంపివో సాగర్, డిఈ నిత్యానంద స్వామి, ఏఈఈ నవీన్, పంచాయతీరాజ్ ఏఈ శంకర్, హౌసింగ్ ఏఈ చందు, మధు, హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి కవిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు జీవన్‌రెడ్డి, నర్యానాయక్, సరోజ జగన్, బాలు, శంకర్, సత్యం, వెంకటయ్య,మల్లేష్, యాదయ్య, మధు, గిరి, లక్పతి, రాజు, జంగు, యువజన కాంగ్రెస్ నాయకులు రాంసింగ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## చదువుతోనే అన్ని సాధ్యం

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** చదువుతోనే అన్ని సాధ్యమవుతాయని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.ఈనెల 14 నుండి 20 వరకు నిర్వహిస్తున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో" భాగంగా బుధవారం ఆమె జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ముందుగా జిల్లా కలెక్టర్ స్వర్గీయ భారత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం విద్యార్థినులనుద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో కష్టపడి ఇందిరా గాంధీ ప్రధాని అయ్యారని, పేద ప్రజల సంక్షేమానికి గరీబి హఠావో నినాదాన్ని తీసుకువచ్చారని, ఆమెకు అనేక భాషలలో ప్రావీణ్యురాలని, తండ్రి జవహర్లాల్ నెహ్రూ ప్రధాని అయినప్పటికీ ఆమె స్వయంగా కష్టపడి ప్రధాన మంత్రి అయ్యారని, ఇందిరాగాంధీ లాగా కష్టపడి చదివి సమాజంలో మంచి స్థానానికి రావాలని ఆమె విద్యార్థినిలకు పిలుపునిచ్చారు.జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు డాక్టర్ ఎం. ఆఫీస్ ఖాన్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందిస్తాయని, నల్గొండ జిల్లా కేంద్ర గ్రంథాలయ ప్రస్తుత భవనం సరిపోనందున కొత్త బిల్డింగ్ మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ బాలమ్మ,బాలుర, బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ సిబ్బంది, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులు అందజేశారు.

# ప్రతీ ఒక్కరిపై తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం 2025కు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వయో వృద్ధులకు సంబంధించిన చట్టాలు, పథకాలు అమలుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకొని ముందుకు వెళ్తున్నామని తెలిపారు. పెన్షన్‌కు సంబంధించిన అకౌంట్‌లోని డబ్బులను సైబర్ నేరగాలు ఫోన్ చేసి ఓటిపి ద్వారా డబ్బులు దొంగలిస్తున్నారని, సైబర్ మోసాల పట్ల సీనియర్ సిటిజన్స్ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సూర్యాపేట జిల్లాలో రూ.50లక్షలతో ఓల్డ్ ఏజ్ హోం త్వరలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని అలాగే మల్టీసర్వీస్ డే కేర్ సెంటర్‌ను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సీనియర్ సిటిజెన్స్‌ను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు, అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, డిడబ్ల్యు నరసింహారావు, డిపిఓ యాదగిరి, డిప్యుటి డిఎంహెచ్ఓ చంద్రశేఖర్, డిసిహెచ్ ఎస్ వెంకటేశ్వర్లు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆర్ సీతారామయ్య, బోల్ల రాంబాబు, విద్యాసాగర్, హమీద్‌ఖాన్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### పదవ తరగతి పరీక్షలకు సిద్ధం కావాలి : జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** పదవ తరగతి వార్షిక పరీక్షలో ప్రతి ఒక్కరు ప్రతి సబ్జెక్టులో 70 శాతం మార్కులు సాధించేలా పరీక్షలకు సిద్ధం అవ్వాలని విద్యార్థులకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. మంగళవారం పెన్‌పహాడ్ మండలం అనంతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పదవ తరగతి విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీష్ చదివించి నోట్‌బుక్స్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ చదువు ప్రాధాన్యత, పదవ తరగతి ప్రాముఖ్యతను ఆయన తెలియజేస్తూ పదవ తరగతిలో మంచి మార్కులు వచ్చేందుకు బాగా కష్టపడి చదువాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లాలు నాయక్, ఎంపిడిఓ జానయ్య, ఎంఈఓ రవి, ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## నూతన విత్తన చట్టంపై అవగాహన



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** నూతన విత్తన చట్టం 2025పై అవగాహన, సూచన, సలహాలు సేకరించినట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు చంద్రశేఖర్, డాక్టర్ శ్రీధర్, కంప సాగర్‌లు తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, విత్తన డీలర్లు సీడ్ ప్రొడక్షన్ ఆర్గనైజర్స్, డిస్ట్రిబ్యూటర్లు, వ్యవసాయ అధికారులు, ఉద్యాన శాఖ అధికారుల సమక్షంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విద్యాలయం, కంప సాగర్ కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నూతన విత్తన చట్ట విధివిధానాలను వివరించారు. అనంతరం అధికారులు, విత్తన డీలర్లు, విత్తన ఉత్పత్తిదారులు, రైతులు, నాణ్యమైన విత్తనము రైతులకు అందెందుకు కావల్సిన సలహాలు సూచనలు తెలియజేసినట్లు తెలిపారు. ఈ సలహాలను సూచనలను వ్యవసాయ యూనివర్సిటీ ద్వారా భారత ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళడం జరుగుతుందన్నారు. డిఏఓ శ్రీధర్‌రెడ్డి, డిహెచ్ఎస్ఓ నాగయ్య, వ్యవసాయ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు, ఎఫ్‌పిఓ చైర్మన్లు, విత్తన డీలర్లు, విత్తన ఉత్పత్తిదారులు, రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలోని పానగల్లు రోడ్డులో గల 3, 18, 19 వార్డు ల్లో విద్యుత్ సమస్య పరిష్కారానికై చీఫ్ ఇంజనీర్ 62 లక్షలు మంజూరు చేయడం జర్గిందని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కొండూరు సత్యనారాయణ వెల్లడించారు.బుధవారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్న గాలికి,వానక ఓవర్ లోడ్ తో తరచూ కరెంట్ పోయి అంతరాయం జరుగుతుందని ఈ సందర్భంగా ఇప్పటికే శ్రీరామ్ నగర్ కాలనీలో 20 లక్షలతో 11 కేవీ విద్యుత్ లైన్ స్పెషల్ ఫీడర్ ఏర్పాటు చేయడం జరిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం 3,18,19 వార్డుల్లో ఉన్న విద్యుత్ సమస్య పరిష్కారానికై, లోవోల్టేజ్ సమస్య, త్రిఫేస్ వైర్ లేని సమస్య,ఆధనపుటాన్స్ఫార్మర్,ఇంటర్ మీడియట్ పోల్స్ ఏర్పాటు కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు కొరుకు 42 లక్షల రుపాయల తో పానగల్లు,సబ్ స్టేషన్ నుండి శ్రీనగర్ కాలనీ 19వ వార్డు వరకు 11 కేవీ విద్యుత్ ఫైన్ స్పెషల్ ఫీడర్ ఏర్పాటుకు కూడాల క్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. గత ఆరు నెలల క్రితం జిల్లా కలెక్టర్ సంబందిత శాఖ అధికారుకు విన్నవించుకోవడంతో శాఖ అధికారుల సహకారం తో ఈ నిధులు మంజూరైనాయని సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# తేమశాతం ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

### ముల్కలపల్లిలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** కొనుగోలు కేంద్రాలలో తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం పెద్ద తండా, ముల్కలపల్లి గ్రామంలోగల పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు సెంటర్‌లను బుధవారం జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఇప్పటివరకు ఎంత ధాన్యం వచ్చిందని, ఇప్పటి వరకు ఎంత కొనుగోలు చేశారని అడిగి తెలుసుకున్నారు. తేమశాతం వచ్చిన ధాన్యం ఇంకా ఎంత ఉందని అడిగి ఉదయం, సాయంత్రం తేమ శాతం చెక్ చేసి తేమశాతం వచ్చిన వెంటనే కొనుగోలు చేయాలన్నారు. తేమ శాతం వచ్చిన ధాన్యం కేంద్రంలో ఉండటానికి వీలు లేదన్నారు. లారీలు రాక కాంట వేయలేదని తెలపడంతో సంబంధిత కాంట్రాక్టర్ తో మాట్లాడి రోజు రెండు, మూడు లారీలు పంపించాలని లారీలు రాక పోతే ధాన్యం కుప్పలు కేంద్రాల్లో ఉంటే కాంట్రాక్టర్‌లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరంవివిధ దశలలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. గ్రామంలోఇప్పటి వరకు మంజూరీ అయిన ఇండ్ల నిర్మాణాలు అవి ఏఏ దశలలో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పూర్తి అయి ఉన్న ఇంటిని పరిశీలించారు. ఇప్పటి వరకు 3 బిల్లులు వచ్చాయా అని లబ్ధిదారులని అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులు ఎప్పటి లోగా పూర్తి చేస్తారు అని అడిగారు. త్వరగా పూర్తి చేస్తే మిగిలిన లక్ష రూపాయలు కూడా మీ అకౌంట్‌లలో వెంటనే జమ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఎమ్మార్వో జలకుమారి, ఎంపీడీవో గీతారెడ్డి, సెక్రటరీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# హెచ్ఎండిఏ నిధులతో దెబ్బతిన్న రోడ్లకు మోక్షం

### భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి వెల్లడి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** హెచ్ఎండిఏ నిధులతో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలకు దెబ్బతిన్న రోడ్లకు మోక్షం లభించనుందని నూతన రోడ్ల నిర్మాణం చేపడతామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన మండలంలోని దేశ్ముఖి పిల్లాయిపల్లి జూలూరు వయా పెద్దగూడెం గ్రామాల మధ్య గల నూతనంగా వేసిన తారు డబుల్ రోడ్డును ప్రారంభించి మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి రావటంతో ఇరు గ్రామాల ప్రజల 30 ఏళ్ల కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు.రూ.6.58కోట్ల నిధులతో ఎన్ హెచ్ 65 నుండి 12కిమీ మేర రోడ్డును ఆర్ అండ్ బి నిధులతో కాంట్రాక్టర్ సహకరించడంతో ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన రోడ్డు పూర్తి అయినందుకు సంతోషంగా ఉందని కాంట్రాక్టర్కు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల ఆశలు ఆకాంక్షల మేరకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రానున్న రోజుల్లో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి సుపరిపాలన అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన రోడ్డును కేవలం 9 నెలల్లో పూర్తిచేసి ప్రజలకు అంకితం ఇచ్చారని చెప్పారు.నాడు ప్రతిపక్ష నేతగా ఎన్నో సార్లు ధర్నాలు చేసిన అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదనీ ఏ రోడ్డు కోసమైతే ఆనాడు ధర్నా చేశారో అదే రోడ్ ను తన చేతుల మీదుగా ప్రారంభించడం గొప్ప విషయమని ప్రజలు హర్షిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు.గత ప్రభుత్వాలు చేయలేని పనిని కేవలం రెండున్నర ఏళ్లలో కాంట్రాక్టర్ తో మాట్లాడి అదనపు వ్యయ అంచనాతో నిధులు మంజూరి చేసి రోడ్డును పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రజా పాలనలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుని విశ్వాసం పెంచుతూ ప్రజల హృదయాలను గెలుస్తున్న ప్రభుత్వం తమదని పునరుద్ఘాటించారు. రేవలపల్లి గౌస్ కొండ, శివారెడ్డి గూడెం ఇంద్రియాల రామలింగంపల్లి గ్రామాలకు త్వరలో నూతనంగా రోడ్లను నిర్మించనున్నట్లు జూలూరు రుద్రవెల్లి హై లెవెల్ వంతెనను కూడా పూర్తి చేయనున్నట్లు చెప్పారు. క్రాఫ్ హాలిడే లేకుండానే మూసీ నది పరివాహక ప్రాంతంలోని కాలువల మరమ్మతులను చేపట్టి రైతులకు పంట నీరు అందించే పనులు వేగవంతంగా చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పిలాయిపల్లి గ్రామ రజకులు కోరిన వెంటనే దోబీ ఘాట్ నిర్మాణం మంజూరు చేశారు. ఆ గ్రామంలో ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని కోరారు. నిర్మాణంలో ఉన్న గౌడ సంఘ భవనాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. పెద్దగూడెం గ్రామంలో రూ.18 లక్షలతో నిర్మించిన గౌడ సంఘం భవనాన్ని ఆయన ప్రారంభించారు. దేశ్ముఖిలో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తడక వెంకటేశ్వర్లు, జిల్లా సీనియర్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు మర్రి నరసింహారెడ్డి, మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షులు పకీరు నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గీత వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/మోత్కూర్ :** కల్లు గీతా కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 22న హైదరాబాదు బషీర్‌బాగ్‌లో జరిగే గీత పనివారలసంఘం రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని చాపల అంజయ్య పిలుపునిచ్చారు. బుధవారం రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వేలాది మంది వెనుకబడిన గీత కార్మికులకు చెందిన ప్రజలు కల్లుగీత వృత్తిలో జీవిస్తున్నారని, ప్రమాదవశాత్తు గీత కార్మికుడు తాడిచెట్టు పై నుండి మరణిస్తే ప్రభుత్వం నుంచి ఇచ్చే ఎక్స్‌గ్రేషియా రూ.13 కోట్ల పెండింగ్‌లో ఉన్నదని తెలిపారు. తాడిచెట్టు పై నుండి పడి గాయాలైన గీత కార్మికులకు ఎలాంటి సహాయం ప్రభుత్వం నుండి సమయానికి అందడం లేదని విమర్శించారు. ప్రభుత్వం సేఫ్టీ కిట్స్ పంపిణీ చేయాలని, అర్హులైన గీతకార్మిలకు మోపెడ్లు ఇవ్వాలని, గీత కార్మికులకు వృత్తి పెన్షన్ రూ.5000 ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మోత్కూర్ సొసైటీ అధ్యక్షులు బీసు సత్తయ్య, జిల్లా నాయకులు అనేపు వెంకట్, పులికరం మల్లేష్, గీతా పనివాళ్ల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బత్తిని శీను, ఎడ్ల నరేష్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బోయిన వెంకన్న, బీసు సత్యనారాయణ, గీత సంగం నాయకులు మడిపల్లి రంగయ్య, చాపల మల్లయ్య, మల్లె బోయిన బుచ్చయ్య, ఆరే సోమయ్య, గౌడిశాల రాజయ్య, బత్తిని లింగయ్య పాల్గొన్నారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## అవయవ దానంపై జాతీయ విధానం రూపొందించండి..: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** అవయవ దానం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాష్ట్రాలతో కలిసి జాతీయ విధానం, ఏకీకృత నియమావళిని రూపొందించాలని బుధవారం కేంద్రాన్ని సుప్రీంకోర్టు కోరింది. చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఇండియన్ సొసైటీ ఆఫ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ దాఖలు చేసిన పిల్‌పై ధర్మాసనం ఈ అభిప్రాయం వ్యక్తం చేసింది. అవయవ దానంకు చెందిన 1994 నాటి చట్టానికి సవరణలు జరిగాయని, 2011 చట్టాన్ని అమలు చేసే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరింది. కర్నాటక, తమిళనాడు, మణిపూర్ రాష్ట్రాలు కూడా కొత్త చట్టాన్ని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోర్టు సూచించింది. అవయవ దానాలకు చెందిన జాతీయ విధానాన్ని అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం ధర్మాసనం కోరింది. అవయవ దానం చేసిన వారికి న్యాయం దక్కే విధంగా చర్యలు ఉండాలని కోర్టు తెలిపింది. దాతల సంక్షేమం ముఖ్యమని పేర్కొన్నది.

## రక్తపాతం ముగిసిపోలే

### జమ్ముకశ్మీర్ భద్రతకు బాధ్యత వహించే వారిని జవాబుదారీ చేయాలి: సిఎం ఒమర్ అబ్దుల్లా



**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్ ప్రత్యేక హోదాను రద్దు చేయడం వల్ల కేంద్రపాలిత ప్రాంతంలో రక్తపాతం ముగియలేదని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. భద్రతకు బాధ్యత వహించే వారిని జవాబుదారీగా చేయాలన్నారు. 'ఈ హింసాత్మక చక్రం ఆగిపోవాలని మేము కోరుకుంటున్నాము. జమ్ముకశ్మీర్, ముఖ్యంగా కశ్మీర్, గత 30–35 సంవత్సరాలలో చాలా రక్తపాతాన్ని చూసింది. ఇది ఇప్పుడు జరగదని, 2019 తర్వాత ఈ చక్రం ముగిసిపోతుందని మాకు చెప్పారు. కానీ, అలా జరగలేదు' అని అబ్దుల్లా దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో బుధవారం విలేకరులతో అన్నారు. 'ఇది (హింస) ఎందుకు ముగియలేదో మీరు మా భద్రతకు బాధ్యత వహించే వారిని అడగాలి. ఆ బాధ్యత మా చేతుల్లో లేదు' అని ఆయన అన్నారు. భద్రతా సమస్యలను ఎత్తిచూపుతూ, ఎక్కడో ఒకచోట హింసాత్మక ఘటన జరుగుతోందని అబ్దుల్లా అన్నారు. ఢిల్లీలో బాంబు పేలకపోతే, అది ఇక్కడే పేలుతుందని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో ఇటీవల జరిగిన కారు పేలుడు, శుక్రవారం నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన ప్రమాదవశాత్తు జరిగిన పేలుడును ప్రస్తావిస్తూ ఆయన అన్నారు. ఇటువంటి ఘటనలలో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని విచారం వ్యక్తం చేశారు. మంగళవారం సంతాప సభ కోసం ఐదు ప్రదేశాలకు వెళ్లానని, బుధవారం మరో రెండు ప్రదేశాలను సందర్శించానని ముఖ్యమంత్రి చెప్పారు. శుక్రవారం నౌగామ్ పేలుడులో ప్రాణాలు కోల్పోయిన ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ బృందంలోని సభ్యులు హెచ్ఎంటి జైనాకోట్‌లో ఐజాజ్ అష్ఫల్ మీర్, బెమినాలో మహ్మద్ అమీన్ మీర్, కమర్వారీలో షోకత్ అహ్మద్ భట్ కుటుంబాలను అబ్దుల్లా పరామర్శించారు. వీరందరూ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ బృందం సభ్యుల్యు శాఖ చౌకీదార్) సుహైల్ అహ్మద్ రాథర్, వనబాల్‌లో (దర్జీ) మొహమ్మద్ షఫీ పరాయ్ కుటుంబాలను కూడా ఆయన పరామర్శించారు.

## విదేశీ చదువు ఎంపికలో...
# 97శాతం భారతీయ విద్యార్థులే

### కెరీర్‌కు దోహదపడే విద్య వైపే ఆసక్తి
### 'ఆర్లింగ్టన్ రీసెర్చ్' వెల్లడి
### అంతర్జాతీయ ఉన్నత విద్యనుంచి శక్తివంతమైన మార్పును ఆశిస్తున్నారని నివేదిక స్పష్టీకరణ




**న్యూఢిల్లీ :** భారతీయ విద్యార్థులు విదేశాలలో చదువుకునే సమయంలో వివేకవంతమైన, సృజనాత్మక, ముందుచూపు నిర్ణయాలను తీసుకుంటూ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నారు. లండన్‌కు చెందిన ఓ విశ్వవిద్యాలయం చేసిన ఒక కొత్త అధ్యయనం ప్రకారం...97శాతం మంది భారతీయ విద్యార్థులు నేరుగా కెరీర్‌కు దారితీసే విద్యను కోరుకుంటున్నారని, విదేశాలలో ఎక్కడ చదువుకోవాలనేది ఎంచుకునేటప్పుడు ఉపాధి, పని అనుభవం, వాస్తవ ప్రపంచ నైపుణ్యాలు అవసరమని నమ్ముతున్నారని వెల్లడించింది. సిటీ సెయింట్ జార్జి యూనివర్సిటీ ఆఫ్ లండన్ నియమించిన ఆర్లింగ్టన్ రీసెర్చ్ నిర్వహించిన పరిశోధనలో భారతీయ కాబోయే విద్యార్థులకు ఉన్నత విద్య విలువ లెక్చరర్లు, పాఠ్య పుస్తకాలకు మించి ఉంటుందని అధ్యయనం తేల్చింది. 'విదేశాలలో చదుకోవడం యొక్క విలువ' అనే కొత్త నివేదిక ప్రకారం 97 శాతం మంది భారతీయ విద్యార్థులు విదేశాలలో ఎక్కడ చదువుకోవాలో ఎంచుకునేటప్పుడు ఉపాధి పని అనుభవం, వాస్తవ ప్రపంచ నైపుణ్యాలు అవసరమని అంటున్నారు. 'అంతర్జాతీయ ఉన్నత విద్య నుండి భారతీయ విద్యార్థులు ఇప్పుడు పొందుతున్న దానిలో శక్తివంతమైన మార్పు ఉంది. ఇది తరగతి అభ్యాసానికి మించి చాలా ఎక్కువగా ఉంటుంది. సర్వే చేయబడిన అన్ని కోర్సులలో అనువర్తిత అభ్యాసం, సాంకేతిక నైపుణ్యాలు, వృత్తిపరమైన ప్రవర్తనను వారి విద్యా అనుభవంలో ప్రధాన భాగాలకు విలువ ఇచ్చే అవకాశం భారతీయ అభ్యాసకులే ఎక్కువగా ఉన్నారు' అని నివేదిక తెలిపింది. యూనివర్సిటీ ఆఫ్ లండన్‌లోని ఎంప్లాయబిలిటీ సిటీ సెయింట్ జార్జి డైరెక్టర్ గెమ్మ కెన్యన్ ప్రకారం భారతీయ విద్యార్థులకు ఏ తరహా విద్య అందించాలి అంటే కేవలం జ్ఞానం మాత్రమే కాదు, నైపుణ్యాలు, విశ్వాసం, నెట్‌వర్క్‌లు నిజమైన కెరీర్ విజయానికి దారితీసే అంశాలపై నిశిత దృష్టిని సారిస్తున్నారని పేర్కొన్నారు. విద్యా నైపుణ్యాన్ని ఆచరణాత్మక అనుభవంతో కలిపే కార్యక్రమాలను రూపొందించడం విశ్వవిద్యాలయాలకు ఎంత ముఖ్యమో ఈ పరిశోధన హైలెట్ చేస్తుంది' అని కెన్యన్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 56 శాతం మంది విద్యార్థులు ఉపాధి సామర్థ్యాన్ని వారి ఉన్నతస్థాయి మూడు నిర్ణయం తీసుకునే అంశాలను ర్యాంక్ చేశారు. అగ్రనిర్ణయ కారకాలను పరిశీలించినప్పుడు ఇది 87శాతానికి పెరిగింది. భారతీయ ప్రతివాదులలో ఈ డిజైన్ అభ్యాసాన్ని ఉపాధి ఫలితాలతో నేరుగా అనుసంధానించాలనే బలమైన నమ్మకాన్ని కలిగి ఉన్నారు. 3,000మంది ప్రతివాదులతో నిర్వహించిన ప్రపంచ సర్వే ప్రకారం, విద్యార్థులు సహా తల్లిదండ్రులలో అన్ని సర్వేలలో భారతీయ విద్యార్థులే ఎక్కువగా ఉన్నారు. వారు అంతా అనువర్తిత అభ్యాసం, ఉద్యోగ సంసిద్ధతను నొక్కిచెబుతున్నారు. 60శాతం మంది ప్రతివాదులు అభ్యాసంలో సాంకేతికతను వర్తింపజేయడం అవసరమని చెప్పారు. కాగా 56శాతం మంది సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోడానికి ప్రాధాన్యతను ఇచ్చారు. అలాగే దాదాపు 56 శాతం మంది భారతీయ విద్యార్థులు వృత్తిపరమైన ప్రవర్తనలను నిర్మించడమే ముఖ్యమని రేట్ చేశారుచేశారు.

## పిసిసి అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాల్సి రావచ్చు : డికె



**బెంగళూరు:** రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాల్సి రావచ్చని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ సంకేతాలిచ్చారు. అయితే తాను ఎప్పుడూ ముందు వరుసలోనే ఉంటానని పార్టీ కార్యకర్తలకు హామీ ఇచ్చారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా జరిగిన పార్టీ కార్యక్రమంలో శివకుమార్ మాట్లాడుతూ 'నేను ఉన్నానా లేదా అనేది ముఖ్యం కాదు. కానీ నా పదవీకాలంలో 100 పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేయాలనుకుంటున్నాను' అని అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్‌గా తన అనిశ్చిత పదవీకాలంపై కొంతమంది పార్టీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేయడంపై స్పందిస్తూ తాను ఆ పదవిని శాశ్వతంగా నిర్వహించలేనని, ఇప్పటికే 5.5 సంవత్సరాలు గడిచాయని, మార్చి ఆటికి ఆరు సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఇతరులకు అవకాశం ఇవ్వాలని, అయితే నాయకత్వంలో ముందు వరుసలోనే ఉంటానని చెప్పారు. 2020 మేలో కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కెపిసిసి) అధ్యక్షుడిగా శివకుమార్ నియమితులయ్యారు. 2023 మేలో ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని అనుకున్నానని, కానీ ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ మరికొంత కాలం కొనసాగాలని కోరారన్నారు. కాగా, కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ కోసం ఆశతో పనిచేయడం కొనసాగించాలని శివకుమార్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెలలో తన ఐదేళ్ల పదవీకాలం సగం దాటుతున్నందున ముఖ్యమంత్రి పదవిలో మార్పు గురించి ఊహాగానాల మధ్య శివకుమార్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కాలాన్ని కొందరు 'నవంబర్ విప్లవం' అని పిలుస్తారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య అధికార పంపిణీ ఒప్పందం గురించి కొన్ని రోజుల నుంచి పుకార్లు వినిపిస్తూనే ఉన్నాయి. తాను బాధ్యత నుండి తప్పించుకోవడం లేదని, పార్టీ అధ్యక్షుడిగా ఒక ఉదాహరణగా నిలిచేందుకు ప్రయత్నిస్తున్నానన్నారు. 'ఇక్కడ ఎవరూ శాశ్వతంగా ఉండలేరు. వారి పదవీకాలంలో ఓ ముద్ర వేసుకోవాలి. నేను కొనసాగాలని చెప్పే వరకు పార్టీ అధ్యక్షుడిగా పని చేస్తాను. ఒక అధ్యక్షుడు ఎలా పని చేయాలో, క్రమశిక్షణను ఎలా పాటించాలో ఒక ఉదాహరణగా చూపించడానికి ప్రయత్నిస్తున్నాను' అని ఆయన అన్నారు.

## భరించలేని ఒత్తిడితోనే
# బిఎల్‌ఒలు మృతి

### 'సర్'ను వెంటనే నిలిపివేయాలి : సిఎం మమత



**కోల్‌కతా:** ఎన్నికల కమిషన్ 12 రాష్ట్రాలు, యుటిల్లో ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)ను చేపట్టిన విషయం తెలిసిందే. అయితే పని ఒత్తిడికి గురై బూత్ స్థాయి అధికారులతో (బిఎల్ఒ) పాటు ఓటరు జాబితాలో పేర్లు గల్లంతకావడంతో కలత చెందిన పలువురు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. గత రెండు రోజుల క్రితం కేరళలో ఓ బిఎల్ఓ ఆత్మహత్య చేసుకోగా, బెంగాల్‌లో 28 మంది మృతి చెందారు. ఈ నేపథ్యంలో జల్పైరిలోని మాల్ బ్లాక్‌లో బూత్ లెవల్ ఆఫీసర్ మరణంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సర్ క్షేత్రస్థాయి కార్యకర్తలపై 'అమానవీయ' ఒత్తిడిని పెంచిందని ఆరోపించారు. సర్ ప్రక్రియను భరించలేని ఒత్తిడి కారణంగా మరణించిన బిఎల్ఒగా పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్య చేసుకున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బెనర్జీ 2026 అసెంబ్లీ ఎన్నికలకు ముందు సర్‌ను చేపట్టడం 'ప్రణాళిక లేని, అవిశ్రాంతమైన పనిభారం'గా అభివర్ణించారు. ఈచర్యపై ఎన్నికల సంఘాన్ని విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆమె ఎక్స్‌లో పోస్టు చేశారు. కొందరు భయం, అనిశ్చితి కారణంగా, మరికొందరు ఒత్తిడి, ఓవర్‌లోడ్ కారణంగా మృత్యువాత పడుతున్నారన్నారు.గతంలో మూడు సంవత్సరాలు చేపట్టిన ప్రక్రియను ఇప్పుడు రాజకీయ యజమానులను సంతోషపెట్టడానికి ఎన్నికల ముందు రెండు నెలలుగా బలవంతంగా సర్‌ను చేస్తున్నారని, దీంతో బిఎల్‌ఒలపై అమానవీయ ఒత్తిడిని పెంచుతున్నారని మండిపడ్డారు. ఈ ప్రక్రియ ఇలాగే కొనసాగితే మరికొన్ని ప్రాణాలు పోవచ్చని హెచ్చరిస్తూ, ఎన్నికల కమిషన్ మనస్సాక్షితో వ్యవహరించి డ్రైవ్‌ను నిలిపివేయాలని కోరారు.

**సర్‌తో కలత చెంది వ్యక్తి ఆత్మహత్య ...** పశ్చిమ బెంగాల్‌లోని నార్త్ 24 పరగణాస్ జిల్లాలో 58 ఏళ్ల వ్యక్తి పురుగుమందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఓటర్ల జాబితాకు సంబంధించిన సమస్యలపై అతని తీవ్రంగా కలత చెందిటన్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బదురియా పోలీస్ స్టేషన్ పరిధిలోని జాదుర్హతి పుర్బా నివాసి సోఫికుల్ మండల్ సర్ ప్రారంభమైన తర్వాత 2002 ఓటర్ల జాబితాను తనిఖీ చేసినట్లు వారు తెలిపారు. ఓటర్ల జాబితాలో మోండల్ పేరు కనిపించినప్పటికీ, అనేక మంది కుటుంబ సభ్యుల పేర్లు తప్పిపోయాయి. దీంతో స్థానభ్రంశం చెందే అవకాశం ఉందనే భయం ఏర్పడిందని బసిర్హాట్ పోలీస్ జిల్లాకు చెందిన సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. మంగళవారం మోండల్ పురుగుమందు సేవించి మరణించాడని ఆరోపించారు. అతను అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించిన తర్వాత కుటుంబ సభ్యులు అతన్ని స్థానిక ఆసుపత్రికి తరలించారని ఆయన చెప్పారు. ఆ తరువాత కోల్‌కతాలోని కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు తరలించగా, అక్కడ ఆయన మరణించినట్లు ప్రకటించారు. అయితే ఇటీవల కూడా నార్త్ 24 పరగణాలు, ముర్షిదాబాద్, బిర్భూమ్, నాడియాతో సహా అనేక జిల్లాల నుండి సర్ ప్రక్రియపై ఆందోళనతో సంబంధం ఉన్న మరణాలు జరిగినట్లు వార్తలు వచ్చాయి.

# జవాద్‌కు 13రోజుల ఇడి కస్టడీ

### విద్యార్థుల నుంచి రూ.415.10 కోట్లు వసూలు చేసిన అల్ ఫలాహ గ్రూప్ చైర్మన్




**న్యూఢిల్లీ:** ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనపై ముమ్మర దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అరెస్ట్ చేసిన హర్యానాలోని అల్ ఫలాహ యూనివర్శిటీ చైర్మన్ జవాద్ అహ్మద్ సిద్ధిఖీని ఢిల్లీ న్యాయస్థానం 13 రోజుల ఇడి కస్టడీకి అప్పగించింది. ఇక యూనివర్సిటీపై ఇడి నిర్వహించిన సోదాల్లో విద్యార్థుల నుంచి రూ .415 10 కోట్లు వసూలు చేసినట్లు తేలింది. ఢిల్లీ పేలుడు నిందితులకు ఉన్న సంబంధాల నేపథ్యంలో విశ్వవిద్యాలయం ఆర్థిక వ్యవహారాలపై మంగళవారం ఇడి అధికారులు సోదాలు నిర్వహించారు. ఉదయం 5.15 గంటలకు మొదలైన దాడులు, వర్సిటీకి చెందిన ప్రధాన కార్యాలయంతో పాటు సంస్థ ట్రస్టీలు, ప్రమోటర్ల ప్రాంగణాల్లో రోజంతా కొనసాగాయి. జవాద్ అహ్మద్ సిద్ధిఖీ ఇంట్లో కూడా అధికారులు సోదాలు నిర్వహించారు. ఆయనను ప్రశ్నించారు. అనంతరం నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం కింద అరెస్టు చేశారు. అనంతరం ఢిల్లీలోని న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. యూనివర్శిటిలో తీవ్రమైన ఆర్థిక అక్రమాలు జరిగాయని కస్టడీకి ఇవ్వాలని న్యాయమూర్తిని కోరారు. తప్పుడు అక్రిడిటేషన్, తప్పుడు గుర్తింపులు చూపించి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి అల్ ఫలాహ విశ్వవిద్యాలయం, దాని పరిపాలన ట్రస్ట్ రూ.415.10 కోట్ల ఆర్జించినట్లు రిమాండ్ రిపోర్టులో ఇడి ఆరోపించింది. రూ.48 లక్షలకు పైగా నగదు, డిజిటల్ పరికరాలు, డాక్యుమెంటరీ ఆధారాలు లభ్యమైనట్లు ఇడి అధికారులు తెలిపింది. 2014–15 నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరాల వరకు ఉన్న విశ్వవిద్యాలయ ఆదాయ పన్ను రిటర్న్‌లలో ఫీజుల రూపంలో వచ్చిన ఆదాయాన్ని స్వచ్ఛంద విరాళంగా చూపిస్తున్నట్లు గుర్తించింది. అల్ ఫలాహ విశ్వవిద్యాలయంపై సిద్ధిఖీ పూర్తి నియంత్రణను కలిగి ఉన్నారని వర్సిటీ ఆదాయంలో కొంత భాగాన్ని మాత్రమే తాము గుర్తించామని కోర్టుకు తెలిపింది. కస్టడీకి తీసుకుని విచారణ జరిపితేనే పూర్తి వివరాలు తెలుస్తాయని వివరించింది. ఇడి అభ్యర్థనను అంగీకరించిన కోర్టు 13 రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చింది. ఇటీవల ఫరీదాబాద్‌లో ఉగ్ర మాడ్యూల్‌ను అధికారులు చేధించారు. మాడ్యూల్‌లోని వ్యక్తులకు ఈ యూనివర్సిటీతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. దీంతో యూనివర్శిటీ పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. మాడ్యూల్‌తో సంబంధాలు బయటపడిన తర్వాత ఇండియన్ యూనివర్సిటీల సంఘం (ఎఐయు) అల్‌ఫలాహ విశ్వవిద్యాలయం సభ్యత్వాన్ని రద్దు చేసింది. ఈక్రమంలో ఢిల్లీ పోలీసులు యూనివర్సిటీలపై రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఫోర్జరీ, మోసం పేరిట కేసు నమోదయ్యాయి. మరోవైపు విశ్వవిద్యాలయానికి న్యాక్ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. విద్యాసంస్థ వెబ్‌సైట్‌లో గుర్తింపు గురించి తప్పుడు సమాచారం ప్రచురించినందుకు గానూ ఇవి జారీ చేసినట్లు తెలిపింది. సోమవారం విశ్వవిద్యాలయం చైర్మన్ జావెద్‌కు రెండు సమన్లు జారీ చేశారు.

## గ్యాంగ్‌స్టర్ అన్మోల్ బిష్ణోయ్‌ను భారత్‌కు తీసుకొచ్చిన ఎన్ఐఎ



**న్యూఢిల్లీ:** ఎన్‌సిపి నేత బాబా సిద్ధిఖీ హత్య కేసులో కీలక నిందితుడైన అన్మోల్ బిష్ణోయ్‌ను అమెరికా డిపోర్ట్ చేయగా, అతనిని ఎన్ఐఎ అధికారులు భారత్‌కు తీసుకొచ్చారు. అతనితోపాటు మరో 199 మందిని కూడా అమెరికా డిపోర్ట్ చేసింది. వారిలో ఇద్దరు పంజాబ్ మోస్ట్ వాంటెడ్ జాబితా ఉండగా, మరో 197 మంది అమెరికాలో అక్రమంగా నివసిస్తున్నవారు కావడం గమనార్హం. బుధవారం మధ్యాహ్నం ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో వీరిని తీసుకొచ్చిన విమానం ల్యాండ్ అయ్యిందని అధికారులు తెలిపారు. అమెరికా నుంచి తీసుకొచ్చిన గ్యాంగ్‌స్టర్ అన్మోల్ బిష్ణోయ్‌ను ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టులో హాజరుపరుస్తారని సమాచారం. వాస్తవానికి గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ తమ్ముడే ఈ అన్మోల్ బిష్ణోయ్. గతేడాది ఏప్రిల్ నెలలో బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ఇంటివద్ద కాల్పులకు బాధ్యత వహిస్తూ స్వయంగా ఇతనే సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడం గమనార్హం. దీనితో ముంబయి పోలీసులు ఇతనిపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. అన్మోల్ బిష్ణోయ్ చాలా కేసుల్లో కీలక నిందితుడిగా ఉన్నాడు. 2022లో ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య కేసులో కూడా ఇతను అభియోగాలు ఎదుర్కొంటున్నాడు. అయితే మూసేవాలా హత్యకు కొన్ని రోజుల ముందు అన్మోల్ నకిలీ పత్రాలు ఉపయోగించి దేశం దాటి వెళ్లాడని నిఘా వర్గాలు గుర్తించాయి. అతనిపై వివిధ ప్రాంతాల్లో దాదాపు 20 వరకు కేసులు నమోదు అయ్యాయి. అతని గురించి సమాచారం ఇచ్చిన వారికి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) రూ. 10 లక్షల రివార్డు కూడా ప్రకటించడం గమనార్హం. అన్మోల్ బిష్ణోయ్ విదేశాల్లోనూ క్రిమినల్ కార్యకలాపాలు నిర్వహించేవాడు. అక్కడ నుంచే ఆజ్ఞలు ఇస్తూ, తన అనుచరులతో భారత్‌లో పలు క్రైమ్స్ చేయించినట్లు పోలీసులు గుర్తించారు. అందుకే అతడిని భారత్‌కు రప్పించేందుకు ముంబయి పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలోనే గతేడాది అన్మోల్ అమెరికా పోలీసులకు చిక్కాడు. దీనితో అతనిని అప్పగించాలని ఎన్ఐఏ అధికారులు అమెరికాలోని ఎఫ్‌బిఐ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ సెక్యూరిటీలతో సంప్రదింపులు జరిపారు. దీనితో అమెరికా అన్మోల్ బిష్ణోయ్‌ను డిపోర్ట్ చేసింది.

## ఢిల్లీలో పేలుడు భద్రతా తప్పిదం

### పార్లమెంటుకు ప్రధానమంత్రి జవాబివ్వాలి
### కాంగ్రెస్‌నేత సల్మాన్ ఖుర్షీద్ డిమాండ్



**న్యూఢిల్లీ:** ఢిల్లీలో పేలుడు ఘటన తప్పిదంపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పార్లమెంటుకు త్వరలో సమాధానం చెప్పాలని కాంగ్రెస్‌పార్టీ నాయకుడు,విదేశీ వ్యవహారాల మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ డిమాండ్ చేశారు. ఈ పేలుడు ఘటన కేంద్ర ప్రభుత్వ భద్రతా విధానంపై తీవ్రమైన ప్రశ్నార్థకంగా మారిందని పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఈ పేలుడు ఘటన కేంద్ర ప్రభుత్వ భద్రతా తప్పిదమని విమర్శించారు. మోదీ ప్రభుత్వం ఆందోళన చెందుతున్నకొద్దీ ఇప్పుడు వ్యూహాత్మకమైన తప్పిదాలు ఇంకా ఇంకా పెరుగుతున్నాయని విమర్శించారు. వ్యక్తిగతీకరించిన, అప్పుడప్పుడు, అక్కడక్కడ జరుగుతున్న ఒకే విధమైన విషయాలను గుండుగుత్తగా ఏకరువు పెడుతూ ప్రస్తుతం కొనసాగిస్తున్న ఆరోపణల విధాన తతంగానికి బదులుగా విదేశీ విధానంపై అధ్యయనం చేయాలని ఆయన పిలుపు ఇచ్చారు. ''మనం విదేశీ విధానాన్ని అధ్యయనం చేయాలి, విదేశీ విధానాన్ని అధ్యయనం చేయడం లేదని నేను అనుకోవడంలేదు, మనకు అస్వాభావికమైన విదేశాంగ విధానం ఉంది, వ్యక్తిగతీకరించిన విదేశీ విధానం ఉంది, అడపాదడపా చేసే విదేశీ విధానం, ఒకే విధమైన ఘటనలు అప్పుడప్పుడు అక్కడక్కడ జరుగుతుంటే వాటిపై ఆరోపణలు చేస్తూ స్పందించే విదేశీ విధానం ఉంది, ఇలాకాదు, ఇదంతా వద్దు, దీనిని అసలు విదేశీ విధానం అనరు'' అని చెప్పారు. ''ప్రపంచంతో ముడిపడిన భారత భవితవ్యం' ఒక విదేశీ విధాన ప్రణాళిక'' అనే పేరుతో ఇటీవల విడుదలైన ఒక పుస్తకం గురించి ఆయన మాట్లాడుతూ, ఎర్రకోట వద్ద ఇటీవల జరిగిన ఘటన, దేశంలో అక్కడక్కడ జరుగుతున్న ఘటనలను, వీటిమధ్య ఉన్న సంబంధాలను పరిశీలించాలని, ఈ ఘటనలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం నుండి ఇన్ని రోజులుగా ఒక స్పష్టమైన ప్రకటన వెలువడలేదని ఆయన విమర్శించారు. ఈ విధమైన గూఢచారి వైఫల్యం ఎలా జరిగింది? ఇందులో ఉన్న చిక్కులు ఏమిటి? ప్రత్యేకించి గతంలో చేసిన ప్రకటనల నేపథ్యంలో జరుగుతున్నది ఏమిటి? అని ఆయన ప్రశ్నించారు. మన చుట్టూ ఉన్నవాళ్ళంతా ప్రభుత్వం ఏం చేస్తోందో మీరు చూడం లేదని అంటున్నారు. కానీ ఈ సంక్షోభ పరిస్థితుల్లో ప్రభుత్వం మంచి నిర్ణయాలు తీసుకుంటుందని, వాటితో ప్రజల ముందుకు వస్తుందని, ఆ నిర్ణయాలపై ప్రభుత్వానికి స్పష్టమైన మద్దతు ఇవ్వాలని అనుకున్నప్పటికీ ప్రజలకు, ప్రతిపక్షానికి నమ్మకం కలిగించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. ఢిల్లీల పేలుడు ఘటన చాలా తీవ్రమైన ప్రశ్నార్థకమని, ప్రభుత్వ భద్రతా విధానంపై మచ్చ అన్నారు. వెంటనే ప్రధానమంత్రి పార్లమెంటుకు రావాలని, పార్లమెంటుకు దీనిపై సమాధానం చెప్పాలని కోరారు.

## 'సర్' రెండో విడతలో 99శాతం
## ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీ : ఇసి

**న్యూఢిల్లీ :** ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ రెండో విడతలో 99శాతం ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీ చేసినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. 9రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 51కోట్ల ఓటర్లలో సుమారు 50.35 కోట్ల మందికి పైగా ఓటర్లు ఈ పత్రాలను అందుకున్నట్లు ఇసి బుధవారం వివరించింది. ఈ ఎన్యూమరేషన్ ప్రక్రియ డిసెంబర్ 4 వరకు నెల పాటు కొనసాగుతుందని, అక్టోబర్ 27 వరకు ఓటరు జాబితాలో ఉన్న ప్రతి ఓటరుకు సంబంధించి పాక్షిక వివరాలు ఎన్యూమరేషన్ ఫారంలో (ఇఎఫ్) ఉంటాయని తెలిపింది. ఎస్ఐఆర్ రెండో దశలో భాగంగా ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, బంగాల్ రాష్ట్రాలు సహా అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరిలు ఉన్నాయని ఇసి వెల్లడించింది. ఇందులోని 321 జిల్లాలు, 1843 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 51 కోట్ల ఓటర్లను కవర్ చేయనున్నట్లు వివరించింది. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు దాదాపు 5.3లక్షల మంది బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఒలు), 7.64లక్షల బూత్ స్థాయి ఏజెంట్లు (బిఎల్‌ఏలు), 10,448 ఇఆర్‌ఒ/ఎఇఆర్‌ఒలు, 321 మంది డిఇఒలు విధుల్లో నిమగ్నమయ్యారని ఇసి తెలిపింది.


**GYANA JYOTHI COLLEGE OF PHARMACY**
( Approved by AICTE, PCI & Affiliated to JNTU - Hyderabad )
Uppal Bus Depot, hyderabad - 500 039, Ph: 9393144412/15/18,
E-mail: gyanajyothicollege@gmail.com, Web: www.gjcp.ac.in.

**SPOT ADMISSIONS**

* Spot Admissions will be made on 22/11/2025 to 26/11/2025 in College Premises.
* Interested Candidates can Report before 5.00 PM along with the original Certificates
* Tuition Fee in form of DD/Challan.
* Admissions will be made as per guidelines issued by the TGPGECET - 2025

Sd/- Principal

## 'సురక్షిత నెలల్లో' పాఠశాలల క్రీడా పోటీల వాయిదా ఆదేశాన్ని పరిశీలించాలని...
# సిఎక్యూఎంకు 'సుప్రీం' దిశానిర్దేశం



**న్యూఢిల్లీ :** వాయు కాలుష్య స్థాయిలను దృష్టిలో ఉంచుకుని నవంబరు, డిసెంబరులలో జరగాల్సిన బహిరంగ క్రీడా పోటీలను 'సురక్షిత నెలలకు' వాయిదా వేయాలని ఢిల్లీ ఎన్‌సిఆర్ పరిధిలోని పాఠశాలలను ఆదేశించడాన్ని పరిశీలించాలని బుధవారం సుప్రీంకోర్టు కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సిఎక్యూఎం)ను కోరింది. ఢిల్లీజాతీయ రాజధాని ప్రాంతంలోని తీవ్రమైన వాయుకాలుష్య సంక్షోభానికి ముందస్తు చురుకైన విధానం అవసరమని, నెలవారీగా అభివృద్ధిని పర్యవేక్షించడానికి అత్యున్నత న్యాయస్థానం ఈ కేసును తప్పకుండా విచారించాలని ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. పెద్దలు ఎయిర్ ప్యూరిఫైయర్లతో మూసివేసిన ప్రదేశాలలో కూర్చున్నప్పుడు పిల్లలు బహిరంగ 'గ్యాస్‌ఛాంబర్'లో క్రీడలు, ఆటల పోటీలకు శిక్షణ పొందుతున్నారని అమికస్‌క్యూరీగా ధర్మాసనానికి సహాయం చేస్తున్న సీనియర్ న్యాయవాది అప్రాజిత సింగ్ చెప్పిన తర్వాత సిఎక్యూఎంకి దిశానిర్దేశం చేయబడింది. 'పిల్లలు చాలా దుర్బలంగా ఉన్నారు. ఇప్పుడు క్రీడలను నిర్వహించడం వారిని గ్యాస్ ఛాంబర్‌లలో ఉంచడం లాంటిది' అని ఆమె చెప్పారు. దీనిని పరిగణనలోనికి తీసుకుని, అటువంటి క్రీడా పోటీలను సురక్షితమైన నెలలకు మార్చడానికి అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని మేం సిఎక్యూఎంని అభ్యర్థిస్తున్నామని ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ అన్నారు. ప్రారంభంలో, కేంద్రం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి మాట్లాడుతూ మంగళవారం నాడు ఎంఒఇఎఫ్‌సిసి ( పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ) కార్యదర్శి ఢిల్లీఎన్‌సిఆర్ రాష్ట్రాల ఉన్నత అధికారులతో నిర్వహించిన ఒక ఉన్నత స్థాయి సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో కాలుష్య నియంత్రణకు చేపట్టాల్సిన దీర్ఘకాలిక, స్వల్పకాలిక చర్యల గురించి చర్చించారు. '2018 నుండి ఇప్పటికే దీర్ఘకాలిక విధానం, 2015నుండి గ్రేడెడ్ రెస్పాన్స్ ప్లాన్ ఉంది. ఇదంతా కోర్టు ఆధారితమైనది. చూసేందుకు అంతా చాలా బాగుంది. కానీ క్షేత్రస్థాయిలో కాలుష్య నియంత్రణ బోర్డుకు ఎలాంటి మానవ శక్తి లేదు' అని అమికస్ క్యూరీ చెప్పారు. కాలుష్యం గరిష్ఠస్థాయికి చేరుకున్నప్పుడు మాత్రమే ప్రతిస్పందిత చర్యలు తీసుకోవడం తగదని, ప్రధాన వాదనను ప్రతీ నెలా ఒకసారి జాబితా చేయమని, తద్వారా కాలుష్య నిరోధక వ్యూహాలను అమలు చేయవచ్చని ధర్మాసనం చెప్పింది. ఉద్భవిస్తున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిఆర్‌పిఎ పాలన కింద కఠినమైన ఆంక్షలను విధించడానికి సిఎక్యూఎం మరియు సిపిసిబిలకు ధర్మాసనం అనుమతించింది. జిఆర్‌పిఎ ఆంక్షల కారణంగా నిర్మాణకార్మికులు నిరుద్యోగులుగా ఉన్నారనే అంశంపై ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ మాట్లాడుతూ 'నిషేధించబడిన కార్యకలాపాలపై కార్మికులు ఆధారపడతారని, తద్వారా వారు బాధపడతారని మేం ఇప్పటికే నిర్ధారించాం' అని అన్నారు. కాలుష్య సంబంధిత ఆంక్షలు రోజువారీ కార్మికుల వేతనాలపై, ముఖ్యంగా నిర్మాణ, అనుబంధ రంగాలలోని కార్మికులపై చూపే ప్రభావాన్ని కూడా ధర్మాసనం ఈ సందర్భంగా ప్రస్తావించింది. కార్మికులకు జీవనాధార భత్యాల చెల్లింపునకు సంబంధించిదుపరి విచారణలో ఆదేశాలను పొంది కోర్టుకు తెలియజేయాలని ఎన్‌సిఆర్ రాష్ట్రాలు ఢిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, హర్యానా, రాజస్థాన్‌లను ఆదేశించింది. మంగళవారం నాడు ఢిల్లీ ఎన్‌సిఆర్‌లో గాలి కాలుష్యానికి దీర్ఘకాలిక పరిష్కారం కోసం ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. కాలుష్యాన్ని నియంత్రించడానికి అత్యవసర చర్యల గ్రేడెడ్ యాక్షన్ రెస్పాన్స్ ప్లాన్ (జిఆర్‌పిఎ) కింద నిషేధించబడిన కార్యకలాపాలపై ఏడాది పొడవునా ఆంక్షలు విధించడానికి ఇది నిరాకరించింది. పంజాబ్, హర్యానా రెండు రాష్ట్రాలలో పంట వ్యర్థాలను తగలబెట్టడంపై కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సిఎక్యూఎం) ఆదేశాలను కచ్చితంగా పాటించాలని అత్యున్నత న్యాయస్థానం కోరింది. పంజాబ్, హర్యానాలకు సిఎక్యూఎం సూచనలు అమలుచేయబడితే పంట వ్యర్థాలను తగలబెట్టడాన్ని తగినంతగా పరిష్కరించవచ్చు. అందువల్ల రెండు రాష్ట్రాలు సంయుక్తంగా సమావేశం నిర్వహించి సిఎక్యూ చర్యలు జాగ్రత్తగా అమలుచేయబడతాయని నిర్ధారించుకోవాలని మేం ఆదేశిస్తున్నాం అని ధర్మాసనం పేర్కొంది.

ప్రజాపక్షం
గురువారం, 20 నవంబరు

# చట్టం 'కార్పొరేట్' చుట్టం!

'చట్టం తన పని తాను చేసుకుపోతుంది', 'చట్టం ఎవరికీ చుట్టం కాదు' వంటి పడికట్టు ప్రకటనల వల్ల సామాన్యులకు ఒరిగేదీ లేదు. చట్టం కార్పొరేట్ శక్తుల చుట్టంగా మారిందన్న వైనం అనేకానేక సందర్భాల్లో బయటపడుతూనే ఉంది. 'అంబానీ' కుటుంబానికి చెందిన అనిల్ అంబానీని దశాబ్దాలుగా ఏ శక్తులు రక్షిస్తున్నాయన్నది బహిరంగ రహస్యం. భారీ స్థాయి బ్యాంకింగ్, కార్పొరేట్ మోసాల ఆరోపణలపై అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ (ఎడిఎజి)తో పాటు కేంద్ర ప్రభుత్వం, సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)లకు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేయడం... మూడు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించడం శుభ పరిణామం. 2007–08 నుంచే మోసాలు కొనసాగుతున్నప్పటికీ, ఈ ఏడాదే ఎఫ్ఐఆర్ నమోదైంది. సామాన్యుల విషయంలో కూడా ప్రభుత్వ వ్యవస్థలు ఇదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తాయా? చిన్నమొత్తాలు చెల్లించలేదని నగలు జీవిని నోటీసులతో వేధించి... బెదిరింపులకు పాల్పడి... వడ్డీతోసహా వసూలు చేసుకునే బ్యాంకులు అనిల్ అంబానీ పట్ల ఎనలేని ప్రేమ ఉన్నట్లు లేక మితిమీరి భయపడుతున్నట్లా? లేదా కార్పొరేట్ రంగాల ఆర్థిక అవకతవకలు బయటపడకుండా చేతులు మారే కోట్లాది రూపాయలు అన్ని వ్యవస్థల నోర్లు మూయిస్తున్నాయా? పెద్ద ఎత్తున జరిగిన ఈ మోసంలో బ్యాంకులు, వాటి అధికారుల పాత్రను దర్యాప్తు సంస్థలు ఎందుకు నిర్లక్ష్యం చేశాయి? 'భారత చరిత్రలో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద కార్పొరేట్ మోసం' కేసులో అధికారులపై జరిపిన దర్యాప్తు నివేదికలను ఎందుకు బహిర్గతం చేయడం లేదు? సిబిఐ, ఇడి జరిపిన దర్యాప్తు.. తేల్చిన వాస్తవాలపై సమగ్ర నివేదిక ఏదైనా ఉందా? ఇలాంటి ప్రశ్నలు కోకొల్లలు.

అనిల్ అంబానీ అప్పులన్నీ ఆయన అన్న ముఖేష్ అంబానీ తీర్చేశారంటూ గతంలో వార్తలు తెగ ప్రచారమయ్యాయి. అవన్నీ నేతిబీరకాయ చందమేనని సుప్రీం కోర్టులో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం స్పష్టం చేస్తున్నది. అనిల్ అంబానీ ఆధ్వర్యంలోని ఎడిఎజి అను బంధ సంస్థల్లోకి ప్రభుత్వ నిధులను మళ్లించడం ఆర్థిక ఉగ్రవాదమే. చిన్నచిన్న లావాదేవీలకు కూడా సవాలక్ష ప్రశ్నలు వేసి, ఆధారాలు పరిశీలించి, సమీక్ష పేరుతో కాలయాపన చేసే బ్యాంకులు అనిల్ అంబానీ వంటి దివాలాకోరు వ్యాపారవేత్తకు వేల కోట్ల రుణాలు ఎలా ఇచ్చాయన్నది సమాధానం రాని.. సమాధానం లేని భేతాళ ప్రశ్న. ఎడిఎజి గ్రూపు, దాని అను బంధ సంస్థల నకిలీ ఆర్థిక నివేదికలను ఎందుకు పరిశీలించలేదన్నది చిదంబర రహస్యం. ఈ భారీ ఆర్థిక కుంభకోణంపై వివరణాత్మక ఫోరెన్సిక్ ఆడిట్లు ఉన్నప్పటికీ బ్యాంకు అధికారులు... ఆడిటర్లు పట్టించుకోకపోవటం వైనం అనుమానాలను తావిస్తున్నది. ఇంత జరుగుతున్నా... అనిల్ అంబానీ బృందం కోట్లకు కోట్లు మింగేస్తున్నా.. సిబిఐ, ఇడి సరైన దర్యాప్తు చేయకపోవడం వ్యూహాత్మక మౌన కోణాన్ని తెరపైకి తెస్తున్నది. రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్), రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిలయన్స్ టెలికాం తదితర కంపెనీలు 2013–2017మధ్యకాలంలో రూ.31,580కోట్ల రుణాలు తీసుకున్నాయి. తిరిగి చెల్లించకపోవడం షరామామూలు. ఇప్పుడు కేసు కోర్టుకు చేరడంతో, గతంలో ఎన్నో మోసకారి కార్పొరేట్ సంస్థలు అనుసరించిన వ్యూహమే మరోసారి అమలయ్యే ప్రమాదం లేకపోలేదు. అంటే... అనిల్ అంబానీ కంపెనీలకు రుణాలిచ్చిన కంపెనీలన్నీ ఇప్పటికే ఒక కన్సార్టియంగా ఏర్పడ్డాయి. ఆ బ్యాంకుల అధికారులు సమావేశమవుతూనూ.. సంవత్సరాల తరబడి చర్చిస్తూ.. సాధ్యమైనంత వరకూ సమస్యను పక్కదారి పట్టిస్తారు. చివరికి తీసుకున్న మొత్తంలో పదోవంతో ఇచ్చి సెటిల్ చేసుకోవాలని సూచిస్తారు. ఆ వెంటనే, వేల కోట్ల రూపాయల రాని బాకీల ఖాతాల్ని కేంద్ర ప్రభుత్వం భుజాన వేసుకుంటుంది. లక్షల కోట్ల రూపాయల రుణాలు రద్దు చేస్తుంది. ఒత్తిళ్లకు లొంగి లేదా అధికారానికి భయపడి లేదా లంచాలకు ఆశపడి మరిని రుణాలు ఇచ్చేసే బ్యాంకులు... తీసుకొని, తిరిగి చెల్లించకుండా ముఖం చాటేస్తున్నవి కార్పొరేట్ కంపెనీలే. విలాస విదేశాలకు పారిపోయి దాక్కుంటున్నది ఆ కంపెనీల యజమానులు. నిరర్థక ఆస్తుల కింద ప్రకటిస్తూ, కోట్లకు కోట్ల రూపాయల రుణాలు రద్దు చేస్తున్నది కేంద్ర ప్రభుత్వం. ఆ భారం మోస్తున్నది మాత్రం దేశ ప్రజలు. ఇదెక్కడి న్యాయం? ప్రజల సొమ్ముతో వ్యాపారం చేస్తూ, అదే ప్రజలను నట్టేట ముంచుతున్న కార్పొరేట్ 'తెల్ల ఏనుగు'లను కేంద్రం ఎందుకు మేపుతున్నట్లు? ఇప్పటికైనా, 'కార్పొరేట్ ఆర్థిక దోపిడీ'కి తెరదించే ప్రయత్నం తప్పక జరగాలి. కట్టుదిట్టమైన చట్టాలు రావాలి. కార్పొరేట్ రుణమాఫీలు కాదు.. మోసం చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టి శిక్షించే వ్యవస్థ రూపుదిద్దుకోవాలి. ఇప్పటికే గత పదేళ్ల కాలంలో ధనిక, పేద వర్గాల మధ్య వ్యత్యాసం విపరీతంగా పెరిగింది. కార్పొరేట్ శక్తుల దోపిడీకి సుప్రీం కోర్టు ఇవ్వబోయే తీర్పు తెరదించుతుందో, లేదో చూదాం!

# నేలవిడిచి సాముచేస్తున్న కొత్త కార్మిక విధానం

హుస్సేన్ ఇండోర్‌వాలా, మధులిక
టి.గాయత్రీసింగ్, అఖిల్ సూర్య

కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ 'శ్రమశక్తి నీతి – 2025' పేరుతో ఇటీవల కార్మిక విధానం ముసాయిదా విడుదల చేసింది. అది చాలా గందరగోళంగా ఉంది. ఈ విధానం భారత రాజ్యాంగం నుండి, అందులో హామీయిచ్చిన హక్కులు, రక్షణల నుండి న్యాయబద్ధతను, నైతిక అథారిటీ పొందుతుందని ఒక సెక్షన్ చెప్పింది. తదుపరి సెక్షన్‌లో అది శ్రమపట్ల 'ఇండిక్ ప్రపంచ దృక్పథాన్ని' ప్రత్యేకించి చెప్పింది – శ్రమ అనేది "సామాజిక సామరస్యం, ఆర్థిక సంక్షేమం, సమష్టి సౌభాగ్యం" మనుగడను కొనసాగించే "ఒక పవిత్రమైన, నైతిక విధి" అని చెప్పింది.

శ్రమశక్తి నీతి – 2025 శ్రమ ప్రపంచాన్ని రాజ్యం, పరిశ్రమ, కార్మికుల మధ్య నైతిక బంధంగా తలపోసినట్లు, అది ధర్మం (విధి), న్యాయం, సామాజిక సామరస్యంలో వేళ్లూని ఉందని, శ్రమ పట్ల గౌరవం జీవితం పట్ల గౌరవం నుంచి విడదీయలేనిదన్న భారతదేశ నాగరికత విశ్వాసాన్ని అది పునరుద్ఘాటిస్తున్నదని ఆ పత్రం వివరించింది. "మనుస్మృతి, యాజ్ఞవల్క్య స్మృతి, నారద స్మృతి, శుక్రనీతి, అర్థశాస్త్రం వంటి ప్రాచీన గ్రంథాలు రాజధర్మ భావన ద్వారా అభివ్యక్తీకరించిన ఈ నీతిసూత్రాలు న్యాయం, సబబైన వేతనాలు, దోపిడీ నుంచి కార్మికులకు రక్షణ చేకూర్చటం అనే రాజ్యవిధిని వక్కాణిస్తున్నాయని పేర్కొన్నది. శ్రమ నిర్వహణకు నైతిక ప్రాతిపదికతో కూడిన ఈ ఆదికాలపు సూత్రీకరణలు ఆధునిక కార్మిక చట్టం రావటానికి శతాబ్దాల మునుపే భారతీయ నాగరికతలో ఉన్నట్లు ప్రస్తావించింది.



దురదృష్టవశాత్తు, ఈ రెండు ప్రాపంచిక దృక్పథాలు – పునర్నిర్మాణం చేసిన "ప్రాచీన ఆదర్శాలు", "ఆధునిక కార్మిక చట్టం" ఒక దానితో మరొకటి పొసగనివి. ఎందుకంటే, ఒకటి శ్రమ ప్రతిపత్తిని సాంప్రదాయం, ప్రాచీన గ్రంథాల ద్వారా నిర్ణయించింది. రెండవది, పోరాటం ద్వారా బేరసారాల ద్వారా నిర్ణయమవుతుంది. ఒకదానికి కార్మికుడు సమాజ సేవకుడు, రెండో దానిలో తాను సృష్టించే సంపదలో భాగానికి అర్హుడు. ఒకదానిలో అధికార సంబంధాలు సామాజిక దొంతర్లతో కూడినవి, దైవనిర్ణయం కూడా, రెండో దానిలో అవి పోటీపడటానికి, బదిలీకి అర్హమైనవి. ఒకదానిలో సామాజిక సామరస్యం పేరుతో కార్మికుని గొంతు అణచివేయబడుతుంది. రెండో దానిలో అది ప్రజాస్వామ్యానికి, న్యాయానికీ కేంద్ర బిందువుగా గుర్తించబడుతున్నది.

పనిచేయటం విధి అనే దృక్పథాన్ని తిరస్కరించిన ప్రాతిపదికపై ఆధునిక కార్మికచట్టం రూపొందిందన్న వాస్తవాన్ని గుర్తించటాన్ని శ్రమశక్తి నీతి తిరస్కరిస్తున్నది. రాజ్యాంగ సూత్రాలను, అంతర్జాతీయ హామీలను, కార్మికుల జీవన వాస్తవికతను పక్కనపెట్టేదిగా భారతదేశ కార్మిక విధానాన్ని తిరగరాసే ప్రయత్నం జరిగింది. పనిని "పవిత్రమైన, నైతిక విధి"గా వర్ణించటం ద్వారా ఈ విధానం మతం, ప్రాచీన మతగ్రంథాల భావనలను (శ్రమలో కులాన్ని, లింగ ప్రాతిపదిక నిమ్నోన్నత విభజన) ప్రవేశపెట్టటానికి ప్రయత్నిస్తున్నది. దారుణమైన దోపిడీని మరుగుపరచటానికి, సమర్థించటానికీ, శ్రమజీవుల జీవన పరిస్థితులను క్షీణింపజేయటానికి ప్రయత్నిస్తున్నది.

మన పూర్వీకుల "కాలాతీత విలువలను" ఇటీవల లేబర్ కోడ్‌లతో, ముఖ్యంగా కోడ్ ఆన్ వేజెస్, 2019, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్, 2020లతో సమాధానపరచటానికి ఈ విధానం ఉద్దేశించబడింది. "డిజిటలైజేషన్, గ్రీన్ పరివర్తనలతో, గిగ్, ప్లాట్‌ఫాం వర్క్ వంటి కొత్త ఉపాధి రూపాలతో" భారత లేబర్ మార్కెట్‌లో వచ్చిన "నిర్మాణాత్మక మలుపులను" దృష్టిలోకి తీసుకుని "సామాజిక భద్రత, నిపుణత, వృత్తి సంబంధమైన భద్రత, టెక్నాలజీ నడుపుతున్న యాజమాన్య నిర్వహణ"కు ఒక ఏకరూప చట్రాన్ని ఏర్పాటు చేయటం ఈ విధానం ఉద్దేశ్యం అని ఆ డాక్యుమెంట్ చెప్పుకుంది.

ఈ నమూనాలో, కార్మిక–ఉపాధి మంత్రిత్వశాఖ "విశ్వసనీయమైన, కృత్రిమ మేథతో నడిచే వ్యవస్థల ద్వారా కార్మికులు, యజమానులు, శిక్షణా సంస్థల మేళవింపు ద్వారా ఎంప్లాయిమెంట్‌కు దోహదకారి అవుతుంది. ఉపాధి కల్పనకు భారతదేశ డిజిటల్ ప్రభుత్వ మౌలిక వసతులుగా జాతీయ కెరీర్ సర్వీసు (ఎన్‌సిఎస్) నెలకొల్పబడుతుంది. సమ్మిళిత ఉపాధులను సరిపోల్చటం, అర్హతల తనిఖీ, నైపుణ్య ఏకీకరణకు ఇది టెక్నాలాజికల్ వెన్నెముకగా పనిచేస్తుంది.

ఈ విధానం ఏడు "అంతర్ సంబంధం కలిగిన వ్యూహాత్మక ధ్యేయాలను" తన మిషన్ ప్రాధాన్యాలుగా వక్కాణించింది. అవి (1) సార్వజనీన సామాజిక భద్రత, (2)వృత్తి సంబంధ భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులు (3) ఉపాధి–భవిష్యత్, (4) మహిళా, యువత సాధికారత, (5) సంధానం సులభతరం, అధీకృత పాలనమొనర్చటం, (6) టెక్నాలాజికల్ అండ్ గ్రీన్ పరివర్తనం, (7) మమేకత, సుపరిపాలన. ఒక్కొక్కదాన్ని సూక్ష్మంగా తెలుసుకుందాం.

(1) సార్వజనీన సామాజిక భద్రత : సామాజిక భద్రత అంటే ఏమిటో అది వివరించలేదు. దాన్ని అందరికీ వర్తింపజేసే మార్గాలను పేర్కొనలేదు. తన పరిధినుంచి పెద్ద సంఖ్యలో ఉన్న అనియత కార్మికులను మినహాయించిన సోషల్ సెక్యూరిటీ కోడ్, 2020పై అది ఆధారపడింది. ఎస్ఎస్‌కోడ్ అమలుకు ఒక సంస్థలో కార్మికుల కనీస సంఖ్యను ఆ కోడ్ నిర్ణయించింది. అసంఘటిత కార్మికులకు పథకాలను ప్రకటించే అధికారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చింది.

(2) వృత్తి సంబంధ భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులు : పని ప్రదేశంలో భద్రత, ఆరోగ్యం ఎలా మెరుగుపరుస్తారో శ్రమశక్తి విధానం వివరించలేదు. అది ఒఎస్‌హెచ్ కోడ్‌పై ఆధారపడింది. ఆ కోడ్ నిర్దిష్టరంగాలకు వర్తింపజేసే సవివరమైన భద్రత చర్యలతో కూడిన ఆయా రంగాలవారీ చట్టాలన్నిటినీ రద్దు చేసింది. అదే సమయంలో కార్మికులందరికీ వర్తించే ఆరోగ్యం, భద్రత చర్యలను చేర్చటంలో విఫలమైంది. ఐఎల్‌ఒ తన 'ప్రాథమిక సూత్రాలు , పని ప్రదేశంలో హక్కులు' డిక్లరేషన్‌లో ఆరోగ్యం, భద్రతను కార్మికుల ప్రాథమిక హక్కుగా ప్రకటించినందున ఒఎస్‌హెచ్ కోడ్ వాటిని దాటవేయటం మహాదారుణం.

(3) ఉపాధి–భవిష్యత్ : భారతదేశంలో గౌరవప్రదమైన పనికి రెండు ప్రమాదాలు ఏర్పడ్డాయి. ఒకటి, నిరుద్యోగం, రెండు, పర్మినెంట్ లేదా రెగ్యులర్ ఉపాధి స్థానంలోకి క్యాజువల్, కాంట్రాక్ట్, నిర్దిష్టమైన కాలం ఉపాధి, గిగ్ వర్క్ ప్రవేశం. భారతదేశంలోని శ్రామికశక్తికి, ముఖ్యంగా యువతకు, భావి తరాలకు అర్థవంతమైన, భద్రతతో కూడిన ఉపాధి కల్పనకు ఎటువంటి ఆచరణాత్మక కార్యాచరణను ఈ విధానం చూపలేదు.

(4) మహిళా, యువత సాధికారతఃఉపాధిలో మహిళలు వివక్షకు గురవుతున్నారు. వేతనాల్లో చిన్న చూపేగాక వారికి 'సంరక్షణ' వంటి అల్పమైన పనులు కల్పిస్తున్నారు. భారతదేశంలో అనియత రంగంలో పురుషులకన్నా మహిళలు ఎక్కువ. నియత రంగంలో కూడా మహిళలు అప్రధానంగా ఉంటున్నారు. వేతనాల్లో వ్యత్యాసం నిషేధం అయినప్పటికీ, మధ్యతరహా నైపుణ్య ఉద్యోగాల్లో పురుషులు ఉద్యోగినులకన్నా 21 శాతం ఎక్కువ వేతనం పొందుతున్నారు. ఈ స్థితిని ఎలా మెరుగుపరుస్తారో, సాంప్రదాయకంగా "మహిళలను తీసుకోని" ఉద్యోగ రంగాల్లో గౌరవప్రదమైన, మంచి వేతనంతో కూడిన, నిపుణ ఉద్యోగాలు ఎలా కల్పిస్తారో వివరించలేదు.

(5) సంధానం సులభతరం, అధీకృత పాలనమొనర్చటం, ః బిగ్–టెక్, ఎఐ రంగం యజమానులకు ఎర్ర తివాచీ పరచటం ఈ విధానం ఉద్దేశ్యంగా కనబడుతున్నది. ఇక్కడ రెగ్యులేటరీ బాధ్యతలు అతికనీసంగా ఉంటాయి. యజమానులకు సులభంగా వ్యాపారం చేసుకోవటాన్ని అనుమతిస్తూ కార్మికులకు ఆరోగ్యం, భద్రత ప్రమాణాలను అందించటం సాధ్యం కాదు.

(6) టెక్నాలాజికల్ అండ్ గ్రీన్ పరివర్తనః అత్యంత బలహీనమైన రంగాలకు డిజిటల్ సంబంధం పెంపుచేయకుండా లేబర్ పని పద్ధతులను డిజిటలైజ్ చేయటం వల్ల అనియత కార్మికులు మెజారిటీ పనులు కోల్పోతారు. డిజిటల్ హాజరు, మానిటరింగ్ ఏర్పాట్ల వల్ల పెద్దసంఖ్యలో వేతనాలు అందని, రిజిస్ట్రేషన్‌కు నోచుకోని నౌరేగా శ్రామికులు ఇందుకు ఉదాహరణ.

(7) మమేకత, సుపరిపాలనః టెక్నాలజీతో ప్రతి కార్మికుణ్ణీ డిజిటల్ వర్కర్‌గా తయారు చేటయం ఈ విధాన ధ్యేయం. ధ్యేయం గొప్పదైనప్పటికీ భారతదేశంలో ఉన్న డిజిటల్ విభజన కారణంగా నెరవేరటం కష్టం. ఉదాహరణకు, మన దేశంలో 15 ఏళ్లు పైబడిన మహిళల్లో 50 శాతానికే మొబైల్ ఫోన్‌లున్నాయి, డిజిటల్ పరిజ్ఞానం కూడా బహు తక్కువ.

నూతన కార్మిక విధానం "సమ్మిళితం", "న్యాయమైన పని పరిస్థితులు", "సంబంధీకుల మధ్య సామరస్యం", "వ్యాపారం సులభతరం", "శిక్షణ, నైపుణ్యం" వంటి పడికట్టు పదాలు, నినాదాలతో కూడి ఉంది. ఒక పద్ధతి ప్రకారం దాటవేయబడిన రాజ్యాంగ హామీలు, అంతర్జాతీయ హామీలకు ఇవి చౌకబారు ప్రత్యామ్నాయాలు. కార్మిక విధానం అనేది కార్మిక యూనియన్‌లతో, గ్రూపులతో, పౌర సమాజంతో సంప్రదించి రూపొందించాలి. అమలు చేయగలిగిన చర్యలను వాగ్దానం చేయాలి. శ్రమశక్తి నీతి అటువంటి విధానం కాదు.

*('లీఫ్‌లెట్' సౌజన్యంతో)*

# ప్రతి గింజ వెనుక కోటి కుటుంబాల చెమట!

ధనవంతుడు తినే ప్రతి అన్నపు ముద్దలో కనిపించేది బియ్యం సువాసనే కావొచ్చు కానీ, ఆ గింజ గింజలో దాగి ఉన్న అసలు సువాసన రైతు చెమట చుక్క. ఈ ఒక్క వాక్యంతోనే భారత ఆర్థిక నిర్మాణం ఆహార భద్రత వ్యవసాయ ఆధారిత జీవన విధానం అంతా రైతు భుజాలపై ఎంత భారంగా ఉందో అర్థమవుతుంది. భారతదేశంలో నిజంగా ఎంతమంది రైతులు ఉన్నారు అన్న ప్రశ్నకు ఒక్క సరైన సంఖ్య చెప్పడం సులువు కాదు ఎందుకంటే రైతు అనే నిర్వచనమే విభిన్న కోణాల్లో మారిపోతుంది. ప్రభుత్వం దగ్గర ఉన్న గణాంకాల్లో మూడు ప్రధాన ప్రమాణాలు కనిపిస్తాయి: పొలం చేసేవారు వ్యవసాయ కూలీలు వ్యవసాయంపై ఆధారపడే కుటుంబాలు సాగు హక్కు ఉన్న కమతాలు.



2011 జనగణనలో సాగు భూమి పై పంటలు పండించే కల్టివేటర్లు ఇతరుల భూమిపై కూలీ పనిచేసే వ్యవసాయ కార్మికులు కలిపి దేశం లో 26.31 కోట్లు. వీరిలో 11.88 కోట్లు కల్టివేటర్లు 14.43కోట్లు కూలీలు. ఆ సమయంలో మొత్తం వర్క్‌ఫోర్స్‌లో 54.6 శాతం అంటే ప్రతి పది మంది పనిచేసేవారిలో అయిదుగురికి జీవనాధారం వ్యవసాయం.

ఇక తాజా పని జనాభా సర్వేల ప్రకారం వ్యవసాయంలో పనిచేసేవారి శాతం తగ్గినా మొత్తం సంఖ్య మాత్రం ఇంకా పెద్దగానే ఉంది. పిఎల్‌ఎఫ్ఎస్ 2020–21లో వ్యవసాయ రంగ వర్కర్లు 46.5 శాతం, 2021–22లో 45.5 శాతం, 2022–23లో 45.8 శాతం. భారత జనాభా 146 కోట్లకు పెరిగిన నేపథ్యంలో పని వయస్సు గలవారు దాదాపు రెండు మూడవ వంతు. వీరిలో 45 శాతం వ్యవసాయ రంగంలో పనిచేస్తున్నారు అనుకున్నా సుమారుగా 25నుంచి 27 కోట్ల మధ్య రైతులు వ్యవసాయ కూలీలు నేరుగా వ్యవసాయంతో ముడిపడి ఉన్నారని అంచనా.

నాబార్డ్ సర్వే ప్రకారం 2016–17లో గ్రామీణ గృహాల్లో 48 శాతం వ్యవసాయ కుటుంబాలు కాగా 2021–22లో ఇది 56.7శాతానికి పెరిగింది. అంటే గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు ప్రతి రెండింటిలో ఒకింటికంటే ఎక్కువ ఇంటి జీవనాధారం వ్యవసాయమే అని స్పష్టమవుతుంది. అగ్రికల్చర్ సెన్సస్ 2015–16 ప్రకారం దేశం లో 14.6 కోట్లు కమతాల్లో వ్యవసాయం జరుపుతున్నది. వీటిలో 86.21శాతం చిన్నతరహా, సన్నతర హా హోల్డింగ్‌లు భూమిలో 47.34 శాతం వారి చేతు ల్లోనే ఉంది. సంఖ్యాపరంగా చూసినా పది మందిలో తొమ్మిది మంది చిన్న రైతులే సాగు భూమి మాత్రం సగానికి తగ్గిపోయే స్థాయిలో.

ఇప్పటి జనాభా లెక్కలతో చూసుకుంటే దేశ మొత్తం జనాభాలో నేరుగా పొలంలో కష్టపడే రైతుల శాతం 18 నుంచి 20 శాతం మధ్యలోనే ఉంటుంది. కానీ వ్యవసాయంపై ఆధారపడే కుటుంబ సభ్యులను కలుపుకుంటే దేశ జనాభాలో దాదాపు సగానికి పైగా ఏదో రూపంలో రైతు కుటుంబానికే చెందుతుంది. అందుకే మొదటి వాక్యంలో చెప్పిన అన్నపు ముద్ద వెనకాల రైతు చెమట సువాసన మాత్రమే కాదు రైతు బాధ అసమానతల దుర్వాసన కూడా దాగి ఉంటుంది. దేశానికి అన్నం పెట్టే 25–27 కోట్ల రైతు కుటుంబాలకు ఉన్న భూమి చిన్న చిన్న ముక్కలుగా విభజించబడడంతో పెట్టుబడి సామర్థ్యం తగ్గుతోంది. నీటి వనరులపై ఆధారపడుతున్న పరిస్థితి పెరుగుతోంది. మార్కెట్ ఉత్కంఠల ప్రభావం నేరుగా వారి జీవితం మీద పడుతోంది.

అంతిమంగా భారతదేశంలో ఎంతమంది రైతులు ఉన్నారు అన్న ప్రశ్నకు గణాంకాల ఆధారంగా చెప్పాల్సి వస్తే ఇలా: 2011 జనగణన ప్రకారం 26.31 కోట్లు వ్యవసాయ కార్మికులు. మొత్తం వర్క్‌ఫోర్స్‌లో 54.6శాతం. తాజా పిఎల్ ఎఫ్ఎస్ ప్రకారం ఇప్పటికీ వర్క్‌ఫోర్స్‌లో 46 శాతం వ్యవసాయం అనుబంధ రం గాల్లోనే పని. అగ్రికల్చర్ సెన్సస్ ప్రకారం 14.6 కోట్లు రైతు హోల్డింగ్‌లు వాటిలో 86 శాతం చిన్న సన్న రైతుల చేతుల్లో. గ్రామీణ ఇండ్లలో 56.7 శాతం వ్యవసాయ కుటుంబాలు. ఈ అన్ని సంఖ్యలు కలిపి చూసినా భారతదేశంలోని ప్రతి అన్నపు గింజ వెనక కోట్లాది రైతుల చెమట చరిత్ర జీవనగాథ స్పష్టంగా కనిపిస్తుంది. భారతదేశం ఆహార భద్రత రైతుపై నిలిచి ఉంది. దేశంలో 14.6 కోట్లు రైతు హోల్డింగ్‌లు ఉన్నాయి. వీటిలో 86 శాతం చిన్నసన్న రైతులవి చిన్న భూములు పెట్టుబడి అవకాశాలను తగ్గిస్తున్నాయి. రైతు సమస్యలు సంఖ్యల్లో ఎంత స్పష్టంగా కనిపిస్తున్నాయో జీవితాల్లో అంతకన్నా గాఢంగా కనిపిస్తున్నాయి. ధనవంతుడి ప్లేట్‌లో ఉన్న అన్నం వెనక రైతు చెమట చరిత్ర నిలిచిఉంది. ఇదే భారత సామాజిక ఆర్థిక వాస్తవం.

డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# ప్రభుత్వరంగ సంస్థల క్షీణత.. ప్రభుత్వ నిర్లక్ష్యం కాదా?

భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు ఒక సంక్రమణ దశలో ఉంది. దేశ అభివృద్ధి కి పునాది వేసిన ప్రభుత్వరంగ సంస్థలు నేడు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నా యి. ఈ పరిస్థితి యాదృచ్ఛికం కాదు; గత దశాబ్దంలో అమలైన కొన్ని తొందరపాటు నిర్ణయాలు, ఆలోచనలేని సంస్కరణలు, మరియు జాతీయ ఆస్తుల పరిరక్షణలో ప్రభుత్వ వైఫల్యమే దీనికి కారణం. ఒక దశాబ్దపు ఆర్థిక పొరపాట్లు ఒకసారి పరిశీలిస్తే భయమేస్తుంది. 2016 నవంబర్ 8 రాత్రి జరిగిన నోట్లరద్దు నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థను పెద్ద దెబ్బతీసింది. డాక్టర్ మన్మోహన్ సింగ్ హెచ్చరించినట్టు జిడిపిలో 2% పడిపోవడం ఒక్కటే కాదు, దేశపు అనధికారిక రంగం పూర్తిగా కుదేలైంది. లక్షలాది చిన్న, మధ్య తరహా వ్యాపారాలు మూతబడ్డాయి. ఆ దెబ్బ నుంచి కోలుకునే లోపే, ప్రభుత్వం తయారీ సరిగా లేని జిఎస్‌టి ను అమలు చేసింది.

పలుస్థాయిల పన్నులు, క్లిష్టమైన రిటర్నులు, చిన్న వ్యాపారులకు తీవ్రమైన భారమయ్యాయి. ఈ రెండు నిర్ణయాలు కలిసి ఆర్థిక వ్యవస్థను దీర్ఘకాలిక మాంద్యంలోకి నెట్టాయి. ప్రజలపై భారమయ్యే పన్నులు కార్పొరేట్లకు పెద్దలాభాలు తెచ్చిపెట్టాయి. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు తగ్గిన సందర్భంలో, సాధారణంగా ప్రభుత్వాలు ప్రజలకు ఆ ప్రయోజనాలు అందిస్తాయి. కానీ ఇక్కడ ధరలు తగ్గినా, పన్నులు మాత్రం పెరిగాయి. కుటుంబ ఖర్చు పెరిగాయి. అదే సమయానికి, 2019లో ప్రభుత్వం కార్పొరేట్లకు భారీ పన్ను రాయితీ ఇచ్చింది. దేశ ఖజానాకు ₹1.45 లక్షల కోట్ల నష్టం జరిగినా, పెట్టుబడులు పెరగలేదు. ప్రజారంగ సంస్థల 'ఫైర్ సేల్'. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం చేపట్టిన మార్గం, అతివేగంగా ప్రైవేటీకరణ. ఇది సంప్రదాయ 'డిస్‌ఇన్వెస్ట్మెంట్' కాదు. ఇది జాతీయ ఆస్తుల 'అమ్మకం' అది కూడా తొందరపాటు, అత్యవసర సమయా ల్లో చేసే ఫైర్ సేల్ విధానంలో. ప్రభుత్వ వాదన ఏంటంటే ప్రైవేటీకరణ వల్ల సామర్థ్యం పెరుగుతుంది, సంక్షేమ పథకాలకు నిధులు లభిస్తాయి. కానీ నిజంగా జరుగుతోందేమిటంటే లాభాలు ప్రైవేట్ రంగానికి, నష్టాలు ప్రజల భుజాలపై. అవమానకరమైన చరిత్ర పాఠాలు తెలుసుకున్నా ప్రభుత్వ తీరు మారలేదు. గత ఎన్డీయే ప్రభుత్వకాలంలో విఎస్ఎన్ఎల్ విక్రయం తక్కువ విలువలో జరిగినట్లు అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. నేడు కూడా ఎల్ఐసి, ఐడిబిఐ, ఒఎన్‌జిసి, హెచ్‌పిసిఎల్ వంటి లావాదేవీలు నిజమైన డిస్‌ఇన్వెస్ట్మెంట్ కావు; అవి ప్రభుత్వం ఒక జేబులోంచి మరొక జేబులో డబ్బు మార్చినట్టు. దీర్ఘకాల ప్రమాదాలు గురించి ప్రభుత్వం దగ్గర సమాధానాలు లేవు. బ్యాంకింగ్ స్థిరత్వం: ప్రభుత్వ బ్యాంకులు 2008 గ్లోబల్ సంక్షోభాన్ని భారత్‌ను ఎలా రక్షించాయో దేశం మరిచిపోలేదు. ఇప్పుడు ఇవే ప్రైవేటీకరణ గురిపెట్టబడుతున్నాయి. ఎల్ఐసి భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంది. ఎల్ఐసి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రధాన ఆర్థిక ఆధారం. దానిని ప్రైవేట్ హస్తాల్లోకి ఇవ్వడం అంటే దీర్ఘకాల పెట్టుబడుల భవిష్యత్తును ప్రమాదంలో పెట్టినట్టే. సామాజిక న్యాయం పూర్తిగా తుడిచి పెట్టినట్టే. దళితులు, ఆదివాసీలు, ఒబిసిలకు ఉన్న రిజర్వేషన్లు ప్రభుత్వ వాటా 50% కంటే తక్కువైతే సహజంగానే రద్దవుతాయి. ప్రాంతీయ అభివృద్ధి కుంటుపడింది. లాభం రాకపోతే గ్రామీణ బ్యాంకు శాఖలను ప్రైవేట్ సంస్థలు కొనసాగిస్తాయా? అనుమానమే. ఇప్పటికే నిరుద్యోగం అత్యధిక స్థాయిలో ఉండగా, ప్రజారంగ ఉద్యోగాలకు ముప్పువస్తే దాని ప్రభావం ఘోరంగా ఉంటుంది. ఎక్కడ స్పష్టత లేదు. ఆస్తులకు విలువ ఎలా నిర్ణయించారు? రిజర్వ్ ప్రైస్ ఎలా లెక్కించా రు? బిడ్డర్లను ఎలా ఎంచుకున్నారు? ప్రభుత్వం ఈ ప్రశ్నలకు సమాధానమివ్వకుండా ముందుకు సాగుతుండటం అనుమానాలు మరింత పెంచుతుంది.

ముఖ్యంగా ఎలక్షన్ బాండ్స్ వివాదం వెలుగులోకి వచ్చిన తర్వాత. నిదానమైన, సంస్థ నిర్దిష్ట వ్యూహం అవసరం. అన్ని ప్రభుత్వరంగ సంస్థలు ఒకేలా ఉండవు. కొన్ని లాభాల్లోనే ఉన్నాయి. కొన్ని పునర్వ్యవస్థీకరణ చేస్తే లాభదాయకమవుతాయి.కొన్ని మాత్రమే అమ్మకానికి అనర్హం. ప్రతి సంస్థకు విడిగా వ్యూహం అవసరం. దీర్ఘకాలిక దృష్టి అవసరం. జాతీయ ఆస్తులు కాపాడే బాధ్యత అవసరం. ప్రభుత్వం తరచూ చెప్పేది 'వాణిజ్యం చేయడం ప్రభుత్వం చేయాల్సిన పని కాదు'. అయితే సత్యం ఏమిటంటే, దేశ ఆర్థిక వ్యవస్థను సరిగా నడపలేని ప్రభుత్వం, ఉద్యోగాలు సృష్టించలేని ప్రభుత్వం, సామాజిక న్యాయాన్ని కాపాడలేని ప్రభుత్వం జాతీయ ఆస్తులు అమ్మే హక్కు లేదు. భారత ప్రజారంగం దేశ స్వావలంబనకు, సామాజిక సమానతకు, మౌలిక అభివృద్ధికి పునాది. దానిని తొందరపాటు నిర్ణయాలతో అడ్డగోలుగా విక్రయించడం భవిష్యత్తు తరాల పట్ల ఘోర అన్యాయం.

డా. ముచ్చుకోట సురేష్ బాబు

# బాలల హక్కుల హననం

జాతికి నిజమైన సంపద బాలలే. వారిపై ఖర్చు పెట్టుబడిగా భావించాలి. బాలల అభివృద్ధి వారికి లభించే నాణ్యమైన ఆహారం, ఆరోగ్యం, విద్య, వినోదం, కుటుంబ జీవనంపై ఆధారపడి ఉంటుంది. అప్పుడే ఉత్తమ పౌర సమాజం నిర్మితమవుతుంది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 1959, నవంబర్ 20 న బాలల హక్కుల ప్రకటనను ఆమోదించినది. ఈ తేదీన ప్రతి సంవత్సరం ప్రపంచ బాలల దినోత్సవం నిర్వహిస్తుంటారు. ప్రపంచ పిల్లల దినోత్స వం ద్వారా ప్రతి బిడ్డకు సురక్షితమైన, సహాయక వాతావరణాన్ని కల్పించడం, బాలల హక్కుల పరిరక్షణ, విద్య , సమానత్వానికి సంబంధించిన అవగాహన పెంచడం ముఖ్య లక్ష్యాలు. పిల్లల సంక్షేమం, హక్కుల దుర్వినియోగం నుంచి రక్షణ వంటి అంశాలను ప్రపంచ వేదికలలో చర్చించడం జరుగుతుంది.

అభివృద్ధిలో ప్రపంచ దేశాలు దూసుకు వెళుతున్నప్పటికీ... బాలల విద్య, ఆరోగ్యం, భద్రత హక్కులు వంటి అంశాల్లో ఇంకా వివక్షత కొనసాగుతుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 6.2కోట్లకు పైగా బాలికలు ఇంకా విద్యకు దూరంగానే ఉన్నారు. 15–19 సం.ల వయస్సు గల బాలికలు, అబ్బాయిల కంటే రెండు రెట్లు ఎక్కువ విద్యా లేదా ఉద్యోగ అవకాశాలకు దూరంగా ఉన్నారు. నలుగురు బాలికల్లో ఒక్కరికి 18 ఏళ్ళు వచ్చేలోపు పెళ్లి జరుగుతోంది. భారతదేశంలో పితృస్వామ్య భావజాలంతో లింగపరమైన వివక్షత కనబడుతుంది. బాలికలను ఆరోగ్య సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (NFHS)5 ప్రకారం, 15–49 సంవత్సరాల వయస్సు గల స్త్రీలలో 57 శాతం రక్తహీనతతో బాధపడుతున్నారు. దాదాపు 5గురు స్త్రీలలో ఒకరు తక్కువ బరువుతో ఉన్నారు. భారతదేశంలో ప్రతి ఏటా నవంబర్ 14 జాతీయ బాలల దినోత్సవం జరుపుకుంటారు. బాలల అభివృద్ధికి మూలం విద్య. వాస్తవంగా భారతదేశంలో మొట్టమొదట విద్యాభివృద్ధికి కృషి చేసిన ఆదిదంపతులు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేలు. వారి కృషివల్లనే నేడు బడుగు బలహీన వర్గాల పిల్ల లు చదువుకునే అవకాశం లభించింది. ఆ చదువు ను భారత రాజ్యాంగం ద్వారా డాక్టర్ బాబాసాహెబ్ చట్టబద్ధం చేశారు. భారత రాజ్యాంగం, చట్టాల ద్వారా బాలలకు ప్రత్యేక రక్షణలు కల్పించారు. ఉన్నత వర్గాల బాలలతో పోలిస్తే...అట్టడు గు వర్గాల బాలల ఎదుగుదల నేటికి సవాల్‌గానే నిలిచింది. బాలల విద్యకోసం విద్య హక్కు చట్టా న్ని తీసుకొచ్చారు. అయినా సంపన్న, పేద విద్యార్థుల మధ్య విద్య అంతరం కూడా పెరుగుతుంది. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 92శాతం బిసి ఎస్సీ ఎస్టీ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదవగా... సంపన్న శ్రేణి నుంచి కేవలం 8 శాతం మాత్రమే ప్రభుత్వ బడుల్లో చదువుతున్నారు. ప్రపంచ ఆకలి సూచిక–2024 ప్రకారం ఇప్పటికి మన దేశంలో 13.7 శాతం పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. మరోవైపు 5ఏళ్ళలోపు పిల్లలు 35.5 శాతం మంది వయస్సుకు తగ్గ ఎత్తు లేకపోగా ....18.7శాతం ఎత్తుకు తగిన బరువు లేరు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 5 ప్రకారం ఇప్పటికీ భారతదేశంలో 23శాతం బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తేలింది. పచ్చిబెంగాల్, బీహార్ రాష్ట్రాలలో 41 శాతం బాల్య వివాహాలు జరగడం ఆందోళనకరం. బాల్యదశలో ఎదుర్కొని అనేక సామాజిక రుగ్మతలకు అట్టడుగు వర్గాల పిల్లలే బాధితులవుతున్నారని క్షేత్రస్థాయి అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఇది ఆందోళన కలిగించే అంశం.




భారతదేశ జనాభాలో 37 శాతం బాలలున్నా రు. పిల్లలను పేదరికం నుండి విముక్తి చేయడానికి కుటుంబ సామాజిక భద్రత కార్యక్రమాలపై దృష్టి పెట్టాలి. ఆడపిల్లల అభివృద్ధికి సుకన్య సమృద్ధి, మిషన్ వాత్సల్య వంటి ఆర్థిక సాధికారక కార్యక్రమాలు అమలుచేయాలి. పిల్లల్లో ఒత్తిడి, భయం, అభద్రత తదితర ప్రతికూల ప్రభావాలు తొలగించడానికి ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించడానికి మంచి నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలి. బాలల అభివృద్ధి శిశుదశలోనే మొదలవ్వాలి. ఇందుకోసం ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలను బలోపేతం చేయాలి. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం సమీకృత గురుకులాలు, మండలానికొక ఇంటర్నేషనల్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నది. వీటిలో మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, నైపుణ్యాన్ని పెంపొందించవచ్చు. అధిక జనాభా గల భారతదేశం పిల్లల హక్కుల సంరక్షణకు చట్టాలను పటిష్టంగా అమలు పరచాలి. బాలల సహాయ కేంద్రానికి(1098) ప్రాచుర్యం కల్పించాలి.

బాలల సంరక్షణ కోసం పోక్సో చట్టం 2012, బాలల న్యాయ చట్టం 2015, బాల హక్కుల పరిరక్షణ కమిషన్ 2005 లాంటివి ఉన్నాయి. ఇవి బాలల పట్ల కొనసాగుతున్న దుర్విచక్షణను అంతమొందించడానికి గట్టి కృషిచేయాలి. బాలల అభివృద్ధికీ బడ్జెట్ కేటాయింపుల్లో తగిన ప్రాధాన్యతనివ్వాలి. పేద బడుగు బలహీన వర్గాలు చదివే ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక భవనాలు, ప్రయోగశాలలు, బస్ సౌకర్యం, కంప్యూటర్ విద్య, సరిపడా ఉపాధ్యాయులు కొరత వేధిస్తుంది. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల బిసి, ఎస్‌సి, ఎస్‌టి, జెఎసి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని, మౌలిక సదుపాయాలు కల్పనకు డిమాండ్ చేశారు. అట్టడుగు వర్గాలు చదివే ఈ పాఠశాలలో గౌరవప్రదమైన విద్యలో భాగమివి. ఇప్పుడు తల్లిదండ్రులు కోరుకునేది కూడా గౌరవప్రదమైన విద్యనే. పిల్లలకు బాల్య దశ నుంచి ప్రశ్నించేతత్వం పెంపొందే విద్యనందించాలి. వారి హక్కుల పట్ల ప్రభుత్వం, పౌర సమాజం విస్తృతంగా ప్రచారం చేయాలి. అప్పుడే బాలల సర్వతోముఖాభివృద్ధికి బాటలు పడతాయి.

(ప్రపంచ బాలల దినోత్సవం (నవంబర్20))

## సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలపై కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

**ప్రజాపక్షం/బైంసా :** బాసరలో శివాజీ మహారాజ్ గురించి సోషల్ మీడియాలో ఒక యువకుడు చేసిన అనుచిత వ్యాఖ్యలపై స్థానికంగా ఉద్రిక్తతలు నెలకొన్న సందర్భంగా,జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ నిన్న స్వయంగా బాసర చేరుకుని పరిస్థితిని దగ్గరుండి పర్యవేక్షించ్చరూ ఈ పరిస్థితిని పూర్తిగా అదుపులో ఉంచేందుకు,ఈరోజు కూడా ఎస్పీ బాసరలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పికెట్లను స్వయంగా సందర్శించి శాంతి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం బాసరలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు లేవు,మొత్తం అంతా కూడా శాంతియుతంగా ఉంది.సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు కథనాలను చూసి ఎవరూ ఉద్రేకపడకూడదని,అందరూ సంయమనం పాటించాలని ఎస్పీ సూచించారు. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని ప్రజలకు కోరుతున్నాం అని హెచ్చరించారు.

## మిషన్ భగీరథ లీకేజీతో వరి పంటకు నష్టం

**ప్రజాపక్షం/కాసిపేట :** మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం సోనాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బాదుగుడెం రోడ్డు పక్కన ఉన్న మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ కారణంగా కోతకు వచ్చిన వరి పంట దెబ్బతింటోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత 15 రోజుల నుంచి పైప్ లైన్ లీకై నీరు పొలాల్లోకి చేరడంతో వరి పంట మొత్తం కింద పడిపోయి పూర్తిగా నాశనం అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా, వారు వచ్చి చూసి వెళ్లడం తప్ప ఇప్పటివరకు మరమ్మత్తులు చేయలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపు నుండి నీరు రాకుండా మరమ్మత్తులు చేసి తమ పంటను కాపాడాలని బాధిత రైతులు కనక మారు, సాకటి జైతూ, కనక సత్యనారాయణ కోరుతున్నారు.



# సాండ్ బజార్ ద్వారా ఇసుక అక్రమ రవాణాకు కళ్లెం

మంత్రి గడ్డం వివేకానంద





**ప్రజాపక్షం/చెన్నూరు :** సాండ్ బజార్ ఏర్పాటు ద్వారా ఇసుక అక్రమ రవాణాను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం చెన్నూరు మండలం బావురావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్‌ను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ పి.చంద్రయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం ప్రజాపాలన ద్వారా అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ఇందులో భాగంగా గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 రాయితీ గ్యాస్ సిలిండర్ అందిస్తున్నట్లు వివరించారు. ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా ఇప్పటి వరకు రూ.8వేల కోట్లు ఆర్‌టిసికి అందించామని పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సేవలను రూ.10లక్షలకు పెంచడంతో పాటు, నిరుపేదల కోసం కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేపట్టి జిల్లాలో 20 వేల కార్డులు ఇచ్చామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా 8 వేల ఇండ్లు గ్రౌండింగ్ చేయబడి, 5 వేల ఇండ్ల నిర్మాణానికి బిల్లుల చెల్లింపులు జరిగాయని వివరించారు. చెన్నూరులో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి రూ.250కోట్లు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.2 కోట్ల 50 లక్షలు, జూనియర్ కళాశాల కోసం రూ.1కోటి 50 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. చెన్నూరు 50 పడకల ఆసుపత్రిని 100 పడకలకు పెంచే ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ మాట్లాడుతూ సాండ్ బజార్ ద్వారా అక్రమ రవాణాను అరికట్టి వినియోగదారులకు ప్రణాళిక బద్ధంగా ఇసుకను అందిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుకను ఇస్తున్నట్లు పేర్కొన్నారు.అనంతరం మంత్రి కిష్టంపేట రైతు వేదికలో మహిళలకు చీరలు పంపిణీ చేసి, స్వయం సహాయక సంఘాలకు రూ. 21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించడం జరిగిందని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని అధికారులకు సూచించారు. మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

**టిఎస్‌ఎండిసి పిఒపై మంత్రి గడ్డం వివేక్ ఆగ్రహం**

**కనీస గౌరవం ఇవ్వలేదని హెచ్చరిక**

మైనింగ్ శాఖ మంత్రిగా తాను బాధ్యతలు చేపట్టినప్పటి నుండి టిఎస్‌ఎండిసి పిఒ వెంకటేష్ తనను కలవకపోవడంపై మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం చెన్నూరు మండలం బావురావుపేట గ్రామ సమీపంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఆయన సాండ్ బజార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన పిఒ వెంకటేష్ తనపై కనీస గౌరవం లేకుండా పరిచయం చేసుకోకపోవడం సమంజసం కాదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఒ వెంకటేష్ తన తీరు మార్చుకోవాలని మంత్రి హెచ్చరించారు. ఇప్పటికైనా నియోజకవర్గంలోని అధికారుల తీరుపై దృష్టి సారించి, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## ఎండోమెంట్ కమిషనర్ హరీష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ముధోల్ ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/బైంసా :** హైదరాబాద్ పట్టణంలోని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎండోమెంట్ కమిషనర్ హరీష్ ను మర్యాద పూర్వకంగా భేటి అయిన ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఆలయల అభివృద్ధి గురించి చర్చించడం జరిగింది.నియోజకవర్గంలోని పెండింగ్లో ఉన్న పలు ఆలయాలను త్వరితంగా మంజూరు చేయాలని,ఇటీవలే మంజూరైన ఆలయాలకు టెండర్ అప్రూవల్ ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు చెల్లింపులు మంజూరయ్యేలా చూడాలని,ఇటీవలే మంజూరైన ఆలయాలను టెండర్ అప్రూవల్ ఇవ్వాలని,పెండింగ్ బిల్లుల చెల్లింపులు మంజూరయ్యేలా చూడాలని కోరారు.వారితో పాటు మాజీ జడ్పీటీసీ రమేష్ భోస్లే పండిత్ పటేల్ సీనియర్ నాయకులు వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

## ట్రాక్టర్, ఆటో ఢీకొని ఒకరు మృతి



**ప్రజాపక్షం/పాపన్నపేట :** ట్రాక్టర్ ఆటో ఢీ కొని ఒకరు మృతి చెందిన సంఘటన మండల పరిధి నాగ్సాన్ పల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు పోడ్చన్‌పల్లి గ్రామానికి చెందిన పచ్చ దేవరాజ్ (17) వృత్తి రీత్యా విద్యార్థి, ఇతను గ్రామానికి చెందిన మరికొందరితో కలిసి అపుడపుడు క్యాటరింగ్ బాయ్ వెళ్తున్నాడు. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన కొందరితో కలిసి ఆటోలో ఏడుపాయలకు వెళ్లాడు. అక్కడ క్యాటరింగ్ ముగించుకొని తిరిగి ఇంటికి ఆటోలో వస్తుండగా నాగ్సాన్ పల్లి గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటో బోల్తా పడగా ఆటోలో ఉన్న దేవరాజ్ తో పాటు ఆటోలో ఉన్న మరికొందరికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం వారిని అంబులెన్సులో మెదక్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దేవరాజ్ పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా అర్ధరాత్రి సమయంలో మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



## పాడి క్లీనర్ల వినియోగంతో నాణ్యమైన ధాన్యం

1.40 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.186.40 కోట్ల చెల్లింపులు

**ప్రజాపక్షం/కౌడిపల్లి :** మండలం రాయిలాపూర్ గ్రామం లో ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తాసిల్దార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించి కేంద్రంలో జరుగుతున్న కార్యకలాపాలను పరిశీలించారు. రైతులకు పారదర్శకంగా, నష్టాలు లేకుండా ధాన్యం కొనుగోలు చేసే విధానంపై సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో వరి సేకరణ ప్రక్రియ కీలక భూమిక పోషిస్తోంది అని వివరించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగంగా జరుగుతున్నాయన్నారు. గత సంవత్సరం ఇదే నెలలో 16,060 మంది రైతుల నుంచి 90.728 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ 56.12 కోట్ల చెల్లించగా...ప్రస్తుత సీజన్ కి, ఇప్పటివరకు 37,117 మంది రైతుల నుండి 1.40 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.186.40 కోట్ల చెల్లింపులు జరిగాయన్నారు. గతంలో కంటే మెరుగ్గా ధాన్యం కొనుగోలు జరుగుతుండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు తెచ్చిన వడ్లను ప్యాడి క్లీనర్ ద్వారా శుద్ధి చేసి తూకం వేయడం జరుగుతోందని, ఈ విధానం వల్ల ధాన్యంలో ఉన్న ధూళి, ఇతర అశుద్ధ పదార్థాలు తొలగిపోయి రైతులకు తూకం నష్టాలు గణనీయంగా తగ్గుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు 37,117 మంది రైతుల నుండి మొత్తం1.40 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి సేకరించిన ధాన్యాన్ని లారీల ద్వారా రైస్ మిల్లులకు పంపినట్లు ధాన్యరుసుములు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్యాడి క్లీనర్ ద్వారా శుద్ధి చేయడం వల్ల రైతులకు ప్రతీ క్వింటాలుపై 1 కిలో 500 గ్రాముల వరకు ఆదా అవుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఈ విధానం అత్యంత ప్రయోజనకరమని పేర్కొని, ప్రతి రైతు తప్పని సరిగా (ప్యాడి క్లీనర్ వినియోగం) చేయాలని సూచించారు. పాడి క్లీనర్ ద్వారా శుద్ధి చేసేందుకు రైతులు మరింత ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా శుభ్రమైన ధాన్యం అందుబాటు వంటి ప్రయోజనాలు లభిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇపిఎఫ్ఒలో నిలిచిన పిఎఫ్‌ను వెంటనే చెల్లించాలి : బి.మల్లేష్

**ప్రజాపక్షం/ఎడపల్లిం :** పిఎఫ్ రికార్డులకు, ఆధార్‌లోని వివరాలైన సర్‌నేమ్, పేరు, వయస్సుకు సరిగ్గా లేదనే కారణంతో రూ. 33లక్షల కోట్లకు పైగా చెల్లించాల్సిన పిఎఫ్ డబ్బులను కార్మికులకు ఆపివేయడం దారుణమని తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బి.మల్లేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలో బీడీ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈపీఎఫ్ఓ ఆఫీసులో కార్మికుల పిఎఫ్ డబ్బులు ఆధార్‌లో ఉన్న పేర్లు వయస్సు కలవడం లేదనే కారణంతో నిలిపివేయడం అన్యాయమన్నారు. ఈ నిలిపివేసిన డబ్బులను వెంటనే కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు కష్టపడి పిఎఫ్‌లో జమ చేసుకున్న డబ్బులు ఇవ్వకపోవడం దారుణమని మల్లేష్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈపీఎఫ్ కార్మికులకు మోసం చేస్తున్నారని, పెన్షన్ పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమానికి ఉద్దేశించిన నిధులను షేర్ మార్కెట్‌లో పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కె.రాజు, సిహెచ్ అనిత, ఎస్.లక్ష్మి , నాగమణి, విజయ, రాజమణి, మమత, వసీమా, షబానా, రేష్మ, మైముదా, రజియా, పర్తాన, సల్మా, షాహిన్ బేగం, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతపై దృష్టి

అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారి దీపక్ తివారి



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ మండలం దాంటంగూడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించాలని తెలిపారు. మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తూ వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యా బోధనను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చేయాలని, విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థినుల భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వసతి గృహ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. నిర్మాణ నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేపట్టాలని, అర్హులైన లబ్ధిదారులకు కేటాయించిన ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తయ్యేలా పనులు వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మండల విద్యాధికారి, ఇంజనీరింగ్ అధికారులు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి తదితరులు పాల్గొన్నారు.

## 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ చీరలు



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** హైదరాబాద్ సచివాలయం నుండి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అదనపు కలెక్టర్లు, అధికారులతో కలిసి హాజరయ్యారు. జిల్లాకు ఇప్పటివరకు 35 వేల 758 ఏకరూప చీరలు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజా ప్రతినిధుల సమన్వయంతో చీరల పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా మహిళా సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ మహిళలకు ఏకరూప చీరలు పంపిణీ చేయడం వారి గౌరవాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు పాల్గొన్నారు.

**బాలల కోసం ప్రత్యేక చిత్రాల ప్రదర్శన**

జిల్లాలోని సినిమా థియేటర్లలో బాలల కోసం ప్రత్యేక చిత్రాల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తెలిపారు. డిసెంబరు 31వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు పాఠశాల విద్యార్థుల కొరకు ఈ ప్రత్యేక ప్రదర్శనలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

## ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఖానాపూర్ మండలంలోని బీర్నంది గ్రామానికి చెందిన దావీదు రాజు అనే విద్యార్థి ఆత్మహత్య ఘటనపై పాఠశాల ఉపాధ్యాయుల చర్యలు కారణంగానే ఈ విషాదం చోటు చేసుకుందని విద్యార్థి తల్లి సెల్ల గంగామణి జిల్లా విద్యాశాఖాధికారికి బుధవారం ఫిర్యాదు చేసింది.ఆమె తెలిపిన వివరాల ప్రకారం దావీదు రాజు మస్కాపూర్ జెడ్‌పిహెచ్‌ఎస్‌లో తొమ్మిదవ తరగతి చదువుతూ స్థానిక బిసి హాస్టల్‌లో నివసిస్తున్నాడు.హాస్టల్ లో సెప్టెంబరు 16న జరిగిన సున్నితమైన ఘటనను కుటుంబానికి తెలియజేయకుండా,పాఠశాల సిబ్బంది తొందరపడి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ ఇవ్వాలని ఒత్తిడి చేసినట్లు తల్లి ఆరోపించింది.దరఖాస్తు కూడా తాము రాయకుండానే,అడ్మిషన్ బాధ్యులైన ఉపాధ్యాయుడు స్వయంగా రాసి అక్టోబర్ 23న బలవంతంగా టిసి ఇచ్చినట్లు పేర్కొంది.తదుపరి,ప్రధానోపాధ్యాయుడుతో పాటు కొంతమంది ఉపాధ్యాయులు గతంలో జరిగిన హాస్టల్ సంఘటనను అనవసరంగా ప్రతికలకు చేరవేయడంతో విషయం పెద్దది కావడమే కాకు,బాలుడిపై కేసు నమోదై రీమాండ్ కేంద్రానికి పంపినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చిన దావీదు,పత్రికల్లో వచ్చిన వార్తలు,కేసు నమోదైన అంశం వల్ల తీవ్ర ఆత్మన్యూనత భావానికి గురై నవంబరు 4న ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడని తల్లి వేదన వ్యక్తం చేసింది.ఈ ఘటనకు ప్రధాన కారణమైన ప్రధానోపాధ్యాయుడుతో పాటు ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఆమె జిల్లా విద్యాధికారిని కోరింది.ఫిర్యాదు ప్రతులను జిల్లా కలెక్టర్,విద్యాశాఖ కమిషనర్,ప్రాంతీయ సంయుక్త సంచాలకుడికి పంపినట్లు పేర్కొన్నారు.

## పార్కింగ్ స్థలం లేకున్నా ... షాపింగ్ మాల్‌కు అనుమతి ఇవ్వటం సిగ్గుచేటు

నడిరోడ్డులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలి




**ప్రజాపక్షం/ఆర్మూర్ :** మున్సిపల్ కేంద్రంలోని కమలా నెహ్రూ కాలనీ మంథని బ్లాక్ గల్లీవాసులతో కలిసి సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆర్మూర్ సంయుక్త మండలాల పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమీషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి సమస్యలతో కూడిన మెమోరాండాన్ని మున్సిపల్ మేనేజర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్)ప్రజాపంథా ఆర్మూర్ సంయుక్త మండలాల కార్యదర్శి కిషన్, నాయకులు రాజన్నలు మాట్లాడుతూ పాత మంథని బ్లాక్‌ని కూల్చేసి నివాస గృహాల పేరుతో అనుమతి తీసుకుని పదుల సంఖ్యలో షట్టర్లను షాపింగ్ మాల్‌లను ఏర్పాటు చేసి గల్లీవాసులకు ఇబ్బందులు కలిగిస్తున్న దాన్ని రూపాలి షాపింగ్ కాంప్లెక్స్ నిర్వహించనప్పుడు తప్పుడు సమాచారంతో నివాస గృహాల పేరుతో అనుమతి తీసుకుని పదుల సంఖ్యలో షట్టర్లను ఏర్పాటు చేశారు. పార్కింగ్ స్థలం లేకుండా షాపులకు పర్మిషన్ ఇచ్చారు. షాపింగ్ మాల్ పర్మిషన్ రద్దు చేసి ప్రజలకు అసౌకర్యంగా ఉన్న షాపుల పర్మిషన్లు రద్దు చేయాలని, షాపింగ్‌మాల్ వెనుక రోడ్డు మధ్యలో వేసిన బోరును సగం రోడ్డును ఆక్రమిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే తొలగించాలని లేని యెడల గల్లీవాసులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంతో అరవింద్, నజీర్, గంగాధర్, లింబాద్రి, పోశన్న, పద్మ, స్వరూప, అమ్మక్క, సుల్తానా, అంజమ్మ, గంగక్క, పద్మ, నందిని, లింబాద్రి, రేష్మ పాల్గొన్నారు.

## మాతాజీ నిర్మలా దేవి ధ్యాన కేంద్రానికి నిధులు మంజూరు



ఎమ్మెల్సీ దండే విఠల్

**ప్రజాపక్షం/కౌటాల :** కౌటాల మండలం తాటిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మాతాజీ నిర్మలా దేవి సహజయోగ ధ్యాన కేంద్రం భవనం మంజూరు చేయాలని కోరుతూ మాతాజీ ట్రస్ట్ సభ్యులు ఎంఎల్‌సి దండే విఠల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ఎంఎల్‌సి సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే రూ.10లక్షల నిధి మంజూరు చేసి, భూమి పూజ కార్యక్రమానికి స్వయంగా హాజరవుతానని హామీ ఇచ్చారు. అలాగే ధ్యాన కేంద్రం భవన నిర్మాణం కోసం 4 గుంటల భూమిని విరాళంగా అందిస్తున్న చాప్లే తిరుపతిని ఎంఎల్‌సి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దాల దేవన్న, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సిడాం గణపతి, నైతం శీతల్, శ్రీ సిద్ధి హనుమాన్ దేవస్థానం తాటిపల్లి దేవాలయ చైర్మన్ ఎల్ములే దత్తు పటేల్, గావుడే హన్మంతు, భోయర్ ప్రవీణ్, తాటిపల్లి మాతాజీ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## నలుగురికి జైలుశిక్ష

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** వేల్పూర్‌కు చెందిన కనికరం రాజేశ్వర్ గడ్డం బాలకిషన్‌లు మద్యం మత్తులో న్యూసెన్స్ చేసినందుకు గాను వారిపై సిటీ పోలీస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి ఆర్మూర్ కోర్టులో ప్రవేశపెట్టగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ ఇద్దరికి రెండు రోజులు జైలుశిక్ష విధించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపిన రాజభూషణ్ నర్సయ్యలకు మోటారు వెహికిల్ చట్టం ప్రకారం వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా ఐదు రోజుల జైలు శిక్ష విధించామని ఎస్సై సంజీవ్ తెలిపారు.

## ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** భారత మాజీ మహిళా ప్రధాని, భారతరత్న ఇందిరాగాంధీ జయంతిని జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఆమె భారతదేశ కీర్తిని ప్రపంచ నలుమూలలకు చాటిచెప్పారన్నారు. ఆమె రాజకీయ, వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని శక్తివంతమైన నాయకురాలిగా దేశ చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఆమె జీవితం యువతకు స్ఫూర్తిదాయకం అన్నారు. భారత స్త్రీ శక్తికి ప్రతీక అని, ప్రపంచ వ్యాప్తంగా మహిళలకు స్ఫూర్తినిచ్చే నాయకురాలిగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారన్నారు.



**ప్రజాపక్షం/మందమర్రి :** కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు మందమర్రి ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 108వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సోతుకు సుదర్శన్ మాట్లాడుతూ దేశ తొలి మహిళా ప్రధానిగా, పేదలకు రోటీ, కపడా, మఖాన్ అందించాలనే లక్ష్యంతో గరీబ్ హఠావో నినాదంతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన మహనేత ఇందిరా గాంధీ అని కొనియాడారు. పేదల పక్షాన ఆమె తీసుకొచ్చిన సంస్కరణల ఆశయాలను కొనసాగించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పుల్లూరి లక్ష్మణ్, మైనారిటీ పట్టణ అధ్యక్షుడు ఎండి జమీల్, పైడిమల్ల నర్సింగ్ కనకం రాజు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి: తహసీల్దార్

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:**ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని నిర్వాహకులను తహసీల్దార్ వరప్రసాద్ ఆదేశించారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతో పాటు మండలంలోని గోదూరు గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ వరప్రసాద్ సందర్శించి కొనుగోలుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలుని వేగవంతం చేసి కాంట అయిన ధాన్యాన్ని లారీలో లోడ్ చేసి వెంటనే మిల్లులకు పంపాలని సూచించారు. అదేవిధంగా ట్యాబ్ ఎంట్రీ చేసి రైతుల ఖాతాలో తొందరగా డబ్బులు పడే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సెంటర్ నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.



## మొదటి మహిళా ప్రధానమంత్రిగా ఇందిరమ్మ దేశానికి ఎనలేని సేవలు: ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/పెద్దపల్లి :**భారతదేశ మొదటి మహిళా ప్రధానిగా స్వర్గీయ ఇందిరాగాంధీ దేశానికి ఎనలేని సేవలు అందజేశారని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు అన్నారు.బుధవారం రోజున పెద్దపల్లి పట్టణ కేంద్రంలో మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూల మాల లేసి నివాళులర్పించి కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశానికి మొట్టమొదటి ప్రధానమంత్రిగా ఎన్నికై దేశానికి ఎనలేనని సేవలు చేసి, భూమి లేని నిరుపేదలకు భూములు పంచి నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా ఇందిరమ్మగా నిలిచిపోయిందని కొనియాడారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు మాజీ ప్రజాప్రతినిధులు,అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.



## ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోలు



**ప్రజాపక్షం/గంగాధర:**రాజకీయ లబ్దికోసం బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై పనిగట్టుకుని అబద్దపు ఆరోపణలు చేస్తున్నారని కురిక్యాల సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల రావు పేర్కొన్నారు. మండలంలోని కురిక్యాల గ్రామంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న కొనుగోలు కేంద్రంలో రైతులు ఇబ్బంది పడకుండా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చన్న, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, మజీ జెడ్‌టిసి గునుకొండ బాబు, మాజీ ఎంపిపి రాజగోపాల్‌రెడ్డి, పడితపల్లి కిషన్ ,కర్ర బాపురెడ్డి, సాగి అజయ్‌రావు, బూరుగు గంగన్న, రేండ్ల రాజిరెడ్డి, రోమాల రమేష్, వంగల శ్రీనివాస్, ముద్దం నగేష్, కనకట్ల తిరుపతి, దోమకొండ మహేష్, జితేందర్ తదితరులున్నారు.

## జోనల్‌స్థాయి క్రికెట్ పోటీలకు ఆల్ఫోర్స్ విద్యార్థులు ఎంపిక



**ప్రజాపక్షం/కరీంనగర్:**కరీంనగర్‌లోని కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్‌జిఎఫ్ జోనల్‌స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక య్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభకు ము ఖ్య అతిధిగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. క్రీడల్లో రాణించేవిధంగా ప్రోత్సాహం అందించడంతో పా టు ప్రణాళికలను రూపొందించి వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటువం టి పోటీలకు ఎంపిక చేస్తున్నామని వారు చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో కరీంనగర్ జిల్లా కేంద్రం శివారులోని మల్కాపూర్‌లో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ మండల స్థాయి క్రికెట్ పోటీలలో పాఠశాలకు చెందిన అనిక్ అశ్వత్(9వ), ఆర్.ఈశ్వ అనుకరన్(6వ) అండర్ 17, అండర్ 14 స్థాయిలో అత్యుత్తమ క్రీడాస్పూర్తిని ప్రదర్శించి త్వరలో నిర్వహించబోయేటువంటి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హర్షం వ్యక్తం చేశా రు. నిర్వహించబోయే పోటీలకు చక్కటి ప్రాతినిధ్యం ఇచ్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షిస్తూ పుష్పగుచ్చాలను అందించారు. పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులున్నా రు.

## డ్రగ్స్, సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:**జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో బుధవారం జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు విద్యార్థులకు సైబర్ నేరాలు,డ్రగ్స్, ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ అనిల్ కుమార్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యువతలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలు అలాగే సైబర్ నేరాల నుండి జాగ్రత్తగా ఉండే విధానాలపై విద్యార్థులకు అవగాహననుఎస్ఐ కల్పించారు. యువత తమ లక్ష్యాలను సాధించడానికి సానుకూల ఆలోచనతో ముందుకు సాగాలని సూచిస్తూ ఉమెన్ ట్రాఫికింగ్ లాంటి పలు అంశాల పైన విద్యార్థులకు వివరిస్తూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలని ఎస్ఐ అనిల్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఇల్లందుల ప్రభాకర్, కళాశాల ఆధ్యాపకులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థిని,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం అగ్నిమాపక సిబ్బందిచే అగ్నిప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిలిండర్ నుండి గ్యాస్ లీక్ అయినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు,వరదలు వచ్చినప్పుడు ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో అగ్నిమాపక సిబ్బంది వివరిస్తూ అవగాహన కల్పించారు. ఫైర్ సిబ్బంది,పాఠశాలలహెచ్ఎంలుకళావతి,శ్రీనివాసరావు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలికలను రక్షిద్దాం - చదివిద్దాం!




**ప్రజాపక్షం /మెట్ పల్లి :** బాల్యవిమహాల వల్ల పిల్లలకు భవిష్యత్తులో మానసిక శారీరక ఎదుగుదల ఆగిపోతుందని ఐసిడీఎస్ సిడిపిఓ మణెమ్మ అన్నారు. పట్టణంలోని మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో బాల్య విహహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. జిల్లా బాలల పరిరక్షణ విభాగం , బాల్య వివాహ చట్టం 2006 ఫోక్సో చట్టం 2012 మత్తు పదార్థల మాదకద్రవ్యాలు 18 సంవత్సరాల పలో అమ్మాయికి , 21 సంవత్సరాల లోపు అబ్బాయికి వివాహాలు చేయడం చట్టరీత్యా నేరంగా పరిగణలోకి తీసుకోబడుతుంది. ఆ వివాహానికి లక్ష రూపాయల జగిమానా విధిస్తారు. బాల్య వివాహతో పిల్లలకు భవిష్యత్తులో మానసిక శారీరక ఎదుగుదల ఆగిపోతుంది. బాలబాలికలకి రక్షణ, సురక్షణ అవసమైన పిల్లల కోరకు 24 గంటలు చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పనిచేస్తుంది. మరిన్ని సమాచారం కోసం డైల్ 100 ని సంప్రదించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కాంతారావు, అంగన్వాడి టీచర్ నజీమా, పద్మ, శ్రీదేవి, చైత్ర, విజయలక్ష్మి, ఏఎన్ఎం లు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం అమలు

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కరీంనగ:**తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని, తద్వారా వయోవృద్ధులకు న్యాయం అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వృద్ధుల సామాజిక భద్రతకు సంబంధించిన ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం ద్వారా వయోవృద్ధుల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెనువెంటనే పరిష్కరించాలన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాదివయోవృద్ధుల సమస్యలకు సంబంధించి 200పైగా ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపారు. వారి సామాజిక భద్రతకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సంధర్భంగా వయోవృద్ధుల సంక్షేమం కోసం కృషి చేసిన పలువురిని కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒమహేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, వయోవృద్ధుల సంక్షేమ సంఘం నాయకులు పెండ్యాల కేశవరెడ్డి, మోసం అంజయ్య, అడ్వకేట్ ఎర్రం రాజిరెడ్డి, నాయకులు బండ సత్తయ్య, టి.ఆనందం, బిక్షపతి, ఖాజా సర్వరొద్దీన్, కట్ట రామస్వామి, న్యాలమడుగు శంకరయ్య, బ్రహ్మకుమారీ సిస్టర్స్ విజయలక్ష్మి , మనీషా పాటిల్ తదితరలున్నారు.







**చీరల పంపిణీని సమాఖ్య సభ్యులు పర్యవేక్షించాలి**

ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా అర్హులందరికీ చీరలు అందేలా మహిళా సంఘాల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా, మండల మహిళా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న చీరలు ప్రతి ఒక్కరికీ చేరేలా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు పర్యవేక్షించాలని అన్నారు. ఓపెన్ స్కూల్, వయోజనవిద్య నమోదులో జిల్లా లక్ష్యాన్ని పూర్తి చేసిందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు ఎక్కువ సంఖ్యలో ఓపెన్ 10వ తరగతి, ఇంటర్‌లో నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరంతా తరగతులకు సైతం హాజరు కావాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రతి మూడవ శనివారం ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తున్నామని, తల్లిదండ్రులు ఖచ్చితంగా హాజరయ్యేలా సమాఖ్య సభ్యులు చూడాలన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మంజూరైన వివిధ యూనిట్లతో వ్యాపారాలు ప్రారంభించిన మహిళా సంఘాలు కృషి పట్టుదలతో అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లాభాలు గడించాలన్నారు. బ్యాంకు లింకేజీ రుణాల మంజూరు, రికవరీలో జిల్లా నెంబర్‌వన్ స్థానంలో నిలవడం గొప్ప విషయమని, అదే విధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్న సంఘాలు మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్‌డిఒమహేశ్వర్, జిల్లా అధికారులు, జిల్లా, మండల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

## నిరుపేదల పక్షపాతి ఇందిరాగాంధీ

### సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్

**ప్రజాపక్షం/ధర్మపురి :** దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి నిరుపేదల జీవితాలలో వెలుగులు నింపిందని ఆమె తీసుకున్న నిర్ణయాలు కోట్లాదిమందికి ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,వికలాంగులు,వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు.జగిత్యాల జిల్లా ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఇందిరాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మ ణ్ కుమార్ ఇందిర చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఇందిరాగాంధీ ఉక్కు సంకల్పం, దేశభక్తి పేదలపట్ల ఉన్న మమకారం అపారమైనవని అన్నారు.భారతదేశాన్ని ప్రపంచదేశాలకు ధీటుగా శక్తివంతమైన దేశంగా నిలబెట్టిన ఘనత ఇందిరాగాంధీదేమన్నారు.నేటి యువతరం ఇందిరా స్ఫూర్తిగా సమాజం కోసం పనిచేసే మనస్తత్వం అలవర్చుకోవాలని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, దేశభద్రతలో ఇందిర చూపిన ధైర్యసాహసాలు చరిత్రలో నిలిచాయన్నారు.ఇందిరమ్మ చూపిన బాటలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం పంథాలో ముందుకు సాగుతున్నదని మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి, పెగడపెల్లి, వెల్గటూరు పార్టీ మండలాధ్యక్షులు సంగన బట్ల దినేష్,బుర్ర రాములు గౌడ్,శైలేందర్ రెడ్డి,ధర్మపురి ఆలయ కమిటీ అధ్యక్షులు జక్కు రవీందర్,పాల్గొన్నారు.



## చేర్యాలలో సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

### ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



**ప్రజాపక్షం/చేర్యాల:**సిద్దిపేట జిల్లా చేర్యాల మోడల్‌లోని రేణుకా గార్డెన్స్‌లో జరిగిన సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే మూడు నెలల్లో ప్రతి ఆదివారం ఒక లక్ష మందికి పైగా కొమురవెల్లి దర్శనానికి వస్తారని పిహెచ్‌సిను స్టెంటెన్ చేయాలని జిల్లా కలెక్టర్, డిఎమ్‌హెచ్ఒ, మంత్రిలను అభ్యర్థించారు.గత రెండు సంవత్సరాలుగా తన స్వంత నీలిమ హాస్పిటల్‌లో నియోజకవర్గ ప్రజలకు సొంత ఖర్చులతో ఉచిత వైద్యం అందిస్తున్నట్లు రాబోయే మూడు సంవత్సరాల పాటు కూడా అందిస్తారని, హాస్పిటల్‌లో లేని ప్రత్యేక వైద్య సేవల కోసం ఎన్ఐఎమ్ఎస్, ఇతర నిపుణులతో సమన్వయం చేసి, మంచి చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.ఎమర్జెన్సీ అవసరమున్న వారికి ఎల్‌ఒసి జారీ చేస్తామని, డబ్బు ఖర్చు చేసి చికిత్స పొందినవారికి సీఎమ్ఆర్ఎఫ్ చెక్కు త్వరగా అందించేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ బుధవారం సందర్శించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో ఏవైన సమస్యలున్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ ధాన్యం విక్రయ సమయంలో ఆధారుకార్డు, పట్టదారు పాస్‌బుక్. బ్యాంక్ పాస్‌బుక్ ప్రతులను సమర్పించాలని సూచించారు. నిబంధనల మేరకు ధాన్యం తేమశాతం పరిశీలించాలన్నారు. నిత్యం ఆలస్యం లేకుండ ఓపిఎంఎస్‌లో ట్యాబ్ ఎంట్రీలను వేగంగా పూర్తి చేయాలని పిపిసి ఇంచార్జీలను ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంట డిఎం సివిల్ సప్లయ్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత



**ప్రజాపక్షం/సారంగాపూర్ :**జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండ ల కేంద్రంలో రైతు వేదికలో సారంగాపూర్ మండలానికి మంజూరైన 89 మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్ అందజేశారు. అనంతర ం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేయడం ఆనందం గా ఉందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేద మధ్య తరగతి ప్రజలు చిరకాల సొంతింటి కల సాకారం అవుతుందని అన్నా రు. పేద ప్రజల పక్షాన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉందని, 89 మంది ఆడబిడ్డలకు ఇండ్ల మంజూరు పత్రాలు ఇస్తున్నామని అ న్నారు. సారంగాపూర్ మండలానికి 571ఇండ్లు మంజూరు చేయ డం జరిగిందన్నారు. మండలానికి 1కోటి 62లక్షలు నిధులు ఇం డ్ల నిర్మాణ లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యాయని, 299 మంది ముగ్గు పోయడం జరిగిందన్నారు. మండలంలో 152 ఇండ్ల ని ర్మాణ పనులు జరుగుతున్నాయని ఇందిరమ్మ ఇళ్లలో అలసత్వం వహిస్తే అధికారులపై చర్యలు ఉంటాయి.తహశీల్దార్ వహిదుద్దీన్, ఎంపిడివో చౌడారం గంగాధర్, ఎస్సై గీత, సింగిల్ విండో చైర్మన్ గురునాథం మల్లారెడ్డి, నరసింహ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు ,అదికారులు పంచాయితీ కార్యదర్శులులుపాల్గొన్నారు.

## ఇసుకకు ప్రతిరోజూ అనుమతి ఇవ్వాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ వినతి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:**ప్రతి రోజు ఇసుకకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ ఆధ్వర్యంలో సిరిసిల్ల తహసీల్ధార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భరంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా తీసుకు వచ్చిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, మానేరు వాగు పక్కనే ఉన్నప్పటికీ ప్రతి రోజూ ఇసుకకు అనుమతులు లేకపోవడంతో, ఇసుకకు అధిక ధరలు పెరిగి, లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోతు న్నారన్నారు. భవన నిర్మాణ కార్మికులు సైతం ప్రతి రోజూ పనులు దొరకక డబ్బులు లేక వారు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనీ ప్రతిరోజూ ఇసుక అనుమతులు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, ఇతర నిర్మాణాలు జరిగి కార్మికులకు సైతం పనులు లభించేలా చూడాలని కోరారు. ఎఐటి యుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, అధ్యక్షుడుఅజ్జ వేణు, ఒడ్డెపెల్లి లక్ష్మ ణ్, మంత్రి చంద్రయ్య, గడ్డం మధు సూధన్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్‌టిసి ఉద్యోగులపై దాడులు ఉపేక్షించేది లేదు

### రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామం వద్ద ఆర్‌టిసి డ్రైవర్‌పై జరిగిన దాడిని రాష్ట్ర బిసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఖండించారు. విధుల్లో ఉన్న ఆర్‌టిసి ఉద్యోగిపై ఉద్దేశ్యపూర్వకంగా దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్‌పితో ఫోన్‌లో మాట్లాడి ఆర్‌టిసిడ్రైవర్‌పై దాడి చేసిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజారవాణా వ్యవస్థలో ప్రయాణికుల కోసం నిరంతరం శ్రమిస్తున్న ఆర్‌టిసిసోదరులపై దాడి ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూసుకుంటామని ఆర్‌టిసి ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ మనోధైర్యాన్ని ప్రకటించారు.

## మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ

### ప్రజా సంఘాల డిమాండ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ ముమ్మటికి బూటకపు ఎన్కౌంటరని, ఇట్టి ఎన్ కౌంటర్ పై న్యాయ విచారణ జరిపించాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ), సిపిఐఎమ్ఎల్ న్యూ డెమోక్రసీ, రైతుకూలీ సంఘం (ఆర్‌సిఎస్), విప్లవ రచయితల సంఘం తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టిపిఎఫ్), ఎఐఎఫ్‌టియు డిమాండ్ చేసింది.ఈ సందర్భంగా నిర్వహించిన పత్రికా సమావేశం లో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, న్యూ డెమోక్రసీ, రైతు కూలి సంఘం నాయకులు మాట్లాడుతూ సామ్రాజ్యవాదుల కోసం భారత సైన్యం దేశ పౌరులనే వేటాడటం అమానుషమని, మోడీ అమిత్ షా ఓట్ చోర్ లేకాదు రక్తపిపాసులు అనేది నగ్నసత్యమన్నారు. మధ్య భారతం లోని ఖనిజలకోసం రక్త పూటేరులు వారిస్తున్నారని,ఆదివాసులను ఆడవుల్లో నుండి వెళ్లగొట్టేందుకు మానవ హననం సాగిస్తున్నారనీ, మర్చి, 2026 వరకు దేశంలో నెలకొన్న నిరుద్యోగం, ఆకలి చావులు, అసమానతలు రూపుమాపడం దళితులు,మహిళాల పై దాడులు అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పని చేయాలనీ, విద్యా, వైద్యం పేదలకు అందుబాటులోకి తీసుకు రావడంలో కేంద్రం పనిచెయాలనీఅన్నారు. అడవులను, సహజ సంపదను కాపాడే అమాయక ఆదివాసులపై అమానుష దమనఖాండ ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని, సిపిఐ మావోయిస్టు పార్టీ తో శాంతి చర్చలు జరపాలని, బుద్ధిజీవులు, హక్కుల సంఘాలు చేస్తున్నా డిమాండ్ చేస్తున్న కేంద్రం మొండి వైఖరి వీడటం లేదన్నారు.మారేడు మిల్లి అడవులోబూటకపు ఎన్కౌంటర్ లో అమరులైన కామ్రేడ్స్ మాడవి హిడ్మా, హేమ మరో నలుగురి మృతి పై సుప్రీం కోర్ట్ సిట్టింగ్ జడ్జి చేన్యాయ విచారణ జరిపించాలని.ఆపరేషన్ కగార్ తక్షణమే నిలిపివేయాలని,మధ్యభారతంలోని పోలీస్ క్యాంపులనుఎత్తివేయాలని, ఆదివాసీ ప్రాంతాల్లో మొహరించిన సాయుధ పోలీస్ బలగాలను వెనక్కి రప్పించాలని, పోలీసుల అధీనంలో ఉన్న ఇతర మావోయిస్టు నాయకులకు ఎలాంటి ప్రాణహాని తలపెట్టకుండా వెంటనే కోర్టు లో హాజరుపరచాలని ఈ సందర్బంగా డిమాండ్ చేసారు.ఈ సమావేశం లో రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్తురు సదానందం, ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కట్టా విశ్వనాధం, డిహెచ్ పిఎరాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మ ణ్, విరసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, ఎఐఎఫ్‌టియురాష్ట్ర అధ్యక్షులు రత్న కుమార్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టిపిఎఫ్) పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య, ఎఐఎస్ఎఫ్‌జిల్లా అధ్యక్షులు స్థాలిన్‌ప్రజా సంఘాల నాయకులు లక్ష్మ ణ్, దీరజ్,తదితరులు పాల్గొన్నారు.



# క్రీడ

## దక్షిణాఫ్రికా–'ఎ'తో మూడో వన్డే.. ఇండియా-'ఎ' ఓటమి



దక్షిణాఫ్రికాఎతో మూడు అనధికార వన్డే మ్యాచ్‌ల సిరీస్‌ను ఇండియాఎ.. 21తో కైవసం చేసుకుంది. బుధవారం జరిగిన మూడో అనధికార వన్డేలో ఇండియాఎ 73 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికాఎ 6 వికెట్లు కోల్పోయి 325 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో ఇండియా–ఎ 252 పరుగులకు ఆలౌటైంది. ఆయుష్ బదోని (66; 66 బంతుల్లో 8 ఫోర్లు), ఇషాన్ కిషన్ (53; 67 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మాత్రమే రాణిచారు. రుతురాజ్ గైక్వాడ్ (25), అభిషేక్ శర్మ (11), తిలక్ వర్మ (11), రియాన్ పరాగ్ (17) నిరాశపర్చారు. చివర్లో టెయిలెండర్లు ప్రసిద్ధ్ కృష్ణ (23), మానవ్ సుతార్ (23) పోరాడినా ఫలితం లేకపోయింది. తొలుత సఫారీ జట్టు బ్యాటర్లలో ఓపెనర్లు లువాన్ డ్రే ప్రిటోరియస్ (123; 98 బంతుల్లో, 9 ఫోర్లు, 6 సిక్స్‌లు), రివాల్డో మూన్సామి (107; 130 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకాలు బాదారు. ఈ జోడీ తొలి వికెట్‌కు రికార్డుస్థాయిలో 241 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. డెలానో పాట్గీటర్ (30*) పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. భారత బౌలర్లలో ఖలీల్ అహ్మద్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా తలో రెండు వికెట్లు తీశారు.

## అగ్రస్థానం కోల్పోయిన రోహిత్

### వన్డే బ్యాటర్లలో కివీస్ ప్లేయర్‌కు ఫస్ట్ ర్యాంక్



భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఒక్క పాయింట్ తేడాతో అగ్రస్థానాన్ని కోల్పోయాడు. ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో సెంచరీ చేసిన న్యూజిలాండ్ ఆటగాడు డారిల్ మిచెల్ (782 పాయింట్లు) రెండు స్థానాలు ఎగబాకి నంబర్ వన్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. రోహిత్ (781) రెండో స్థానానికి పడిపోయాడు. అఫ్గాన్ బ్యాటర్ ఇబ్రహీం జద్రాన్ (764), శుభ్‌మన్ గిల్ (745), విరాట్ కోహ్లీ (725) వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నారు. శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ ఒక్కో స్థానం మెరుగై వరుసగా ఎనిమిది, 16వ ర్యాంకుకు చేరుకున్నారు. వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం అందుకున్న రెండో కివీస్ ఆటగాడిగా డారిల్ మిచెల్ నిలిచాడు. అంతకుముందు 1979లో గ్లెన్ టర్నర్ మాత్రమే ఈ ఘనత సాధించాడు. మార్టిన్ క్రోవ్, ఆండ్రూ జోన్స్, రోజర్ ట్వోస్, నాథన్ ఆస్టిల్, కేన్ విలియమ్సన్, మార్టిన్ గప్తిల్, రాస్ వంటి ఆటగాళ్లు టాప్5లో నిలిచినా వీరిలో ఒక్కరు కూడా నంబర్ ర్యాంక్‌కు చేరుకోలేకపోయారు. కోల్‌కతాలో భారత్‌తో జరిగిన తొలి టెస్టులో అర్ధ శతకం చేసిన సౌతాఫ్రికా కెప్టెన్ తెంబా బావుమా రెండు స్థానాలు జంప్ అయి ఐదో ర్యాంక్‌లో నిలిచాడు. యశస్వి జైస్వాల్ ఐదు నుంచి ఏడో ర్యాంకుకు పడిపోగా.. శుభ్‌మన్ గిల్ రెండు స్థానాలు మెరుగై 11వ ర్యాంకులో ఉన్నాడు. రిషభ్ పంత్ నాలుగు స్థానాలు దిగజారి 12వ స్థానానికి పడిపోయాడు. సౌతాఫ్రికాతో తొలి టెస్టులో ఆరు వికెట్లు పడగొట్టిన జస్‌ప్రీత్ బుమ్రా నంబర్ వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. కుల్‌దీప్ యాదవ్ రెండు స్థానాలు మెరుగై 13వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. అతడి కెరీర్‌లో బెస్ట్ ర్యాంక్ ఇదే. రవీంద్ర జడేజా నాలుగ స్థానాలు ఎగబాకి 15వ ర్యాంక్‌లో ఉన్నాడు.

## గిల్.. గౌహతి వెళ్తున్నాడు.. కానీ!

### రెండో టెస్ట్‌పై తర్వాత నిర్ణయం తీసుకుంటాం : బిసిసిఐ





టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కోల్‌కతా టెస్ట్‌లో గాయపడిన విషయం తెలిసిందే. దీంతో అతడు రిటైర్డ్ అవుట్‌గా వెనుదిరిగాడు. మెడనొప్పితో ఇబ్బంది పడ్డ అతడు.. ఆ మ్యాచ్‌లో కేవలం మూడు బంతులు మాత్రమే ఎదుర్కొన్నాడు. మ్యాచ్ ముగిసేంత వరకు అసలు మైదానంలోకే రాలేదు. గాయం తగిలిన రోజు రాత్రి.. అతడు ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నాడు. తర్వాత హాస్పిటల్ నుంచి బయటకు వచ్చాడు. ప్రస్తుతం తాజాగా.. గిల్ ఆరోగ్యంపై బిసిసిఐ నుంచి అప్‌డేట్ వచ్చింది. ట్రీట్‌మెంట్‌కు అతడు స్పందిస్తున్నాడని, జట్టుతోపాటుగా గౌహతి వెళ్లనున్నట్లుగా ప్రకటించింది. అయితే గిల్ రెండో టెస్ట్‌లో ఆడేది.. లేనిది.. తర్వాత నిర్ణయిస్తామని వివరించింది. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత మేరకు గిల్‌ను రెండోటెస్ట్‌లో ఆడించాలనే జట్టు యాజమాన్యం చూస్తోందని తెలుస్తోంది. 'దక్షిణాఫ్రికాతో కోల్‌కతా వేదికగా జరిగిన మొదటి టెస్ట్.. రెండో రోజున టీమ్‌ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మెడ గాయంతో బాధపడ్డాడు. ఆరోజు ఆట ముగిసిన తర్వాత అతణ్ని పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు అతడి ఆరోగ్యాన్ని పర్యవేక్షించారు. అయితే మరుసటి రోజు అతడు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యాడు' అని బిసిసిఐ తెలిపింది. అందుకే అతడు జట్టుతో పాటు గువాహటికి ప్రయాణమవుతున్నాడు. బిసిసిఐ మెడికల్ టీమ్ అతణ్ని నిత్యం పర్యవేక్షిస్తోంది. పరిస్థితులను బట్టి అతడు రెండో టెస్ట్‌లో ఆడతాడో లేదో తర్వాత నిర్ణయం తీసుకుంటాం' అని బిసిసిఐ పేర్కొంది. ఒక వేళ శుభ్‌మన్ గిల్ గువాహటి వేదికగా జరగనున్న రెండో టెస్ట్‌లో ఆడలేకపోతే.. ప్రస్తుతం వైస్‌కెప్టెన్‌గా ఉన్న రిషభ్ పంత్ సారథ్య బాధ్యతలు వహించనున్నాడు. అయితే గిల్ స్థానంలో ఎవరు బ్యాటింగ్‌కు వస్తారో ఇంకా తేలలేదు. సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్‌లో ఎవరో ఒకరు వచ్చే అవకాశం ఉంది! కానీ ఇప్పటికే జట్టులో ఆరుగురు లెఫ్ట్ హ్యాండర్ బ్యాటర్లున్న నేపథ్యంలో.. ఈ ఇద్దరిలో ఏ ఒక్కరిని తీసుకున్నా వారి సంఖ్య ఏడుకు పెరుగుతుంది. అలాగే ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి సైతం ఇప్పటికే జట్టులో వచ్చి చేరాడు.

# ఫోకస్




## 5వేల ఏళ్లకుపైగా.. అదే కాలమానం!





ఆశ్చర్యం కలిగించినప్పటికీ, ఒకే కాలమాన్ని 5 వేల సంవత్సరాలకుపైగా మనం ఉపయోగిస్తునే ఉన్నాం. సుమేరియన్లు ఈ కాలమానాన్ని ఆవిష్కరించినప్పుడు వారి వద్ద ఎలాంటి గణన పరికరాలు లేవు. కేవలం ఆకాశం చూసి, అధ్యయనం చేసి అసాధారణ ఆవిష్కరణ చేశారు. దానినే మని ఇప్పటికీ అనుసరిస్తున్నాం. ఒక గంటను 60 నిమిషాలుగా, ఒక రోజును 24 గంటలుగా వారే విభజించారు. 10 గుణకాలు (దశాంశం) లేదా 12 గుణకాలు (ద్వాదశం) కాకుండా 60ని (సెక్సాజెసిమల్ విధానం) ప్రామాణికంగా తీసుకోవడానికి ఒక గొప్ప తర్కం ఉంది. 1, 2, 3, 4, 5, 6, 10, 12, 15, 20, 30లతో సమానంగా భాగాలుగా విభజించవచ్చు కాబట్టి, 60ని వారు సంపూర్ణ సంఖ్యగా భావించారు. అంతేకాక, అప్పటి ఖగోళ శాస్త్రవేత్తలు ఒక సంవత్సరంలో 360 రోజులు ఉంటాయని నమ్మేవారు. 360లో ఆరు 60లు ఉంటాయి. ఈ కారణంగానే, ఆకాశ చలనాలను లెక్కపెట్టే సమయంలో 60 ఆధారంగా విభజించడం వారికి సహజం అయింది. సుమేరియన్ల సామ్రాజ్యం నేడు చరిత్ర పుటల్లో మాత్రమే కనిపిస్తుంది. కానీ వారు ఏర్పరిచిన కాల విభజన విధానం మాత్రం 5,000 ఏళ్లకు పైగా మనం మార్చకుండా ఉపయోగిస్తున్నాం. వారి మేధా శక్తి అసాధారణం, అపూర్వం, అనన్య సామాన్యం.



## శతాబ్దాల నాటి కలప రథం

రోమ్ నిర్మాణానికి సుమారు ఆరు శతాబ్దాలకు ముందు... ట్రోజన్ యుద్ధానికి, హోమర్ రచించిన ఇలియడ్‌కు కూడా వందలాది ఏళ్ళ క్రితం... అథెన్స్‌లోని పార్తెనాన్ ఆలయం నిర్మించడానికి దాదాపు వెయ్యేళ్ల కంటే పూర్వం తయారు చేసిన ఒక పురాతన రథం అందరినీ దిగ్భ్రాంతికి గురి చేస్తున్నది. దీనిని కలపతో తయారు చేయడం గమనార్హం. ఈ వైవిధ్యమైన ఫారో తుత్మోస్ IV అధికారిక రథం 3,400 సంవత్సరాలకు పైగా ప్రాచీన చరిత్ర కలిగి ఉంది. ఇది యునైటెడ్ ఈజిప్ట్ ఆధునిక నాగరికతను సూచించే అత్యద్భుతమైన కలప కళాఖండాలలో ఒకటి. తుత్మోస్ IV అంటే ఈజిప్ట్ 18వ రాజవంశంలోని ఎనిమిదవ ఫారో. క్రీస్తు పూర్వం 1401–1388 కాలానికి చెందినవాడు. నిరంతరం రథంపై తిరిగే రాజుగా ప్రసిద్ధుడు. సాధారణంగా కలపతో చేసిన వస్తువులు శతాబ్దాల తరబడి ఉండవు. కానీ, తుత్మోస్ IV రథం మాత్రం ఇప్పటికీ కాంతులీనుతునే ఉంది. అప్పటి కాలంలోనే అత్యంత శాస్త్రీయ పద్ధతుల్లో దీనిని నిర్మించడం విశేషం. దీనిని అత్యంత అరుదైన మెచ్యూర్డ్ కలపతో నిర్మించారు. దీనిని కేవలం యుద్ధ సమయంలో మాత్రమే కాదు.. రాజు తన దైనందిన ప్రయాణాలు, మతపరమైన ప్రదర్శనల్లో కూడా ఉపయోగించేవారు. 1903లో హోవార్డ్ కార్టర్ ఈ రథాన్నిగుర్తించి, ప్రఖ్యాత వ్యాలీ ఆఫ్ ది కింగ్స్ లోనిదని నిర్ధారించారు. ఈ ప్రాచీన కలప కళాఖండం శిల్ప కళ, ఆభరణాల రూపకల్పనఅత్యద్భుతంగా ఉంది. ఈ కాలంలో కలప అంత దీర్ఘకాలం నిలబడడం అరుదు. అందుకే తుత్మోస్ IV అధికారిక రథం ప్రపంచంలోని మొట్టమొదటి, అత్యంత నిలకడైన కలపగా గుర్తింపు సంపాదించింది. అరుదైన అవశేషంగా కీర్తించబడుతున్నది.

## గత వైభవ చిహ్నాలు..



ప్రస్తుత గ్రీస్‌లోని డెల్ఫీ ప్రాంతం, థోలోస్‌లో కొలువు తీరిన గతకాల వైభవ చిహ్నాలు ఈ నిర్మాణాలు. ఇది పార్నాసస్ పర్వత శ్రేణులకు ఆనుకుని ఉన్న, క్రీస్తు పూర్వం 4వ శతాబ్దానికి చెందిన సుందరమైన నిర్మాణ వైభవం. ఈ వృత్తాకార ఆలయం 'అతీనా ప్రోనైయా'లోని భాగం. దీనిలో బయటకు ఇరవై డోరిక్ తీగలు, లోపల పది కోరింతియన్ తీగలు ఉండేవి. ఇవి గ్రీకు శిల్పశైలిలోని శైలీయ సమన్వయానికి ఉదాహరణ. ఈ నిర్మాణం ఖచ్చితంగా ఎందుకోసం జరిగిందనే విషయంపై ఇప్పటికీ స్పష్టత లేదు. ఐతే, ఇది భూదేవతకు (చోనిక్ దేవత) అర్పించిన ముఖ్యమైన ఆధ్యాత్మిక స్థలంగా భావిస్తారు. దీని పరిపూర్ణ సమమితులు, మృదువైన నిష్పత్తులు గ్రీకు శిల్పకళలో అత్యున్నత నైపుణ్యాలను ప్రతిబింబిస్తాయి. నేడు, అసలు శిలలలో కేవలం మూడే నిలిచి ఉన్నాయి. అయినప్పటికీ అవి పురాతన డెల్ఫీ సంప్రదాయాన్ని, ఆ నాటి ఆధ్యాత్మిక శక్తిని ఇప్పటికీ గుర్తు చేస్తూనే ఉన్నాయి. గ్రీసు గొప్ప సాంస్కృతిక, శిల్ప కలా వారసత్వానికి థోలోస్ ప్రతీక.

# కగార్ ఎన్‌కౌంటర్‌లపై న్యాయవిచారణ

### సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించాలి
### మావోయిస్టులు పంథా మార్చుకోవాలి
### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్



**ప్రజాపక్షం/హనుమకొండ :** కగార్ ఆపరేషన్ పేరుతో కేంద్రప్రభుత్వం జరుపుతున్న మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌ల అన్నింటిపైనా న్యాయ విచారణ జరిపించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్‌తో కలిసి తక్కళ్లపల్లి మాట్లాడారు. కగార్ ఎన్‌కౌంటర్‌లపై అనేక అనుమానాలు ఉన్నాయని, మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌లపై స్వయంగా సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. మావోయిస్టులను కోర్టుకు సరెండర్ చేయకుండా టెర్రరిస్టుల మాదిరిగా చంపడం సరికాదన్నారు. అలాగే మావోయిస్టులు కూడా పునరాలోచన చేయాలని, తమ పంథా మార్చుకోవాలని కోరారు. తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారం సాధ్యం కాదని ఇప్పటికే కొందరు బయటికి వచ్చారని, మిగిలిన వారు కూడా తమ పంథా మార్చుకొని కమ్యూనిస్టులతో కలిసి రావాలని కోరారు. దేశంలో బిజెపి ప్రభుత్వం నరహంతక పాలన సాగిస్తున్నదని, కేవలం కార్పొరేట్, పెట్టుబడిదారీ శక్తుల కోసమే పనిచేస్తున్నదన్నారు. ఇటీవల ప్రభుత్వ రంగ సంస్థ ఎల్‌ఐసికి చెందిన రూ.33వేల కోట్లను ఆదానీ గ్రూపులో పెట్టుబడి పెట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పాలన చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా పోరాడేందుకు వామపక్ష ప్రజాతంత్ర శక్తులు బలపడాల న్నారు. అందుకు మావోయిస్టులు కలిసి రావాలని కోరారు. బిసి రిజర్వేషన్లపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అఖిలపక్షాలను ముఖ్యమంత్రి ఢిల్లీకి తీసుకెళ్లాలని సూచించారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్ ఇందుకు బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ మాట్లాడుతూ వచ్చే డిసెంబర్ 26 నాటికి సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ బస్సు జాతాలను నిర్వహిస్తున్నదన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరి వందేళ్ల సభకు వేలాదిగా తరలి రావాలని ప్రజలను కోరారు. మారిన కాలంలో బూర్జువా పార్టీ లు నోట్లతో ఓట్లు కొనుగోలు చేస్తూ గద్దె నెక్కుతున్నాయని, ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండా చట్టసభలలో, బయటా సిపిఐ తన గొంతు వినిపి పేదల పక్షాన నిలుస్తుందన్నారు. ఎర్రజెండా పార్టీలన్నీ ఏకమై బూర్జువా పార్టీలకు వ్యతిరేకంగా నిలబడాలని, అందుకు ప్రజలు కమ్యూనిస్టులతో కలిసి నడవాలని కోరారు. సమావేశంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యదర్శి సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మారుపాక అనిల్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఎన్.అశోక్, స్టాలిన్, మునిగాల బిక్షపతి, జక్కు రాజుగౌడ్, ఎదునూరి వెంకట్రాజం, కొట్టెపాక రవి, మోతె లింగారెడ్డి, మాలోతు శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ గుమ్మంలో శతాబ్ది సంబురం

### 21న జిల్లాకు శతాబ్ది ఉత్సవ ప్రచార జాతా
### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు
### బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలని డిమాండ్



**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజా ఉద్యమాల గుమ్మం ఖమ్మంలో శతాబ్ది ఉత్సవ ముగింపు సంబురాలు జరుగుతున్నాయని, ఇవి కమ్యూనిస్టు పార్టీ పురోభివృద్ధికి, భవిష్యత్తు ప్రజా ఉద్యమాలకు దోహదం కానున్నాయని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. సభలకు సంబంధించి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఖమ్మం నగర సమితి సమావేశం బుధవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఎస్‌కె జానిమియా అధ్యక్షతన జరిగింది. సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ లక్షలాది మంది ప్రజలను కదిలించేందుకు శ్రేణులు పని చేస్తున్నాయని, ఇంటింటికి సభ సందేశాన్ని అందజేస్తున్నామన్నారు. దేశంలో జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లను వెంటనే నిలిపి వేయాలని ఆయన డిమాండ్ చేశారు. దశాబ్దాల పాటు ప్రజల కొరకు పని చేసిన వారిని పట్టుకొచ్చి కాల్చి చంపుతున్నారని హేమంతరావు ఆరోపించారు. మావోయిస్టుల ఏరివేత పేరుతో కేంద్ర ప్రభుత్వం హింసా పూరిత చర్యలకు పాల్పడి మానవత్వాన్ని మంటగలుపుతుందన్నారు. ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారు దొరికితే విచారించి చట్టం ద్వారా శిక్షించాలి, కానీ అడవుల్లోకి తీసుకెళ్లి ఎన్‌కౌంటర్ల పేరుతో హతమార్చే హక్కు ఎవరిచ్చారని హేమంతరావు ప్రశ్నించారు. కార్పొరేట్ల కనుసన్నల్లో మోడీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రకృతి సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే నెపంతో అడవుల నుంచి మావోయిస్టులను తరిమేస్తున్నారన్నారు. మడివి హిడ్మా సహా ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లన్నింటిపైన న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అపరిపక్వతతో కొందరు బిజెపి నాయకులు రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నారని, సమాజం పట్ల మావోయిస్టు ఉద్యమం పట్ల అవగాహన లేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. ఎర్రజెండాలను తుల నాడే ప్రయత్నం చేయడం మానుకోకపోతే ప్రజలే తగు రీతిలో బుద్ధి చెబుతారని ఆయన బాగం హెచ్చరించారు.

**21న ప్రచార జాతా :** ఈనెల 21న సిపిఐ ప్రచార జాతా ఖమ్మంకు రానుందని హేమంతరావు తెలిపారు. ఈనెల 15న మహబూబ్ నగర్ జిల్లా గద్వాల్‌లో ప్రారంభమైన రెండవ జాతా, నవంబర్ 21న ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోకి ప్రవేశించనుందన్నారు. నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం, వివి పాలెం, కొణిజర్ల, వైరా, తల్లాడ, ఏన్కూరు మీదుగా కొత్తగూడెం జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. దారి పొడవునా ప్రధాన కేంద్రాల్లో సభలు జరుగుతాయని హేమంతరావు తెలిపారు. ఈ జాతాకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనర్సింహా నేతృత్వం వహిస్తున్నారని ఆయన తెలిపారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, పోటు కళావతి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, వరదా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## 'మధ్యాహ్న' కార్మికుల సమ్మెకు మద్దతు

### సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** తమ డిమాండ్లను పరిష్కరించాలని గత నాలుగు రోజులు గా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు పెద్దపల్లి సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. బుధవారం స్థానిక అమరవీరుల స్థూపం వద్ద సమ్మె నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు ఆయన సంఘీభావం తెలిపిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన మధ్యాహ్న భోజన కార్మికుల బతుకులు మారడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం లోనైనా వారికి న్యాయం జరుగుతుందని ఆశపడ్డారన్నారు. పొద్దంతా కష్టపడిన మధ్యాహ్న భోజన కార్మికులకు తగినంత వేతనం రావడం లేదని, తద్వారా వారు ఆర్థికంగా చితికి పోతున్నారని, మార్కెట్లో పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూలో ధరలు చెల్లించడం లేదని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా బిల్లులు చెల్లించాలని, పాత బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, నెలకు గౌరవ వేతనం రూ.పదివేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పూసాల రమేష్, పాలకులకు కళావతి, జక్కుల రాజేశ్వరి, ఎండి సాలేహా, మేకల యశోద, లంక విజయ మరియు మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.



## 22న భద్రాచలంలో బస్సు జాతా ముగింపు సభ



### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాచలం :** సిపిఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా జోడోఘాట్‌లో ప్రారంభమైన బస్సు జాత ఈనెల 22న భద్రాచలంలో జరిగే బహిరంగ సభతో ముగుస్తుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతీ కార్యకర్తల సైనికుల్లా పనిచేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ బస్సు జాత ఈనెల 21న జిల్లాలోని ఇల్లెందు నియోజకవర్గంలోనికి ప్రవేశిస్తుందని, ఇల్లెందు పట్టణంలో భారీర్యాలీతోపాటు బహిరంగ సభ ఉంటుందన్నారు. టేకులపల్లి మీదుగా పాల్వంచలోనికి ప్రవేశిస్తుందని, పాల్వంచలో మోటార్‌సైకిల్ ర్యాలీ, సభ ఉంటుందన్నారు. అదే రోజు బూర్గంపాడు మండలంలోనికి ప్రవేశించి ఐటిసి పిఎస్‌పిడి అతిధి గృహంలో రాత్రిబస చేస్తారని తెలిపారు. 22న ఉదయం సారపాక సెంటర్‌లో సభ ఉంటుందని, గోదావరి బ్రిడ్జీ మీదుగా భద్రాచలం పట్టంలోకి ప్రవేశిస్తుందని చెప్పారు. భద్రాచలం పట్టణ ప్రవేశ ద్వారం వద్ద పెద్దఎత్తున బస్సు జాతాకు స్వాగతం పలుకుతారని, అక్కడ్నుంచి వందలాది మోటార్ సైకిళ్లతో పట్టణ పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహిస్తారని, అంబేద్కర్ సెంటర్‌లోని డా.బిఆర్ అంబేద్కర్, విప్లవ వీరుల విగ్రహాలకు పూల మాలలు వేసిన అనంతరం అక్కడే భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి పార్టీశ్రేణులు కృషి చేయాలన్నారు. ప్రచార జాతాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు, కలవేన శంకర్, కలకోట కాంతయ్య, మణికంఠ రెడ్డి, పల్లె నర్సింహా పాల్గొంటారన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, మువ్వా వెంకటేశ్వరరావు, జిల్లా సమితి సభ్యులు రామిరెడ్డి, సబ్కా నాగేశ్వరరావు, పేరాల శ్రీనివాస్, సాధనపల్లి సతీష్, నిమ్మల రాంబాబు, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి పోరాటంతో భూగర్భ గనుల జీవితకాలం పెంపు : వాసిరెడ్డి

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** కార్మికుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేసిన ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఎఐటియుసి కృషి ఫలితంగానే మూసివేయాలని భావించిన భూగర్భ గనుల జీవిత కాలాన్ని పెంచడానికి యాజమాన్యాన్ని ఒప్పించగలిగామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. బుధవారం ఏరియాలోని ఎస్ఆర్‌పి 1 గనిలో ఏర్పాటు చేసిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం మార్చి నాటికి మూసివేయాలని యాజమాన్యం ప్రకటించిన ఎస్ఆర్‌పి 1 గనిలో 1వ సీమ్ ఓపెన్ చేయడం వల్ల గని జీవితకాలం మరో 5 సంవత్సరాలు పెరగబోతుందని తెలిపారు. అలాగే ఆర్‌కె న్యూటెక్ గని జీవిత కాలాన్ని కూడా పెంచడం జరిగిందన్నారు. ప్రమాదవశాత్తు కార్మికుడు చనిపోతే కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇచ్చేందుకు, హైదరాబాద్‌లో కార్పొరేట్ ఆసుపత్రి నిర్మాణానికి యాజమాన్యాన్ని ఒప్పించడం జరిగిందన్నారు. ఎటువంటి అవకతవకలు లేకుండా సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టులను ఇప్పించడం జరిగిందని చెప్పారు. పెర్క్స్‌పై పడే ఇన్కమ్ టాక్స్ సంస్థ చెల్లించే విషయంపై రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కొరకు లేఖ రాసినట్లు యాజమాన్యం తెలిపిందన్నారు. మెడికల్ బోర్డు ఏర్పాటుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రధానకార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె. బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## నాణ్యమైన పంట సత్వరమే కొనుగోలు చేయాలి

### అధికారులతో సమీక్షించిన మంత్రి తుమ్మల




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నాణ్యమైన పంట సత్వరమే కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి ధాన్యం, పత్తి పంటల కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో నాణ్యత పరిశీలించి కొనుగోలు చేసిన తర్వాత రైస్ మిల్లుల వద్ద ఎటువంటి కోతలు విధించడానికి వీలే లేదని స్పష్టం చేశారు. గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టుకోవాలన్నారు.

## సిపిఐ వందేళ్ళ ఉత్సవాల ముగింపు బస్సు జాతాలకు ఏర్పాట్లు




**ప్రజాపక్షం/ఇల్లందు:** డిసెంబర్ 26న ఖమ్మం పట్టణంలో జరిగే సిపిఐ వందేళ్ళ ఉత్సవాల ముగింపు భారీ బహిరంగ సభ విజయవంతానికి పార్టీ తరపున రాష్ట్రంలో మూడు బస్సు జాతాలను ప్రారంభించామని, ఇల్లందు మండలంలో శుక్రవారం 21వ తారీఖు సాయంత్రం మూడు గంటలకు రాజీవ్‌నగర్ తండాకు చేరుకుంటుందని, దాని విజయవంతానికి ఏర్పాట్లు చేస్తున్నామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు. డిసెంబర్ 26న జరిగే సిపిఐ ముగింపు సభకు ఇల్లందు నియోజకవర్గం నుండి 30వేలకు పైగా జనాభాను తరలించాలని, పార్టీ అభిమానులు, సిపిఐ కార్యకర్తలు నుండి విరాళాలను సేకరించాలన్నారు. ఇల్లందు నియోజకవర్గంలో ముఖ్య మైన ప్రాంతాలలో సిపిఐ వందేళ్ళ ఉత్సవాలకు సంబంధించిన వాల్ రైటింగ్స్ రాయించాలని తెలిపారు. ప్రభుత్వంతో కలిసి ఉన్న నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె.సారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, మండల కార్యదర్శి గుగులోత్ రామచంద్రనాయక్, ఇల్లందు మండల పట్టణ కార్యదర్శులు బొప్పిశెట్టి సత్యనారాయణ, బాస శ్రీనివాసరావు, ఇల్లందు ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షుడు దాసరి రాజారామ్, సిపిఐ నాయకులు ఉడత ఐలయ్య, బొల్లి కొమరయ్య, కుమ్మరి రవీందర్, ఎస్.కె వలి, పాల్గొన్నారు.

## మిరప తోటలు పరిశీలన



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, మధిర మండలంలోని సిరిపురం గ్రామంలో మిరప తోటలను మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో కలిసి పరిశీలించడం జరిగింది. వేరుకుళ్లు తెగులు నివారణకు ట్రైకోడెర్మా విరిడి కల్చర్ను వాడాలని, లేనిపక్షంలో కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా కాపర్ హైడ్రాక్సైడ్ మందులను ప్లాంటో మైసిన్ కలిసి మొక్క వేర్లు తడిచే విధంగా భూమిలో పోయాలని సూచించారు. నల్లతామర పురుగుల నివారణకు వేప నూనెతో పాటుగా థాయోమిథాక్షం లేదా ఇమిడిక్లోప్రిడ్ ఫిప్రోనిల్ 40శాతం కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల సుచరితదేవి, పావని, చైతన్య, ఉద్యానవన శాఖ అధికారి ఎ.విషణ, బోనకల్ వ్యవసాయాధికారి వినయ్, విస్తారణాధికారి హుస్సేన్, మధిర మండల వ్యవసాయాధికారి సాయిదీక్షిత్, విస్తరణాధికారులు జిష్ణు, గురుమూర్తి పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

### ఉభయ జిల్లాల్లో 125 మందికి లబ్ధి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటళ్లలో అత్యవసరమైన వైద్య చికిత్స పొందిన పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి ఉభయ జిల్లాల్లో 125 మంది లబ్దిదారులకు మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం నగరంలోని గట్టయ్య సెంటర్‌లో గల క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల లబ్దిదారులకు రూ. 40 లక్షల మేరకు లబ్ది చేకూరిందన్నారు. ఎంపి రఘురాం రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసాగా నిలుస్తుందన్నారు. అత్యవసర వైద్య చికిత్సల కోసం ఇప్పటికే అనేక మందికి ఎల్ఓసిలు మంజూరు చేశామన్నారు. అర్హులైన పేదలందరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్ది కలిగేలా కృషి చేస్తామన్నారు.మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, మద్ది మల్లారెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టిపిసి సభ్యులు కృష్ణ, ఇమామ్ బాయ్, పలువురు కార్పొరేటర్లు, ప్రజా సంఘాల బాధ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 22న గీతపనివార్ల పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** గీతపనివారల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చే స్తూ ఈనెల 22న హైదరాబాద్‌లో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని గీతపనివారల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తొండల సత్యనారాయణ, దూసరి శ్రీరాములు కోరారు. బుధవారం సదస్సు పోస్టర్లను విడుదల చేశారు. సత్యనారాయణ, శ్రీరాములు మాట్లాడుతూ గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. గీత కార్మికులకు చెల్లించాల్సిన రూ. 13 కోట్లను తక్షణం విడుదల చేయాలని కో రారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి వి. నివాస్ గౌడ్, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, గీతపనివారల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మగాని ప్రభాకర్, సాయిల్ గౌడ్, సదానంద్ గౌడ్ పాల్గొంటారని వారు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ గీతపనివార్ల సంఘం నాయకులు ఇంద్రసేన, నాగేశ్వరరావు, వాసు, సైదా పాల్గొన్నారు.

## గంజాయి కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** గంజాయి కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ బుధవారం ఖమ్మం మొదటి అదనపు న్యాయమూర్తి కె. ఉమాదేవి తీర్పునిచ్చారు. ఈ కేసులో మిగిలిన నిందితులు పరారీలో ఉన్నారు. వివరాల్లోకి వెళితే 2020 డిసెంబర్ నాలుగున పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆ టోలో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని ప్రశ్నించి ఆటోను తనిఖీ చేశారు. వై జాగ్‌లో గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తూ మూడు బ్యాగుల్లో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు స్వా ధీనం చేసుకున్న గంజాయి విలువ రూ. 7.50 లక్షలుగా అప్పట్లో నిర్ధారించారు. దీనిపై కొణిజర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితులపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు శిక్ష విధి స్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్‌కుమార్‌రెడ్డి వాదించగా , లైజనింగ్ అధికారి శ్రీకాంత్, మల్లికార్జునరావు, రామారావు, హోంగార్డ్ అయూబ్ లు సహకరించారు.

# తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్రం వివక్ష

### రైతాంగాన్ని విస్మరిస్తున్న మోడీ సర్కార్

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తుందని రైతాంగాన్ని విస్మరిస్తూ మోడీ సర్కార్ పాలన సాగిస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు పక్క రాష్ట్రాలకు కేంద్ర బృందాలను పంపి తెలంగాణ కు పంపకుండా వివక్ష చూపుతుందన్నారు. బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ బిజెపి అధ్యక్షులు రాంచందర్‌రావు మేధావి కావచ్చు కానీ రైతాంగాన్ని అవమానపర్చవద్దన్నారు. రైతులను రెచ్చగొట్టి ప్రభుత్వాన్ని బదనాం చేయాలని బిజెపి, బిఆర్ఎస్‌లు కుట్రలు పన్నుతున్నాయన్నారు. పంటలకు మద్దతు ధర ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం దానికి అనుగుణంగా కొనుగోలు చేయడం లేదన్నారు. పత్తి కొనుగోలు చేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని మంత్రి తెలిపారు. సిసిఐ ఆధ్వర్యంలో మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేస్తామని చెబుతూనే నిబంధనలను విధిస్తుందన్నారు. జిన్నింగ్ మిల్లులను ఎల్1, ఎల్2, ఎల్ 3 పేరుతో విభజించి పత్తి కొనుగోలు జరిపిస్తున్నారన్నారు. దీనితో జిన్నింగ్ మిల్లులు సమ్మెబాట పట్టాయన్నారు. ఏడు క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేయాలని నిబంధన విధించడం శోచనీయమన్నారు. రైతులు పత్తిని అమ్ముకునేందుకు కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని కేంద్రం చెప్పడంతో రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎరువులు, పంటల కొనుగోళ్లకు సంబంధించి పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రులతో పాటు ముఖ్యమంత్రి సైతం విన్నవించినా పట్టించుకోలేదన్నారు. గత ఆరు నెలలుగా తుఫాన్లు, అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్నాయని పండిన కొద్దిపాటి పంటలకు కూడా తేమ శాతం ఎక్కువగా ఉందని దానిని సవరించాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడలేనివిధంగా ఎంఎస్‌పికి పంటలను కొనే రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు రెండు లక్షల లోపు రుణాలను మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. రైతుల కోసం రూ.1.06 లక్షల కోట్లను రైతుల కోసం ఖర్చు చేశామన్నారు. మన్మోహన్‌సింగ్ పాలనలో గతంలో దేశ వ్యాప్తంగా రూ.70 వేల కోట్లు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. ధాన్యం అత్యధికంగా పండిస్తున్న రాష్ట్రం దేశంలోనే తెలంగాణ మాత్రమేనన్నారు. మద్దతు ధరతో పాటు స న్న రకం వడ్లు బోనస్ కూడా ప్రభుత్వం అందిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తన వాటాను కూడా కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. పామాయిల్, పత్తి దిగుమతి సుంకాలను కేంద్రం ఎత్తి వేయడం వల్ల రైతు లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూరియా సరఫరాలో కూడా కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇతర దేశాల నుంచి వచ్చే యూరియాను తెలంగాణకు కేటాయించడం వల్ల సరఫరా చేయడంలో ఆలస్యమైందన్నారు. పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ రైతుల గురించి పట్టించుకోకుండా ఇప్పుడు రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేపట్టడం హాస్యాస్పదమన్నారు.బిజెపి, బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పై విమర్శలు చేయడం ప్రజలకు గ మనిస్తున్నారని తెలిపారు. రైతాంగ ఇబ్బందులు తొలగించేందుకు బిజెపి నాయకులు ప్రయత్నించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్ పాల్గొన్నారు.

## ఆకాశమే హద్దుగా మహిళలు ఎదగాలి

### చిల్డ్రన్ హోమ్ నిర్మాణానికి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఆకాశమే హద్దుగా మ హిళలు స్వశక్తితో ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం రఘునాథపాలెం మండల కేంద్రంలో ఎంపిడివో కా ర్యాలయంలో రూ. 1.35 లక్షలతో నిర్మించనున్న బాలల సదన భవనానికి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరా గాంధీ జయంతి సందర్భం గా ఆమె చిత్ర పటానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ గరీబీ హటావో నినాదంతో పేదల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించిన మహా నాయకురాలు ఇందిరా గాంధీ అని తెలిపారు. జిల్లా లో 1.27 లక్షల మం ది ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఏకరూ ప దుస్తులను కుట్టించి అందించడం జరిగిందన్నా రు. 35 కోట్ల నిధులతో పలు పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. మహిళా సంఘాల సభ్యులు మాట్లాడుతూ వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం, షీ రాక్స్ సెంటర్, స్త్రీ టీ స్టాల్, మహిళా మార్ట్ వంటి అనేక మహిళా సంక్షేమ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మంత్రి మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. రూ.54.13 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాల చెక్కును పంపిణీ చేశారు.రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎస్ఈ యా కోబ్, ఖమ్మం ఆర్డివో నర్సింహారావు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకటరెడ్డి, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఈఈ పుష్పలత, తహసీల్దార్ శ్వేత, ఎంపిడివో అశోక్‌కుమార్, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, కాంగ్రెస్ మండల కన్వీనర్ వాంకుడోత్ దీపక్ నాయక్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాలో పకడ్బందీగా చిన్న నీటి వనరుల గణన

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలోని చిన్న నీటి వనరుల గణనను పకడ్బందీగా చేపట్టాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో దేశవ్యాప్తంగా ఐదేళ్లకోసారి నిర్వహించే 7వ మైనర్ ఇరిగేషన్, రెండవవాటర్ బాడీస్ గణన కార్యక్రమాన్ని జిల్లాలో ఏవిధంగా అమలు చేయాలనే దానిపై జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలోని చిన్ననీటి పారుదల వనరుల గణనను సమగ్ర ప్రణాళికా బద్ధంగా పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా 2వేల హెక్టార్లలోపు విస్తీర్ణం గల జలవనరుల గణనను మొబైల్ అప్లికేషన్ ద్వారా మాత్రమే చేపట్టాలన్నారు. చెప్పారు. ముందుగా ఒక గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని నమూనా గణను పూర్తి చేసేన అనంతరం మిగతా గ్రామాల్లో గణన కొనసాగించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థ అదనపు కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవరావు, భూగర్భ జలాల అభివృద్ధిశాఖ అధికారి రమేష్, ఇరిగేషన్ ఇఇ అర్జున్ పంచాయితీ రాజ్ ఇఇ శ్రీనివాస్, ఎంపిఎస్ఓ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హస్పిటల్‌లో ప్రసవాల సంఖ్య పెంచాలి

### జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్.పి.శ్రీజ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ప్రభుత్వ హస్పిటల్ లో ప్రసవాల సంఖ్య ను పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్.పి.శ్రీజ సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ హస్పిటల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హస్పిటల్ మొత్తం కలియతిరి రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, కాన్పుల గది, ఆపరేషన్ లు చేసే గదులను పరిశీలించారు. చెరువుమాధారం లోని పల్లె దవాఖాను ను పరిశీలించారు. పీహెచ్సీ ఏర్పాటు కు అవసరమైన చర్యలు గురించి చర్చించారు. అనంతరం సీహెచ్సీ లో వైద్యాధికారులతో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. ప్రభుత్వ హస్పిటల్ ప్రసవాల సంఖ్య ను పెంచేందుకు అవసరమైన సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అందుకు అవసరమైనసౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అందుకు అవసరమైన వాటిని వెంటనే అంచనాలు వేయాలని పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. సీహెచ్సీ కి రోగుల సంఖ్య ఎక్కువైతున్నందున్న నేలకొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను చెరువుమాధారం కు తరలించాలని ఆదేశించారు. చెరువుమాధారం పల్లె దవాఖానా లో ఏర్పాటు చేయనున్న పీహెచ్సీ కి కనీస సౌకర్యాలు కల్పించేందుకు రూ. 10 లక్షలతో అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ నెలాఖారు లోపు పీహెచ్సీ ని చెరువుమాదారం పంపించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రసవాలు పెంచేందుకు వైద్యాధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. హస్పిటల్ లో సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. నేలకొండపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన ""వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వాటి కోసం అంచనాలు సిద్ధం చేయాలని పీఆర్ అధికారులను ఆదేశించారు.

## పొగ మంచులో ప్రయాణాలు జాగ్రత్త

### ఎస్పి రోహిత్ రాజ్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** శీతాకారంలో దట్టమైన పొగమంచు కురుస్తోందని, ఇలాంటి సమయాల్లో వాహనదారులు ప్రయాణాలు చేసేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పి రోహిత్ రాజ్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దట్టమైన పొగమంచు కురిసే సమయంలో ప్రయాణాలు చేయడం శ్రేయస్కరం కాదన్నారు. ముందు వెళుతున్న వాహనానికి కనీసం 50 మీటర్ల దూరాన్ని పాటిస్తూ ఆ వాహనం ఇచ్చే సిగ్నల్‌ను గమనిస్తూ ఉండాలని తెలిపారు. పొగమంచు అధికంగా కురిసే సమయంలో ఓవర్ చేయడం మంచిదికాదన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు డ్రైవింగ్ చేయడం మానేసి వాహనాన్ని ప్రక్కకు ఆపుకోవడం శ్రేయస్కరమని, హాజార్డ్ లైట్లు వేసి ఉంచాలని సూచించారు. జిల్లా ప్రజల రక్షణ పోలీసులు బాధ్యతని, సురక్షిత ప్రయాణాలతో కుటుంబ భద్రంగా ఉంటుందని చెప్పారు.

## గ్రంథాలయంలో గోరింట,ముగ్గుల పోటీలు

### ఎస్ఐ అరుణ



**ప్రజాపక్షం/భద్రాచలం :** జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా బుధవారం గోరింట, ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఇం దిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతీయ మహిళా కార్యక్రమం జరిగింది. గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మహిళా ఎస్సై అరుణ పాల్గొన్నారు. ఈ పోటీల్లో చిన్నారులు చక్కటి ము గ్గులు వేయగా, అందమైన గోరింటాకును చేతుల పై వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలని, వాటిని పిల్లలు సద్వినియోగం చేసుకుంటే జీవితాలు అద్భుతంగా మారతాయని చెప్పారు. మహిళలు అక్షరాస్యులుగా మారాలని, అక్షరాస్యతతో కుటుంబాల్లో ఆనందాల్లు వెల్లు విరుస్తాయని చెప్పారు.

## బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలి

### మీడియా సమావేశంలో

### మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు




**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజల పక్షాన పోరాడే వారిని బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చి చంపుతున్నారని ఈ ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. బుధవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలకుల దుర్మార్గపు విధానాలను ప్రశ్నించే వారిని నిర్మూలించే పథకంలో భాగంగానే ఈ నరమేధం జరుగుతుందన్నారు. కగార్ పేరుతో మోడీ, అమిత్‌షాలు దేశంలో హత్యాకాండ కొనసాగిస్తున్నారని ఈ హత్యాకాండపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని రంగారావు డిమాండ్ చేశారు. తక్షణం ప్రభుత్వ హత్యలను నిలుపుదల చేయాలని ఆయన కోరారు. చర్చలకు సిద్ధమన్న వారిని సైతం పట్టుకొచ్చి కాల్చి చంపుతున్నారని ఆయన తెలిపారు. డిసెంబర్ 26న కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 ఏళ్లయిన సందర్భంగా 25న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్ని గ్రామాల్లోనూ పతాకావిష్కరణలు చేయాలని పార్టీ నిర్ణయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 24న అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలని పార్టీ నిర్ణయించినట్లు రంగారావు తెలిపారు. మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యులు కె జి రాంచందర్, నాయకులు కెచ్చల రంగయ్య, కె. రమ, ప్రభాకర్, చంద్రన్న, రామయ్య, సదానం ద ం, పీట్ల రామకృష్ణ, అశోక్, పుల్లయ్య పాల్గొన్నారు.

# ప్రమాదాల నియంత్రణకే వాహన తనిఖీలు:ఎస్‌పి

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** రాత్రి సమయంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీశాఖ పటిష్ట భద్రతను కట్టుదిట్టం చేసింది. దీనిలో భాగంగా పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎస్‌హెచ్‌ఓలు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. మంగళవారం రాత్రి ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ఎక్కడికక్కడ వాహనాలను



నిలిపి డ్రంక్అండ్‌డ్రైవ్‌లతో పాటు సోదాలు చేసి వాహన చోదకుల వద్ద డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వారికి జరిమానాలు విధించారు. మద్యంసేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు సరెండర్ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల నుంచి ఫింగర్ ప్రింట్ మొబైల్ చెక్ ద్వారా వేలిముద్రలు సేకరించారు. జిల్లాలో గుర్తించిన బ్లాక్‌స్పాట్‌ల వద్ద భారికెడ్లు, సూచికబోర్డులు, స్టాపర్లు, సిగ్నాల్, బ్లింకింగ్ లైట్లు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టారు. రహదారులపై ద్విచక్రవాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా కొందరు యువకులు ట్రిబుల్ రైడింగ్ తో పాటు మద్యం సేవించి హెల్మెట్ లేకుండా ర్యాష్ డ్రైవింగ్ చేయడం వలనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని సిపి పేర్కొన్నారు. వారితో పాటు ఎదురుగా వచ్చే వారిని సైతం క్షతగాత్రులకు గురిచేస్తున్నారన్నారు. నిబంధనలను పట్టించని వారిపై ప్రత్యేక దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు. పలు సందర్భాల్లో వాహనాలు మరమ్మతులతో నిలిచిపోవడంతో సదరు వాహన చోదకుడు వాహనానికి చుట్టుపక్కలా రాళ్లు, చెట్లకొమ్మలను పెడుతున్నారని రాత్రి వేళల్లో వాటిని గమనించక అటుగా వెళ్లే వాహనాల వారు వాటిని ఢీ కొడుతుండటంతో ప్రమాదాల తీవ్రత పెరుగుతోందని వెల్లడించారు. నగరంలోని కాల్వఒడ్డు మున్నేరుపై తీగల వంతెన నిర్మాణం కోసం భారీయంత్రాలను ఉపయోగిస్తున్న సందర్భంగా 20వ తేది గురువారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ వంతెనపై రాకపోకలు నిలిపివేస్తూ అంక్షలు విధించినట్లు ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనదారులు, ప్రజలు దినిని గుర్తించి ఆయా సమయాల్లో ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగించాలని ఆయన సూచించారు. ప్రజలు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.





# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



ప్రజాపక్షం/దేవరుప్పుల: విద్యుత్ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని విద్యుత్ అధికారులను ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఆదేశించారు. బుధవారం పాలకుర్తి మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో దేవరుప్పుల మండలానికి చెందిన విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యుత్ సమస్యలపై అత్యవసరంగా పరిష్కరించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, సంబంధిత ఏఈలు, డీఈలు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.



## చీరల పంపిణీ విజయవంతం

కలెక్టర్ దివాకర టిఎస్

ప్రజాపక్షం/ములుగు : ములుగు జిల్లాలోని మహిళా సమాఖ్య సభ్యులందరికి చీరలను పంపిణీ చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. ముఖ్యమంత్రి బుధవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయడానికి కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పంపిణీ చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్‌రావు, డిఆర్‌డిఓ పిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్‌ల ఆకస్మిక తనిఖీ

ప్రజాపక్షం/నెక్కొండ : నెక్కొండ మండల కేంద్రంలోని 108 అత్యవసర అంబులెన్స్ సేవలను జిల్లా ఈఎంఈ గుర్రపు భరత్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో ఉన్న రిజిస్టర్లు, అత్యవసర ఔషద నిల్వలు, ఆక్సిజన్ సదుపాయం, వైద్య పరికరాలు, సహా అన్ని విభాగాలను ఆయన శ్రద్ధగా పరిశీలించారు. సిబ్బంది పనిచేసే విధానంపై సంతృప్తి వ్యక్తం చేసిన భరత్ కుమార్, ప్రజలకు అత్యవసర సేవలు అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కాల్ సెంటర్ నుండి వచ్చే ప్రతి కాల్‌కు వేగంగా స్పందించి, కేసు వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకోవాలని స్పష్టం చేశారు. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మంచు ఉన్న ప్రాంతాల్లో వాహనాలు నడపడంలో జాగ్రత్తలు పాటించాలని, సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ చర్యలు తీసుకోవాలని సూచనలు అందించారు. ఈ తనిఖీలో స్థానిక 108 ఈఎంటి ఉపేందర్, పైలట్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు గూడూరుకు సిపిఐ బస్సు యాత్ర

ప్రజాపక్షం/గూడూరు : భారతదేశంలో సిపిఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా జోడేఘాట్ నుండి భద్రాచలం వరకు చేపట్టిన బస్సు జాత యాత్ర నేడు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రానికి చేరనుంది. కాగా ఈ బస్సు యాత్ర జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చొప్పరి శేఖర్ గూడూరు మండల కన్వీనర్ మాలోత్ రవీందర్ పిలుసపునిచ్చారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గూడూరు మండల కేంద్రానికి నేడు 20వ తేదీ గురువారం సిపిఐ బస్సు యాత్ర మధ్యాహ్నం వరకు చేరనుందని మండలంలోని సిపిఐ పార్టీ నాయకులు సిపిఐకి సంబంధించినటువంటి సానుభూతిపరులు ప్రజా కార్మిక సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరై ఈ యాత్రకు స్వాగతం పలకాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ నాయకులు మదత నారాయణ, ఎర్రోజు కరుణాకర్, దాసరి సాయిలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలన



ప్రజాపక్షం/ఖిలా వరంగల్ : వరంగల్ పరిధిలోని చేపట్టి పూర్తిచేసిన పలు అభివృద్ధి పనులను కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులు పూర్తి చేసిన తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఏనుమాముల మార్కెట్, కొత్తవాడ 80 ఫీట్ల రోడ్డు, అండర్ బ్రిడ్జి రంగశాయిపేట, కరీమాబాద్ ప్రాంతాల్లో పూర్తి చేసిన బిటి, సిసి రోడ్లు, డ్రైన్‌లను ఎంబిలో నమోదు చేసిన కొలతల ఆధారంగా పరిశీలించారు. వీటి ఆధారంగా కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు ఉంటుందని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ సంతోష్‌బాబు, డిఈ రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

## డబ్బు కోసం కాదు సేవ కోసమే పదవి

అవకాశం ఇస్తే జెడ్‌పిటిసి బరిలో ఉంటా : మాదాసు రమేష్



ప్రజాపక్షం/గూడూరు: డబ్బు కోసం కాదు కానీ పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే రాజియాల్లోకి రావాలని ఆశ ఉందని అవకాశం వస్తే స్థానిక సంస్థలు ఉన్నికల్లో బీసిలకు జనరల్ వర్తిస్తే పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని మాదాసు రమేష్ విలేకరులకు తెలిపారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాలు తెలుసుకొని సమస్యలు పరిష్కరించాలంటే రాజకీయాలకు రావాల్సిందేనని ప్రజలు గెలిపిస్తే ప్రజల్లో ఉండి పనిచేసి వారి రుణం తీర్చుకుంటానని అన్నారు. ఏజెన్సీ ఎన్నో సమస్యలు చాలా ఉన్నాయని ఎంత మంది రాజకీయాల్లోకి వచ్చిన ప్రజల సమస్యలను తీర్చిలేకపోయారని ఆయన అన్నారు. గిరిజనులు ఏజెన్సీ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం గూడూరు మండల కేంద్రానికి బీసీ రిజర్వేషన్ వస్తే జడ్పిటిసి బరిలో ఉండి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ పోతానని ఆయన హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను అభినందించిన మంత్రి



ప్రజాపక్షం/వరంగల్ : దక్షిణ భారతదేశంలో జల సంరక్షణ కేటగిరి 2లో వరంగల్ జిల్లాకు మొదటి స్థానం దక్కిన నేపథ్యంలో ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డుతో పాటు రూ.కోటి దక్కించుకొని అవార్డు స్వీకరించిన తరుణంలో బుధవారం హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లా కలెక్టర్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలియజేసి మాట్లాడుతూ జిల్లాలో జల సంరక్షణ చర్యలను విజయవంతంగా చేపట్టి రాష్ట్రానికి ప్రతిష్ఠ తెచ్చారని ప్రశంసించారు. జల వనరుల పరిరక్షణకు మరింత కృషి చేస్తూ ఆదర్శంగా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు.

# కుటుంబంలో, సమాజంలో ఉత్సాహంగా సేవలు

కలెక్టర్ సత్య శారద



ప్రజాపక్షం/వరంగల్ : వయోవృద్ధులు ఈ వయసులో ఎవరు అసహనానికి గురి కావద్దని, కుటుంబంలో, సమాజంలో ఉత్సాహంగా వారి సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు. జిల్లాస్థాయి అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవ వేడుకలు జిల్లా సంక్షేమ శాఖ అధికారిని ఆధ్వర్యంలో ఘనంగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్య శారద ఆరోగ్యవంతమైన, విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించడం కోసం ఈ తరం పిల్లలకి వయోవృద్ధుల అనుభవాలని అందించాలని, జిల్లాలో పైలట్‌గా చేస్తున్న స్ఫూర్తి కార్యక్రమం గురించి వివరిస్తూ ఆసక్తి కలిగిన వయోవృద్ధులు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి జీవిత పాఠాలను పిల్లలకి అందివ్వాలని కోరారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిలో దరఖాస్తులు ఎక్కువగా ఉండడంతో వయోవృద్ధుల కొరకు ప్రత్యేకంగా ఒకరోజు ప్రజావాణి నిర్వహిస్తున్నామని, అట్టి రోజును వయోవృద్ధులు వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజమణి మాట్లాడుతూ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా వారోత్సవాలు నిర్వహించామని, ఆ కార్యక్రమాలలో వయోవృద్ధులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధులకు అందించే సేవలను వివరించారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ అడ్వకేట్ సురేష్ తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టం గురించి వారికి వివరించి వారికి వచ్చిన సందేహాలను నివృత్తి చేశారు. అలాగే తల్లిదండ్రులు వారి ఆస్తులను పిల్లలకు గిఫ్ట్ డీడ్ ద్వారా మాత్రమే రిజిస్ట్రేషన్ చేయాలని సూచించడం జరిగింది. ఉచిత న్యాయ సలహాల కోసం 15100కి సంప్రదించాలని కోరడం జరిగింది. బ్రహ్మకుమారీస్ నుండి సరితా సిస్టర్ మాట్లాడుతూ, నేటి సమాజం ముందుకు వెళ్లాలంటే టెక్నాలజీ మాత్రమే కాకుండా వయోవృద్ధుల యొక్క సహకారం, వారి యొక్క జ్ఞానం చాలా అవసరమన్నిరు. ఎవరు ఎలా ఉన్నా వయోవృద్ధులు తమ తమ జీవితంలో ముందుకు వెళ్లాలని సూచించారు. గతాన్ని గుర్తుచేసుకొని బాధపడకుండా ప్రస్తుతాన్ని ఆనందించాలని కోరారు. వృద్ధాప్యం అనేది రెండవ బాల్యమని, కావున ఎప్పుడు ఆనందంగా సంతోషంగా గడపాలని సూచించారు. జిల్లా వయోవృద్ధుల కమిటీ సభ్యుడు మల్లారెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో వయోవృద్ధుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయని, వయోవృద్ధులు తమ గతాన్ని మరిచి ప్రస్తుత జీవనాన్ని సుఖ సంతోశాలతో కొనసాగించాలని కోరారు. తదనంతరం వయవృద్ధులతో ప్రతిజ్ఞ చేపించి, జిల్లాలో మంచి సేవలందించిన వృద్ధులకు జిల్లా కలెక్టర్ , అడిషనల్ కలెక్టర్ సన్మానించి వారికి జ్ఞాపిక అందజేయడం జరిగింది. అలాగే వారోత్సవాలలో భాగంగా క్రీడల్లో గెలిచిన వారికి బహుమతుల ప్రధానం చేశారు. జిల్లా కలెక్టర్ వయోవృద్ధుల సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారం కోసం నిరంతరంగా కృషి చేస్తున్నారని జిల్లా సంక్షేమ శాఖ అధికారినితో, జిల్లా వయోవృద్ధుల కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్‌ని సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, సిడిపిఓలు, సూపర్వైజర్లు, జిల్లా వయోవృద్ధుల కమిటీ సభ్యులు, జిల్లాలోని పలు వయోవృద్ధుల అసోసియేషన్ ప్రతినిధులు వయోవృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ దెబ్బకు బిల్లా, రంగాల జిల్లాల పర్యటన

స్థానిక సంస్థల నేపథ్యంలో ప్రజలు, రైతులు అంటూ మొసలి కన్నీరు : ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు, ఎమ్మెల్సీ సారయ్య




ప్రజాపక్షం/హనుమకొండ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక దెబ్బకు బిల్లా రంగాల జిల్లాల పర్యటనకు వస్తున్నారని మాజీమంత్రులు కేటీఆర్, హరీష్ రావుపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఫైర్ అయ్యారు. జిల్లాలలో పర్యటనకు విచ్చేసి స్థానిక సంస్థల నేపథ్యంలో ప్రజలు,రైతులు అంటూ ముసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. బుధవారం హనుమకొండ డిసిసి భవన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గం శాసనసభ్యులు కె ఆర్ నాగరాజు, శాసనమండలి సభ్యులు బస్వారాజు సారయ్య, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. సంక్రాంతికి గంగిరెద్దులు ఆడుకోవడం తెలుగు సంప్రదాయం, కానీ ఈ సారి ముందుగానే బీఆర్ఎస్ నాయకులు వచ్చారని, కవిత ఇచ్చే స్టోక్‌లకు హరీష్ రావు కోమాలోకి వెళ్లారని, సిసిఐ ఎవరి పరిధిలో ఉందో కనీస అవగాహన లేని వ్యక్తి హరీష్ రావు అన్నారు. సిసిఐతో చర్చలకు ముఖ్యమంత్రి ఉన్నారనే విషయం తెలిసి కపట వేషాలు వేశారని, గతంలో తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులను రెచ్చగొట్టి వారి చావులకు కారణం అయింది హరీష్ రావు, కేసీఆర్ కాదా అని,మళ్లీ ఇప్పుడు రైతులను రెచ్చగొట్టి తెలంగాణ రాష్ట్రంలో రైతులని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. మంగళవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం సిసిఐతో చర్చలు జరిపి బుధవారం నుంచి పత్తి కొనుగులు ప్రారంభించిందని, ఉనికిని చాటే ప్రక్రియలో భాగమే నిన్నటి హరీష్ రావు పర్యటించారని చెప్పారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దెబ్బకు మీ పరిస్థితి ఏంటో తెలంగాణ రాష్ట్రం చూసిందని, స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయనే నేపథ్యంలో బిల్లా రంగాల మాదిరి ఇద్దరు బయలుదేరారని, ఒకరు ఆదిలాబాద్ అని ఇంకొకరు వరంగల్ పట్టుకుని తిరుగుతున్నారని అన్నారు.దౌర్జన్యాలు, దోపిడీలు, దోచుకు తినడం ఇవే మీ ప్రధాన వృత్తులు అందుకే మిమ్మల్ని వైట్ కలర్ రౌడీలు అంటున్నామని కేటీఆర్, హరీష్ రావులను ఉద్దేశించి అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న పాల్గొన్నారు.



## సిపిఐ బస్సు జాతా జయప్రదం

ప్రజాపక్షం/ములుగు : నేడు (గురువారం) ములుగుకు వస్తున్న సిపిఐ బస్ జాతాను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ పిలుపునిచ్చారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఐ పార్టీ అనేక హక్కులు చట్టాలను సాధించిన పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో శతజయంతి ఉత్సవాల పేరుతోని జరుగుతున్న కార్యక్రమాలను జయప్రదం చేయాలని అందులో భాగంగా గురువారం ఉదయం 11 గంటలకు ములుగు జిల్లాకు మాజీ ఎంఎల్‌ఏ చాడ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బస్సు జాతా ములుగు కేంద్రానికి వస్తున్నందున సబ్బండ వర్గాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి అంజద్ పాషా, ముత్యాల రాజు, బుడిమె సదయ్య, గుంజె శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యకు అధిక ప్రాధాన్యత



ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ప్రజాపక్షం/జఫర్‌గడ్: విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం మండలంలోని కస్తూరిభా గాంధీ ఆదర్శ పాఠశాలలకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి కలిసి వరంగల్ ఎంపీ కడియం కావ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ మహిళల పురోగతే దేశ పురోగతిగా భావించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తుల కోసం కాకుండా వ్యవస్థ బలోపేతం కోసం పనిచేస్తుందన్నారు. విద్యార్థినిలు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని విద్యలో ముందుకు సాగాలని సూచించారు. కడియం శ్రీహరి మాట్లాడుతూ చదువుకు మాత్రమే జీవితాలను మార్చే శక్తి ఉందని, చదువుతోనే ఆర్థిక స్వేచ్ఛ, సమాజంలో గౌరవం లభిస్తాయన్నారు. ముఖ్యంగా విద్య, ఉద్యోగం, ఆర్థిక స్వేచ్ఛ, ఆరోగ్యంతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, పీఏసీఎస్ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు, బిక్షపతి, ఎల్లయ్య, మోహన్‌రావు, రాజేష్ నాయక్, వెంకట స్వామి, శ్రీనివాస్, బాబు, సుదర్శన్, యాదగిరి, అశోక్, సీహెచ్ కృష్ణమూర్తి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం



ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

ప్రజాపక్షం/భూపాలపల్లి : ఆరుగాలం కష్ట పడి పండించిన పంటను అమ్ముకునే సమయంలో దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని రైతులకు మద్దతు ధర లభిస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం భూపాలపల్లి మండలం కొంపల్లి, గుడాడ్ పల్లి, నేరేడుపల్లి, గొర్లవీడు గ్రామాలల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం కష్టపడి శ్రమించి పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రజా ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరలు పొందాలని రైతులను ఎమ్మెల్యే కోరారు. రైతుల సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఎవరూ ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా జరపాలని సంబంధిత శాఖల అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఏ నెంబర్ సుంకరి రామచంద్రయ్య, భూపాలపల్లి తహసిల్దార్ శ్రీనివాసులు, డిఆర్‌డిఓ బాలకృష్ణ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలు, పాల్గొన్నారు.

# ఆరోగ్య నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయం

నగర మేయర్ గుండు సుధారాణి




ప్రజాపక్షం/ఖిలా వరంగల్ : వరంగల్ నగరాన్ని ఆరోగ్య నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం వరల్డ్ టాయిలెట్ డే ను పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సెప్టిక్ ట్యాంక్, పబ్లిక్ టాయిలెట్ నిర్వాహకులు శానిటేషన్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్‌తో కలిసి పాల్గొని ఉత్తమ సేవలు అందించిన సెప్టిక్ ట్యాంక్, పబ్లిక్ టాయిలెట్ నిర్వాహకులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సెప్టిక్ ట్యాంక్ శుభ్రతపై ప్రజలలో అవగాహన కోసం సెప్టిక్ ట్యాంక్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ర్యాలీని మేయర్ కమిషనర్‌లు సంయుక్తంగా ప్రారంభించారు. అంతకుముందు ఏర్పాటుచేసిన సమావేశంలో మేయర్ మాట్లాడుతూ సమగ్రంగా బహిరంగ మల మూత్రాల విసర్జన రహిత నగరంగా తీర్చిదిద్దడానికి కృషి చేయడం జరుగుతుందని ఇందుకోసం చట్టంలో సూచించిన విధంగా ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి తప్పనిసరిగా ఇంటిలో ఉన్న పబ్లిక్ టాయిలెట్స్ సైతం సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్ర పరచుకోవాలని ఇందుకోసం గతంలో అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా వారి సహకారంతో హన్మకొండలోని ఆదర్శ కాలనీలో ప్రయోగాత్మకంగా చేపట్టి విజయవంతం అయ్యాయని ప్రజలు బహిరంగంగా మల మూత్ర విసర్జనకు చేయకుండా పబ్లిక్ టాయిలెట్స్‌ను వినియోగించుకోవాలని సేకరించిన మలాన్ని అమ్మవారిపేటలో గల ఎఫ్‌టిపికి తరలించబడుతుందని మేయర్ అన్నారు. సెప్టిక్ ట్యాంక్ నిర్వాహకులు ఏర్పాటుచేసిన ర్యాలీ బల్దియా ప్రధాన కార్యాలయం నుండి కాకతీయ మెడికల్ కళాశాల వరకు బైక్ ర్యాలీ కాకతీయ మెడికల్ కళాశాల నుండి కాజీపేట వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్, రాడేకర్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సానిటీ సూపర్‌వైజర్‌లు గోల్కొండ శ్రీను, నరేందర్, భాస్కర్‌తో పాటు సూపరింటిండెంట్ దేవేందర్ ఆస్కీ ప్రతినిధి రాజ్ మోహన్ రెడ్డి, సానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లపై కొర్రీలు ఎత్తివేయాలి



ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి

ప్రజాపక్షం/మహబూబాబాద్ : కేంద్ర ప్రభుత్వ సంస్థ సిసిఐ పత్తి పంట కొనుగోళ్లపై పెట్టిన రకరకాల కొర్రీలు రైతులకు శాపంగా మారాయని వాటిని వెంటనే ఎత్తివేసి రైతాంగాన్నీ ఆదుకోవాలని ఆత్మ కమిటీ చైర్మన్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ కురవి గ్రామ కమిటి సమావేశం లో సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాల, తుఫానులతో పత్తి దిగుబడి తక్కువై రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తేమ నిబంధ ఎత్తివేయకపోగా సిసిఐ, తేమ 8 శాతం నుండి 12 శాతం ఉంటేనే కొంటామని, 12 క్వింటాల నుండి 7 క్వింటాళ్లకు తగ్గించి కొనుగోలు చేయడం, కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకుంటేనే కొంటాము అని రకరకాల నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారాయని, వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి రైతులు ఆందోళన చెందుతున్న కొర్రీలు ఎత్తి వేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 21న కురవికి విచ్చేయుచున్న సిపిఐ వందేళ్ల ఉత్సవాల ప్రచార బస్ జాతకు కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ టౌన్ కార్యదర్శి తురక రమేష్, బుదమ వెంకన్న, నిలుగొండ నాగేశ్వర్ రావు, టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మార్చిలో మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో పనులు

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



ప్రజాపక్షం/కాజీపేట : కాజీపేటలోని రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను స్థానిక శాసనసభ్యులు కేఆర్ నాగరాజుతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సందర్శించారు. రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో జరుగుతున్న పనుల పురోగతి, మౌలిక వసతుల అభివృద్ధి, విభాగాల వారీగా జరుగుతున్న నిర్మాణ కార్యకలాపాలపై రైల్వే అధికారులతో ఎంపీ డాక్టర్ కడియం కావ్య సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ... కాజిపేట కోచ్ ఫ్యాక్టరీ 30 ఏళ్ల కల నెరవేరబోతుందని అన్నారు. కాంగ్రెస్ పాలనలోనే ఇది సాధ్యమైందని, ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనం అన్నారు. భూములు కోల్పోయిన వారికి అన్యాయం జరగకుండా చూస్తామని అన్నారు. భూ బాధితులతో పాటు స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. గతంలో ఇదే అంశంపై కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలిసి కోరానని వెల్లడించారు. రైల్వే యూనిట్‌లో స్థానికుల ఉద్యోగాలు కల్పించే అంశంపై పార్లమెంట్‌లో సైతం తన గళం వినిపిస్తానని స్పష్టం చేశారు. ప్రస్తుతం మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ మార్చి నెలలో ప్రారంభమవుతుందని అన్నారు. ప్రతి ఏడాది 600 కోచ్‌లను ఇక్కడ సిద్ధం చేస్తారని పేర్కొన్నారు. ఎక్కడ పనులు జాప్యం జరగకుండా చూడాలని అధికారులకు ఎంపీ సూచించారు. అనంతరం రైల్వే అధికారులు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నమూనా వివరాలను ఎంపీకి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఎంఈ ఆనంద్, జీజీఎం మురళీకృష్ణ,డీజీఎం శర్మ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కోచింగ్ నోటిఫికేషన్

ప్రజాపక్షం/నెక్కొండ : గిరిజన అభ్యర్థుల కోసం ఐటిడిఏ ఏటూరునాగారం ఉచిత కోచింగ్ శిక్షణను ప్రకటించింది. గ్రూప్ 1, గ్రూప్ 2, పోలీస్, బ్యాంకింగ్, డిఎస్‌సి తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవ్వదలచిన ఎస్‌టి అభ్యర్థులు 25 నవంబర్ సాయంత్రం 5 గంటలలోపు studycircle.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేయాలని అధికారులకు సూచించారు. ఎంపికైన వారికి నాణ్యమైన శిక్షణను అందించనున్నట్లు ప్రాజెక్టు అధికారి తెలిపారు.




## 'ఫైర్ అండ్ ఐస్' పాట ఆవిష్కరణ



జ్యోతి పూర్వజ్, పూర్వజ్, మనీష్ గిలాడ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సినిమా 'కిల్లర్'. చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను ధ్యానం నాన్నగారు ఆశీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్ పై పూర్వజ్, పద్మనాభ రెడ్డి.ఏ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పూర్వజ్ దర్శకత్వం వహిస్తున్నారు.ఈ సినిమా నుంచి ఫైర్ అండ్ ఐస్ సాంగ్ ను ఈ రోజు హైదరాబాద్ లో లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాక్షన్ కొరియోగ్రాఫర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ 15 మందితో అటాక్ చేసే ఒక యాక్షన్ సీక్వెన్స్ ప్లాన్ చేశాం. ఆ సీక్వెన్స్ రెడీ చేయడానికి మాకు 3 గంటలు టైమ్ పట్టింది. కానీ జ్యోతి వచ్చి అరగంటలో మొత్తం యాక్షన్ పార్ట్ చేశారు. మేము షాక్ అయ్యాం. ఈ సినిమాలో జ్యోతి చేసిన యాక్షన్ సీక్వెన్సులకు మంచి రెస్పాన్స్ వస్తుంది అన్నారు.

## కొన్ని సినిమాలు అనుకున్నంత రీచ్ కాలేదు

### చిట్ చాట్‌లో రాజ్ తరుణ్

యంగ్ ట్యాలెంటెడ్ రాజ్ తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్ 'పాంచ్ మినార్'. రాశి సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. నవంబర్ 21న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో రాజ్ తరుణ్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.సినిమాని ఈ ఏడాదిలోనే మొదలుపెట్టాం. ఇది ప్రాపర్ క్రైమ్ కామెడీ. కథ నుంచి బయటికి వెళ్లకుండా జానర్‌కి తగ్గట్టు ప్రతి సిచువేషన్ లోనూ మంచి ఫన్ ఉంటుంది. స్క్రీన్ ప్లే చాలా ప్రత్యేకంగా ఉంటుంది. నాకు కథ వినగానే చాలా నచ్చింది. నిర్మాతలు సినిమాకి కావలసిన ప్రతిదీ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సమకూర్చారు. మేము అడిగిన ఆర్టిస్టులని ఇచ్చారు. సినిమా మేము అనుకున్న దాని కంటే చాలా బెటర్ గా వచ్చింది. ఈ సినిమాలో ఒక కీలక మలుపులో వినిపించే పదం అది. దాంతో కథ ఇంకో మలుపు తిరుగుతుంది. వినడానికి చాలా క్యాచిగా ఉండే పదం కావడంతో టైటిల్ గా పెట్టాం. అంతేగాని పాంచ్ మినార్ అనేది ఒక ఫిజికల్ ఎంటీటీ కాదు. ఉద్యోగం సంపాదించే క్రమంలో ఈజీగా డబ్బులు సంపాదించాలనుకునే ఓ కుర్రాడు ఎలాంటి సిచువేషన్‌లో ఇరుక్కున్నాడు అనేది కథ. ఈ సినిమాలో నా క్యారెక్టర్ ఎంత నలిగిపోతుంటే చూసే వాళ్ళకి అంత నవ్వొస్తుంది. ఇది కంప్లీట్‌గా ఫిక్షనల్ స్టోరీ. నా గత కొన్ని సినిమాల్లో అనుకున్నంత రీచ్ కాలేదు. అయితే దానికి చాలా కారణాలు ఉండొచ్చు. ఈ సినిమా మాత్రం తప్పకుండా ఆడియన్స్‌కి రీచ్ అవుతుంది. నాకు నా కెరియర్ విషయంలో ఎలాంటి తొందరపాటు లేదు. నేను గత ఏడాదిన్నరగా కొన్ని ప్రాజెక్ట్స్ చేశాను. అవి ఒక్కొక్కటిగా వస్తున్నాయి.రాశి తెలుగు అమ్మాయి కాదు కానీ కష్టపడి తెలుగు నేర్చుకుంది. తన ప్రతి డైలాగు చాలా చక్కగా పలుకుతుంది. ఈ క్యారెక్టర్‌లో తను అద్భుతంగా పెర్ఫామ్ చేసింది.నేను కచ్చితంగా డైరెక్షన్ చేస్తాను. అయితే అది ఇప్పుడే కాదు. డైరెక్షన్ చేయాలంటే ఒక రెండు సంవత్సరాలు గ్యాప్ తీసుకోవాలి. దానికి సంబంధించిన ప్రిపరేషన్ చేసుకోవాలి. ఇవన్నీ చేయడానికి కొంత టైం పడుతుంది.నిన్న ఓపెనింగ్ చేసిన సినిమా మంచి థ్రిల్లర్. రామ్ భజరంగ్ ఇప్పటివరకు నేను చేసిన సినిమాలో హై యాక్షన్ ఉంటుంది. తెలుగు తమిళ్ లో చేస్తున్న సినిమా కూడా డిఫరెంట్ జానర్ సినిమా.



## 'ఆంధ్ర కింగ్ తాలూకా' ట్రైలర్ విడుదల



రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మహేశ్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా, కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర ఆన్ స్క్రీన్ సూపర్‌స్టార్ పాత్రను పోషిస్తున్నారు. వివేక్, మెర్విన్ స్వరపరిచిన ఈ సినిమా సంగీతం ఇప్పటికే అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కర్నూల్ లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ ఈవెంట్ కు భారీ సంఖ్యలో ప్రేక్షలులు హాజరయ్యారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో రామ్ పోతినేని మాట్లాడుతూ ఇది అభిమానుల సినిమా. భాగ్యశ్రీ అద్భుతంగా పెర్ఫార్మ్ చేసింది. గ్లామరస్ గా కనిపిస్తూ అద్భుతంగా పెర్ఫార్మ్ చేసే హీరోయిన్ తెలుగు సినిమాలో చాలా ఏళ్ల తర్వాత వచ్చిందని భావిస్తున్నాను. తనకి బ్రైట్ ఫ్యూచర్ ఉంటుందని నమ్ముతున్నాను. డైరెక్టర్ మహేష్ థియేటర్ కాదు మనలో సౌండ్ వచ్చే సినిమా చేశాడు. అద్భుతమైన సినిమా తీశాడు. తనతో కలిసి వర్క్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. మై డియర్ ఫ్యాన్.. తమ్ముడు.. నువ్వు వున్నావని నాకు తెలియకపోవచ్చు. కానీ నేనొక్కడినే ఉన్నానంటే కారణం నువ్వే. లవ్ యు కర్నూల్. 27న థియేటర్స్ లో కలుద్దాం. మిమ్మల్ని స్క్రీన్ మీద చూసుకోవడానికి రెడీగా ఉండండి అని అన్నారు. ఈనెల 27న ప్రతి ఒక్కరు ఈ సినిమాని థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను. నిర్మాత వై రవిశంకర్, సంగీత దర్శకులు వివేక్, మెర్విన్ పాల్గొన్నారు.



## టాలెంట్ ఉన్న వారిని ఎవరు ఆపలేరు

### 12ఏ రైల్వే కాలనీ ప్రీరిలీజ్ ఈవెంట్‌లో అల్లరి నరేష్

హీరో అల్లరి నరేష్ అప్ కమింగ్ థ్రిల్లర్ '12ఏ రైల్వే కాలనీ' ఎక్సయిటింగ్ ప్రమోషనల్ కంటెంట్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. నూతన దర్శకుడు నాని కాసరగడ్డ దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. పవన్ కుమార్ సమర్పణలో పోలిమేర మూవీ సిరీస్ తో పాపులరైన డాక్టర్ అనిల్ విశ్వనాథ్ షోరన్నర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ రాశారు. కామాక్షి భాస్కర్ల హీరోయిన్ గా నటిస్తున్నారు. నవంబర్ 21న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. హీరో అల్లరి నరేష్ మాట్లాడుతూ 64 సినిమాలు చేశాను. రిలీజ్ డేట్ దగ్గర పడుతుంటే టాక్ ఏంటి, ఓపెనింగ్స్ ఏమిటి ? ఎలాంటి రివ్యూస్ వస్తాయనే టెన్షన్‌గా ఉంటుంది. కానీ నాని ఫస్ట్ సినిమా చేస్తున్నాడు. తనకి ఎక్కడ టెన్షన్ లేదు. టాలెంట్ ఉన్న వారిని ఎవరు ఆపలేరు. నేను 35 మంది కొత్త డైరెక్టర్స్‌తో పని చేశాను. దాంట్లో చాలా మంది సక్సెస్ అయ్యారు. నేను డైరెక్టర్ ఆర్టిస్ట్ ప్రొడ్యూసర్ ఆర్టిస్ట్‌గా ఉండాలనుకుంటున్నాను. నవంబర్ 21న ఈ సినిమా ప్రేక్షకులకు ముందుకు వస్తున్నామన్నారు.

## 'ప్రేమంటే' పెద్ద హిట్ అవ్వాలి

### నాగ చైతన్య



శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పి, స్పిరిట్ మీడియా బ్యానర్ల మీద సొనాలి నారంగ్ సమర్పణలో నారాయణ్ దాస్ కె.నారంగ్ దివ్యాశీస్సులతో జాన్వీ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'ప్రేమంటే'. థ్రిల్లు ప్రాప్తిరస్తు అనేది ఉప శీర్షిక. ఈ మూవీలో ప్రియదర్శి, ఆనంది జంటగా నటించారు. ఈ సినిమాకు నవనీత్ శ్రీరామ్ దర్శకత్వం వహించగా, ఆదిత్య మేరుగు సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ మూవీ నవంబర్ 21న గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో మంగళవారం నాడు లవ్ ట్రోట్టర్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువ సామ్రాట్ నాగ చైతన్య, సెన్సేషనల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ ఈవెంట్‌లో నాగ చైతన్య మాట్లాడుతూ.. 'నారాయణ్ దాస్ కె నారంగ్ , సునీల్ నారంగ్ వారసత్వాన్ని జాన్వీ ముందుకు తీసుకు వెళ్తున్నారు. వీరి బ్యానర్‌లో 'లవ్ స్టోరీ' లాంటి మంచి సినిమాను చేయడం, వారి ద్వారానే శేఖర్ కమ్ముల పరిచయం అవ్వడం ఎప్పటికీ మర్చిపోలేను. ఇప్పుడు మళ్లీ 'ప్రేమంటే' అనే లవ్ స్టోరీ చిత్రాన్ని ప్రమోట్ చేసేందుకు రావడం ఆనందంగా ఉంది. నవనీత్ గారు మంచి పాయింట్తో కొత్త ప్రేమ కథను అందివ్వబోతోన్నారు. ప్రియదర్శి మంచి నటుడు. అన్ని రకాల పాత్రల్ని అద్భుతంగా పోషిస్తున్నారు. ఆనంది గారు 'కస్టడీ' చిత్రంలో ఓ చిన్న పాత్రలో నటించారు. ఆమె మంచి నటి. సుమని ఇలాంటి ఓ మంచి పాత్రలో చూడటం ఆనందంగా ఉంది. 'ప్రేమంటే' సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. 21న ఈ మూవీని అందరూ చూడండి' అని అన్నారు. శేఖర్ కమ్ముల మాట్లాడుతూ 'ప్రేమంటే' టీంకి కంగ్రాట్స్. ప్రియదర్శిని చాలా ఏళ్ల నుంచి గమనిస్తూనే ఉంటున్నాను. ఆయనెప్పుడూ మంచి కథల్నే ఎంచుకుంటూ ఉంటారు. నవనీత్ ఈ మూవీతో మంచి విజయం దక్కాలి. ఆనంది అద్భుతమైన నటి. ఆమె నటించిన చిత్రాలెన్నో చూశాను. యంగ్ టాలెంట్ ప్రస్తుతం ఇండస్ట్రీలో ఎక్కువగా వస్తోంది. 'ప్రేమంటే' చిత్రం పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. ఈ కార్యక్రమంలో వీడియో ద్వారా రానా దగ్గుబాటి బైట్ వినిపించారు. సురేష్ బాబు, నిర్మాత జాన్వీ నారంగ్, సుమ కనకాల, హీరో ప్రియదర్శి, హీరోయిన్ ఆనంది, డైరెక్టర్ నవనీత్ శ్రీరామ్, హైపర్ ఆది, లియోన్ జేమ్స్, కెమెరామెన్ విశ్వనాథ్ రెడ్డి, ఆర్ట్ డైరెక్టర్ అరవింద్ , డైలాగ్ రైటర్ రాజ్ కుమార్, లిరిక్ రైటర్ సనారే పాల్గొన్నారు.



నందమూరి బాలకృష్ణ, సంయుక్త, హీరో హీరోయిన్‌గా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన అఖండ–2: తాండవం డిసెంబర్ 5న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా వైజాగ్‌లోని జగదాంబ థియేటర్లో గ్రాండ్‌గా జరిగిన సాంగ్ లాంచ్ ఈవెంట్లో గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణతో పాటు డైరెక్టర్ బోయపాటి శ్రీను, హీరోయిన్ సంయుక్త తదితరులు హాజరై ఫ్యాన్స్‌లో జోష్ నింపారు. ఈ కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. 'సింహాచలం అప్పన్న ఆశీస్సులు తీసుకుని ఇక్కడికి వచ్చాం. మొన్న మన దెబ్బెంటో ముంబైలో హిందీవాళ్లకు చూపించాం. ఇంట గెలిచి రచ్చ గెలవాలంటారు. అఖండ ఫస్ట్ పార్ట్ మన దగ్గర ఎంత పెద్ద హిట్ అయిందో చూశారు. ఇప్పుడు సీక్వెల్ 'అఖండ: తాండవం' పాన్ ఇండియా రేంజ్లో బ్లాక్ బస్టర్ కాబోతోంది. కోవిడ్ టైంలోనే అఖండ సినిమా సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఆ సినిమా ఇచ్చిన ధైర్యంతో మిగతా సినిమాలు కూడా రిలీజ్ అయ్యాయి. ఇప్పుడు రిలీజ్ అయిన పాట ఐటమ్ సాంగ్ కాదు. కుటుంబం పండగ చేసుకునే నేపథ్యంలో వచ్చే సాంగ్. పాటలో సంయుక్తను చూశారు కదా.. ఆమె ఎంతో అందంగా ఉంది. సినిమాలో ఆమె నటన కూడా చూస్తారు. ఆమె హావభావాలు ఎంతో అద్భుతంగా పలికించి తన పాత్రకు న్యాయం చేసింది. అఖండలో జై బాలయ్య పాటను కంపోజ్ చేసిన భాను మాస్టర్ ఈ జాజికాయ పాటను అద్భుతంగా కంపోజ్ చేశాడు. ఇది కేవలం తెలుగు సినిమా కాదు. మన భారతీయ సనాతన హైందవ ధర్మం శక్తి, పరాక్రమాన్ని చాటిచెప్పే చిత్రం. మన జాతి మూలాలు ఏంటో తెలియజేసే సినిమా. అందుకే అన్ని భాషల్లో సినిమాను ప్రమోట్ చేస్తున్నాం. రేపు కర్ణాటకకు వెళ్లి అక్కడ ప్రమోట్ చేస్తాం. తర్వాత తమిళనాడుకు వెళ్తాం. మొన్న ముంబైలో మన దెబ్బకు హిందీ వాళ్లకు దిమ్మతిరిగిపోయింది. ఇక్కడకు వచ్చిన నా అభిమానులందరికీ ధన్యవాదాలు' అని చెప్పారు. డైరెక్టర్ బోయపాటి శ్రీను, హీరోయిన్ సంయక్త , నిర్మాత గోపీ ఆచంట పాల్గొన్నారు.

## 'అఖండ–2' పాట విడుదల

2012లో విడుదలై ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన సూపర్‌స్టార్ మహేష్ బాబు బిజినెస్‌మ్యాన్ మళ్లీ థియేటర్లలోకి రాబోతోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన రీరిలీజ్ టీజర్‌కు అంచనాలను మించే స్థాయిలో అద్భుతమైన స్పందన లభిస్తోంది. టీజర్ విడుదలైన కొద్ది నిమిషాల్లోనే సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతూ, ఫ్యాన్స్‌లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. డైరెక్టర్ పూరీ జగన్నాథ్ రూపొందించిన ఈ మూవీకి మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ఎస్ థమన్ అందించిన బీట్స్ అప్పట్లో సెన్సేషన్ సృష్టించాయి. థమన్ కంపోజ్ చేసిన ప్రతి పాట కూడా సినిమాకి ఎనర్జీని పెంచుతూ, మహేష్ బాబు స్టైల్‌ను మరింత హైలైట్ చేసింది. ఈనెల 29న ఈ సినిమా విడుదల చేయనున్నారు. ఆర్ఆర్ మూవీ మేకర్స్ బ్యానర్ పైనిర్మాత డా.వెంకట్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

## బిజినెస్‌మ్యాన్ రీరిలీజ్ టీజర్ విడుదల



## నితీశ్‌కుమార్ ఎన్నిక (మొదటి పేజీ తరువాయి)

శ్రావణ్ కుమార్ తెలిపారు. ఎన్‌డిఎ నాయకుడి ప్రతిపాదనను జెడి(యు)కి చెందిన విజయ్ చౌదరి ప్రతిపాదించగా, బిజెపి నాయకులు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా బలపరిచారు. ఎల్‌జెపి(ఆర్‌వి), హెచ్‌ఎఎం, ఆర్‌ఎల్‌ఎం ఎమ్మెల్యేలు కూడా బలపరిచారని శ్రావణ్ కుమార్ తెలిపారు. ఉదయం జనతా దళ్ యునైటెడ్ (జెడియు) శాసనసభా పక్ష నేతగా ఆ పార్టీ చీఫ్ నితీశ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ అంతర్గత సమావేశంలో నితీశ్ ఎన్నిక జరిగినట్లు రాష్ట్ర మంత్రి శ్రావణ్ కుమార్ తెలిపారు. శ్రావణ్ కుమార్ పిటిఐతో మాట్లాడుతూ, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు నితీష్ కుమార్‌ను జెడి(యు) శాసనసభా పక్ష నాయకుడిగా ఎన్నుకున్నారు అని అన్నారు. ముఖ్యమంత్రి సచివాలయంలోని 'సంవాద్'లో ఈ సమావేశం జరిగిందని, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలందరూ, పార్టీకి చెందిన 22 మంది శాసనమండలి సభ్యులు హాజరైనట్లు ఆయన తెలిపారు. 'నితీష్ కుమార్‌ను జెడి(యు) శాసనసభా పక్ష నాయకుడిగా నియమించాలనే ప్రతిపాదనను పార్టీ నాయకులు విజయ్ చౌదరి, ఉమేష్ కుష్వాహా ప్రతిపాదించగా, సీనియర్ జెడి(యు) నాయకుడు బిజేంద్ర యాదవ్ కూడా బలపరిచారు. తరువాత, ఈ ప్రతిపాదనను జెడి(యు) వర్కింగ్ జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఝా, కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ లాలన్ బలపరిచారు అని శ్రావణ్ కుమార్ అన్నారు. జెడియు శాసనసభా పక్ష నాయకుడిగా ఎన్నికైన తర్వాత, 'సమావేశానికి హాజరైన పార్టీ నాయకులనుద్దేశించి నితీష్ కుమార్ ప్రసంగించారు. రాష్ట్ర సంక్షేమం కోసం అవిశ్రాంతంగా కృషి చేయాలని ఆయన కోరినట్లు జెడియు నాయకుడు తెలిపారు.

### బిజెపి ఎల్పిగా సామ్రాట్ చౌదరి

కాగా, రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన బిజెపి శాసనసభ్యులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో తారాపూర్ ఎమ్మెల్యే సామ్రాట్ చౌదరిని బిజెపి శాసనసభా పక్ష నాయకుడిగా ఎంపిక చేసినట్లు యుపి డిప్యూటీ సిఎం కేశవ్ ప్రసాద్ మౌర్య తెలిపారు. బిజెపి శాసనసభా పక్ష ఉప నాయకుడిగా విజయ్ కుమార్ సిన్హాను కూడా ఎన్నుకున్నారని ఆయన అన్నారు. బిహార్‌లో శాసనసభా పక్ష నాయకుడి ఎన్నికకు మౌర్యను కేంద్ర పరిశీలకుడిగా నియమించారు. బిజెపి శాసనసభా పక్ష నాయకుడి ఎన్నికకు కేంద్ర న్యాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, మాజీ కేంద్ర మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతిని కూడా సహ పరిశీలకులుగా నియమించారు. ఇద్దరూ కూడా సమావేశంలో పాల్గొన్నారు. కొత్తగా ఎన్నికైన 10 మంది బిజెపి ఎమ్మెల్యేలు కలిసి చౌదరి, సిన్హా పేర్లను శాసనసభా పక్ష నాయకుడిగా, ఉప నాయకుడిగా ఎన్నిక కోసం ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలను పార్టీ శాసనసభ్యులందరూ ఆమోదించారని బిజెపి నాయకుడు ఒకరు తెలిపారు.





## ఆగడాలు మితిమీరుతున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. దేశంలో పేదప్రజల గొంతుకగా నిలుస్తూ ప్రజా ఉద్యమాలే ఊపిరిగా, 100 సంవత్సరాలలో ఎన్ని ఆటుపోట్లు అవాంతరాలు ఎదురైనా తట్టుకుని నిలబడగలిగిందని,అనేక రాజకీయ పార్టీలు వస్తూ పోతూ ఉంటటాయని, కానీ కమ్యూనిస్టు పార్టీ మాత్రం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మళ్లీ కమ్యూనిస్టు ఉద్యమాల్ని బలపరిచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాలలో తమ కార్యచరణ కొనసాగుతుందని, త్యాగాల చరిత్ర కలిగిన సిపిఐ పార్టీ చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందుకు బలమైన ప్రజా ఉద్యమం నిర్మిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తమ బాధ్యతగా స్వీకరించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బాలనర్సింహ్మా మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుండి దళిత మైనార్టీ వర్గాలపై దాడులు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయని, అంటరానితనం, కుల, మతాల పేరుతో ప్రజల మధ్యలో చిచ్చులు పెట్టే ప్రయత్నాలు పాలకపక్షాలు కొనసాగిస్తూనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్దె శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులే: తక్కళ్లపల్లి

దేశంలో రానున్న రోజులలో మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులేనని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సిపిఐ శతవసంతాల సందర్భంగా జోటేఘాట్ నుండి ప్రారంభమైన సిపిఐ బస్సు జాత బుధవారం వరంగల్ జిల్లాలోకి ప్రవేశించింది. ఈ బస్సు జాత బృందం సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, రాష్ట్ర సమితి సభ్యులు మారుపాక అనిల్, మణికంఠరెడ్డి, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, వారి బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరంలోని ములుగు రోడ్ నుండి పోచమ్మ మైదాన్ సెంటర్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అధ్యక్షతన పోచమ్మ మైదాన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు పాల్గొని మాట్లాడారు. ఇటీవల దేశంలో అనేక రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ బిజెపిని ఓడించడంలో చతికిల పడిందన్నారు. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో కమ్యూనిస్టులు పురోగమిస్తున్నారన్నారు. భారత దేశంలో మావోయిస్టులు తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం అన్న తమ పంథాను వీడి ప్రజాస్వామ్య ఉద్యమాలలో కమ్యూనిస్టులతో కలిసి రావాలన్నారు. దేశంలో చీలిపోయిన కమ్యూనిస్టులు సైతం ఏకం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో నిరుద్యోగం, అధిక ధరలు పెరిగి పోతున్నాయని, రూపాయి పతనంతో మరింత ఆర్థిక మాంద్యం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### కమ్యూనిస్టుల త్యాగాలు కప్పిపుచ్చాలనుకుంటే గుణపాఠం తప్పదు : ఇటి

కమ్యూనిస్టుల త్యాగాలను కప్పిపుచ్చాలనుకునే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ అన్నారు. బాసర నుండి బయలుదేరిన సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ నాయకత్వంలోని 'సిపిఐ బస్సు జాత' బుధవారం హైదరాబాద్ చేరుకున్నది. ఈ సందర్భంగా రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంకు చేరుకున్న బస్సు జాతకు నాయకత్వం వహిస్తున్న పశ్యపద్మ, వలి ఉల్లా ఖాద్రి, ఉప్పలయ్య, నరేంద్ర ప్రసాద్‌లకు సిపిఐ నాయకులు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. అనంతరం ఆడిటోరియం ప్రాంగణంలోని రావి నారాయణరెడ్డి విగ్రహానికి, అనంతరం అమరవీర స్తూపానికి పూలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ అమరవీరుల ట్రస్టు బోర్డు సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభనుద్దేశించి ఇటినరసింహ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా, సంపూర్ణ స్వాతంత్ర్యం దేశానికి కావాలని నినదించి, ఉద్యమించి ఉరికొయ్యలను ముద్దాడిన సిపిఐ చరిత్రను తొక్కి పెట్టాలనుకున్న బిజెపికి ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. ప్రశ్నించే గొంతులను ఉద్యమకారులను అక్రమ కేసులతో నిర్బంధిస్తున్నారన్నారు. మావోయిస్టు పార్టీ నాయకులను పట్టుకుని కాల్చి చంపి, ఎన్‌కౌంటర్ అంటూ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్‌లు, బిజెపికి చేస్తున్న మానవ హననానికి వ్యతిరేకంగా ప్రజా స్వామిక వాదులు, రోడ్లపైకి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

అంతకుముందు పశ్యపద్మ మాట్లాడుతూ.. ప్రజల హక్కులు, సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేసిన చరిత్ర సిపిఐకి ఉన్నదని, పోరాటాల ద్వారా అనేక హక్కులను, చట్టాలను సాధించుకున్నామని వివరించారు. ఎన్నికల కమిషన్ నుంచి మొదలు అన్ని సంస్థలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తమకు అనుకూలంగా లొంగతీసుకునేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ సిపిఐ వందేళ్ల ఉద్యమ చరిత్రను పునః సమీక్షించేందుకే వందేళ్ల ఉత్సవాలు అని అన్నారు.

### ద్విచక్రవాహన ర్యాలీ

సభ అనంతరం మోటారు సైకిల్‌పై యువత ఎర్ర జెండా చేత పట్టుకుని ర్యాలీగా ఫిలీం చాంబర్ వరకు బయల్దేరారు. అనంతరం అంబేడ్కర్, జగ్జీవన్ రామ్, పూలే దంపతుల విగ్రహాలకు దండలు వేసి నివాళులర్పించి, అక్కడి నుంచి గురుబ్రహ్మ నగర్‌కు చేరుకున్నారు. అనంతరం బస్ జాతకు వీడ్కోలు పలికారు. ఈ సభలో తెలంగాణ అమర వీరుల ట్రస్టు కార్యదర్శి కందిమల్ల ప్రతాప్ రెడ్డి, సభ్యులు వి.రత్నాకర్ రావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చంద్ర మోహన్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్ కాంపల్లి శ్రీనివాస్ మామిడి చెట్ల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సిఎం రేవంత్ రెడ్డితో పాటు యావత్ క్యాబినెట్ కల. ఆ కల సాధనకు ప్రతి ఒక్కరం ఆలోచిస్తున్నాం అడుగులు వేస్తున్నాం, ఈ లక్ష్య సాధనలో అందరినీ భాగస్వాములు చేసి సమగ్ర డాక్యుమెంట్ రూపొందించే బాధ్యతను సిఎం రేవంత్ రెడ్డి తనకు అప్పగించారు' డిప్యూటీ సిఎం వివరించారు. 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ఐఎస్‌బితో అధికారిక ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా ఇప్పటికే వివిధ శాఖల నుంచి నోడల్ ఆఫీసర్లను నియమించి వారి ద్వారా వచ్చిన సమాచారం మేరకు ఐఎస్‌బి బృందం ప్రాథమిక కసరత్తు పూర్తి చేసిందని, గ్లోబల్ సమ్మిట్ డిసెంబర్ 8, 9 తేదీల్లో జరగనుందని, తక్కువ సమయం అందుబాటులో ఉన్నందున పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి విజన్ డాక్యుమెంట్ ను తుది దశకు తీసుకురావాలని డిప్యూటీ సిఎం అధికారులకు సూచించారు. 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పన అనేది చరిత్రలో లిఖించదగిన అంశమన్నారు. ప్రజా ప్రభుత్వం మొదటి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు, వాటి అమలు, చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించే ప్రయత్నం చేశామని తెలిపారు. డిసెంబరు 9తో ప్రజా ప్రభుత్వం రెండవ సంవత్సరం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా రెండేళ్లలో ఏమి చేశామని చెప్పడం కంటే కూడా భవిష్యత్ తరాలకు మేలు చేకూరేలా ఏ విధమైన పునాదులు వేయబోతున్నామని, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచంతో పోటీపడేలా ఏ విధంగా తీర్చిదిద్దబోతున్నామనే విషయాలను ప్రపంచానికి విజన్ డాక్యుమెంట్ ద్వారా వివరించనున్నట్టు తెలిపారు. ఆర్థిక, పారిశ్రామిక, సర్వీసు సెక్టార్లలో జిడిపిని పెంచి 2047 లోగా మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ప్రజా ప్రభుత్వం అనుకున్న లక్ష్యాలు సాధించడానికి వివిధ శాఖల ద్వారా వ్యవస్థీకృతమైన పనులు ఏ పద్ధతుల్లో చేస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తామనేది వివరించడానికి కొంత కాలంగా డిజైన్ డాక్యుమెంట్‌పై కసరత్తు జరుగుతుందని డిప్యూటీ సిఎం వివరించారు. ప్రభుత్వం ఏ లక్ష్యాలు పెట్టుకుని ముందుకు పోతుందో వాటికి అధికారులంతా సహకరించి నిబద్ధతతో పనిచేశారని ఈ సందర్భంగా అందరికీ డిప్యూటీ సిఎం అభినందనలు తెలిపారు. ఈ రెండు సంవత్సరాల్లో కనబరిచిన నిబద్ధతతోనే 2047 డాక్యుమెంట్ రూపకల్పనకు అడుగులు ముందుకు వేయాలని అధికారులను డిప్యూటీ సిఎం కోరారు. 2047 విజన్ డాక్యుమెంట్, మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ అనే లక్ష్యాలు అసాధారణమైనవి అందుకు పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని డిప్యూటీ సిఎం తెలిపారు. ప్రభుత్వం అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు రాష్ట్రంలో అన్ని రకాలుగా అనువైన వాతావరణం ఉందని డిప్యూటీ సిఎం అధికారులకు వివరించారు. సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, స్పెషల్ జయేష్ రంజన్, సంజయ్ కుమార్, వికాస్ రాజ్, ఉన్నతాధికారులు శ్రీధర్, మహేష్ దత్ ఎక్కా, సందీప్ కుమార్ సుల్తానియా, నవీన్ మిట్టల్, హరీష్, బుద్ధ ప్రకాష్, కృష్ణ భాస్కర్, ముషారఫ్ అలీ, నాగిరెడ్డి, చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

## కీలక నిబంధనలు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

తెలియజేసింది. వేళ్ళూనుకున్న చట్టాలను గౌరవించడం సుపరిపాలనకు అత్యవశ్యకమని పేర్కొంది. న్యాయ వ్యవస్థ ఇప్పటికే పెండింగ్ కేసుల భారంతో కుంగిపోతోందని, ఈ భారాన్ని ఎలా తొలగించాలో చూడాలి తప్ప ఇంకా భారం పెంచకూడదని హితవు చెప్పింది. ట్రిబ్యునల్ సభ్యులు, ఛైర్మన్ల నియామకాలు, పదవీసేవల నిబంధనలు, పదవీకాలానికి సంబంధించిన నిబంధనలను సుప్రీంకోర్టు ఈ చట్టం నుండి తొలగించింది. న్యాయవ్యవస్థ తీసుకునే నిర్ణయాలపై పార్లమెంటు పెత్తనం చేయలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ లతో కూడిన ధర్మాసనం ఈ సందర్భంగా కటువైన వ్యాఖ్యలు చేసింది. తొలుత జారీ చేసిన ఆర్డినెన్స్‌లో ఉన్న నిబంధనలనే చట్టరూపంలోకి తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ ధర్మాసనం చాలా కటువైన వ్యాఖ్యలు చేసింది. 'అనేక తీర్పుల ద్వారా సమస్యలపై తుది నిర్ణయానికి వచ్చిఇప్పటికే పరిష్కారమైన వివిధ విషయాలను కేంద్ర ప్రభుత్వం సమ్మతించకుండా కోర్టు మార్గదర్శకాలను పద పదే తిరస్కరించే మార్గాన్ని ఎన్నుకుంది, ఈ విధమైన కేంద్ర ప్రభుత్వ వైఖరిపై మేం అనివార్యంగా అసమ్మతి తెలియజేస్తున్నాం, ట్రిబ్యునల్స్ పనితీరు, వాటి స్వతంత్రతకు సంబంధించి న్యాయస్థానం నెలకొల్పిన వేళ్ళూనుకున్న సూత్రాలను అమలు చేయడానికి బదులుగా దురదృష్టవశాత్తూ అవే నిబంధనలను చట్టసభ తిరిగి ఆమోదిస్తోంది లేదా తిరిగి అవే నిబంధనలను ప్రవేశపెడుతోంది. వివిధ చట్టాలకింద, నిబంధనల కింద రాజ్యాంగపరమైన చర్చకు గురైన తర్వాత ఆ నిబంధనలనే మళ్ళీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతోంది, ఇది దురదృష్టకరం'' అని ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించింది. ఈ ట్రిబ్యునల్ చట్టంలోని అనేక నిబంధనలు చెల్లుబాటు కావని, కాలం చెల్లినవని పేర్కొంటూ మద్రాస్ బార్ అసోసియేషన్‌తోపాటు ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేసి పైవిధంగా తీర్పు చెప్పింది. ట్రిబ్యునల్స్‌లో నియామకాలకు కనీస వయోపరిమితి 50 ఏళ్ళు దాఇ ఉండాలని పేర్కొన్న నిబంధనను కూడా వారు తమ పిటిషన్‌లలో వ్యతిరేకించారు.

ట్రిబ్యునల్ ఛైర్మన్, అందులోని సభ్యులకు పదవీకాలాన్ని నాలుగు సంవత్సరాలుగా నిర్దేశించిన నిబంధనను కూడా పక్కకునెట్టేసింది. న్యాయవ్యవస్థకున్న స్వాతంత్ర్యంలో పదవీకాల స్థిరత్వంతోపాటు ఇచ్చిన హక్కులకు కూడా రక్షణ ఉండాలని, విషయంలో న్యాయస్థానం ఇంతకుముందు ఇచ్చిన ఉత్తర్వులను వదిలేశారని ప్రధాన న్యాయమూర్తి విమర్శించారు. ఈ కేసులో రెండు కోర్టులు ఒకే కారణంతో ఇప్పటికే వీటిని తిరస్కరించాయని తీర్పులో పేర్కొన్నారు. ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయాలను జస్టిస్ చంద్రన్ కూడా సమర్థించారు. 2021 ట్రిబ్యునల్ సంస్కరణ చట్టం గతంలో రద్దైన ఆర్డినెన్స్‌కు మరో ప్రతిరూపంగా చట్టంగా అందరిముందుకూ వచ్చిందని, దీనికి చెల్లుబాటు లేదని అన్నారు. కొత్త సీసాలో పాత సారాలాగా ఉందని విమర్శించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com